# తత్త్వపరిశీలన - ప్రశ్నోత్తరములు

[illegible]

స్వామి సీతారామ్

ప్రధానగురువు, అచ్యుతాశ్రమము


[illegible]

శ్రీ అచ్యుతాశ్రమము

విరుపాపురగడ్డ, సానాపుర పోస్టు,

గంగావతి తాలూక, కొప్పళజిల్లా,

కర్నాటక - 583234



Tatwapariseelana - Prasnottaramulu

First Edition : 2012

Copies : 1000

Published on the Occassion of the
54th Jayanthi on 7.2.2012



All Rights Reserved by :
Sri Achyuthaasramamu



Price : **Rs.70/-**

Printed at :
Welcome Press,
2/5, Brodipet, GUNTUR

# ముందుమాట

శ్రీ అచ్యుతాశ్రమ ప్రధాన గురువులు బ్రహ్మశ్రీ స్వామి సీతారామ్‌గారు దేహమును చాలించి అప్పుడే సంవత్సరం గడచిపోయింది. వారు లేని లోటు పూరింపలేనిదైనది. శ్రీ అచ్యుతశ్రమ సాధకులందరి ప్రేమాభిమానములను చూరగొన్న ఆ అమృతమూర్తిని స్మరించుకొంటూ ముందుగా నివాళులు అర్పించుదాము. శ్రీ సీతారామస్వామిగారు గతంలో అచ్యుత తత్త్వప్రచార నిమిత్తము సాధకులుండే ప్రాంతములకు వస్తూ ఉండేవారు. వారు ప్రయాణము చేయలేని సమయము నుండి, అనగా సుమారు డిసెంబరు 2006 నుండి, వారు శరీరము వదలే వరకు అనగా 24.4.2010 వరకు అనగా సుమారు డిసెంబరు 2006 నుండి, ఉపదేశకులకు అచ్యుతాశ్రమ తత్త్వమును, సర్క్యులర్‌ల రూపములో 10, ప్రశ్నోత్తరముల రూపములో 113 అందించారు. వాటిలోని అక్షర దోషముల వంటివాటిని సవరించి, శుద్ధప్రతులను తయారు చేయించి, ఫోటోస్టాట్ కాపీలు తీయించి, స్వామిగారి ఆదేశముపై, శ్రీ అచ్యుతాశ్రమ ప్రెసిడెంట్ శ్రీ ఐ.నారాయణస్వామి గారు తెలుగు ఉపదేశకులకు పంపించుట జరిగినది. కొంతమంది సాధకుల కోరికపై, వారికి కూడా పంపించుట జరిగినది.

ఈ ప్రశ్నోత్తరములలోని విషయము అచ్యుతాశ్రమ సాహిత్యము నుండి గ్రహించబడినది. అచ్యుతతత్త్వములోని సారాంశమును వీటిద్వారా క్లుప్తముగా, సాధకులకు సంపూర్ణ అవగాహన కలిగించుటకు, శ్రీ స్వామివారు ఈ విధమైన ప్రయత్నము చేశారు. శ్రీ స్వామిగారు ఐ.యల్.టి.సి. ట్రైనింగ్ సమయములో వారి ఉపన్యాసములలో చెప్పిన



విషయాలన్నీ ఇందులో ఉన్నాయి. వారు లేని లోటు కలుగనీయక ముందుగానే, వారి పూర్ణ అనుభవాన్ని జోడించి, అచ్యుత తత్త్వాన్ని ఈ విధంగా క్లుప్తంగా, సమగ్రంగా ఈ గ్రంథంలో మనకు అందించారు. శ్రీ స్వామిగారి స్థానాన్ని అనగా అచ్యుతాశ్రమ ప్రధాన గురుస్థానాన్ని నింపడానికి అర్హులైనవారు ఒక్కరు కూడా లేకపోవడం మాత్రం దురదృష్టకరమైన అంశము. ఆ అర్హత పొందుటకు బ్రహ్మవిద్యా సాధకులు తగిన కృషి చేస్తారని ఆశించుదాము.

కీ॥శే॥ శ్రీ గాదిరాజు సూర్యనారాయణరాజు గారు, వారి ధర్మపత్ని శ్రీమతి సావిత్రమ్మగారు మరియు వారి కుటుంబసభ్యులకందరికి శ్రీ అచ్యుత ప్రభువులపై అపారమైన ప్రేమ, విశ్వాసము, భక్తిప్రపత్తులు ఉన్నాయి. వారి గృహమును చూస్తే చాలు, వారికి అచ్యుతస్వామిపై ఎంతటి భక్తిశ్రద్ధలున్నాయో అర్థమవుతుంది. అచ్యుతాశ్రమ గురువులు శ్రీ సీతారామస్వామిగారు, శ్రీ లక్ష్మణస్వామిగారు, శ్రీ నాడగౌడ్ గారు వారి టూర్ ప్రోగ్రామ్ లందు భీమవరములో ఉన్న వీరి గృహమును తప్పక దర్శించేవారు. వీరి ఆతిథ్యమును సంతోషముగా స్వీకరించేవారు. శ్రీరాజుగారు గొప్పదాతలు. 2006 వ సంవత్సరములో శ్రీ అచ్యుతాశ్రమము, విరుపాపురగడ్డయందు, "అశనధార" భవన నిర్మాణమునకు భూరి విరాళమును అందించారు. రాజుగారి కుటుంబ సభ్యులందరికీ శ్రీ సీతారామస్వామిగారిపై, శ్రీ లక్ష్మణస్వామిగారిపై అమితమైన ప్రేమ, భక్తి. అందుకే శ్రీ సీతారామస్వామిగారు అందించిన "తత్త్వపరిశీలన – ప్రశ్నోత్తరములు" అను ఈ గ్రంథ ముద్రణకు పూర్తి ఆర్థిక సహాయమును అందించారు. ఈ గ్రంథంలో శ్రీ సీతారామస్వామి గారి ఫోటోతో పాటు

శ్రీ లక్ష్మణస్వామిగారి ఫోటో కూడా ముద్రించాలని కోరుకొన్నారు. వారికి స్వామిగార్ల దివ్యమైన ఆశీస్సులు తప్పక లభిస్తాయి.

శ్రీ సూర్యనారాయణరాజుగారి అల్లుడు శ్రీ పి.వి.యస్.రాజుగారు కృష్ణా, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఖమ్మం, విశాఖపట్నం జిల్లాలలో మన గురువులు తత్త్వ ప్రచారము చేయుటకు, ఖర్చుకు వెనుదీయక ఎంతగానో తోడ్పడ్డారు. వారి కృషికి తగినంత ఫలితం లభించక పోయినను, శ్రీ అచ్యుతస్వామి అనుగ్రహించిన బ్రహ్మవిద్యకు తగిన ప్రచారము జరిగి, ఎక్కువమందికి అందాలని తపనపడ్డారు. వారి సత్సంకల్పము రాబోవు కాలములోనైనా నెరవేరగలదని కోరుకుందాము. వారిని, వారి కుటుంబ సభ్యులందరినీ శ్రీ యోగి అచ్యుతులవారు చల్లగా చూడాలని, వారి సమస్యలను తొలగించాలని, వారికి ఆధ్యాత్మిక ప్రగతిని కలుగజేయాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాము.

ఈ గ్రంథమును అందముగా ముద్రించిన "వెల్‌కమ్ ప్రెస్, గుంటూరు" అధినేతలైన శ్రీ పి.పురుషోత్తమ్ గారికి శ్రీ అచ్యుత గురుదేవులు ఆశీస్సులు అందించాలని కోరుకొంటున్నాము.

ప్రకాశకులు



## విషయసూచిక


| సీ.నెం. | విషయము | పుట |
| --- | --- | --- |
| | **తత్త్వపరిశీలన** | |
| 1. | గురువు | 1 |
| 2. | వాయుమథనము-అశనము | 3 |
| 3. | అంతఃకరణములు | 7 |
| 4. | ప్రాణయజ్ఞము | 11 |
| 5. | ప్రాణాయామము-అమృతవిద్య | 13 |
| 6. | సాధనాక్రమము | 23 |
| 7. | ప్రాణశక్తి-ప్రాణుడు | 34 |
| 8. | తపస్సు | 50 |
| 9. | గీతాసందేశము | 59 |
| 10. | యోగి - యోగము | 67 |
| 11. | మహావాక్యములు | 69 |
| 12. | ఉపనిషత్‌సారము | 82 |
| 13. | కాయకల్పము | 96 |
| | **ప్రశ్నోత్తరములు** | |
| 14. | కాయము-1 | 113 |
| 15. | ప్రాణుడు-2 | 116 |
| 16. | ప్రాణశక్తి -3 | 117 |
| 17. | ఆత్మ-4 | 119 |
| 18. | జీవి -5 | 120 |
| 19. | మనస్సు -6 | 120 |
| 20. | స్వధనము -7 | 121 |
| 21. | రథనాభి -8 | 123 |
| 22. | గురుస్థానము-9 | 124 |
| 23. | స్వరూపజ్ఞానము -10 | 124 |
| 24. | అశనము -11 | 125 |
| 25. | సాధన -12 | 126 |
| 26. | ప్రాజ్ఞస్థితి -13 | 127 |
| 27. | పంచప్రాణాలు-14 | 127 |
| 28. | ఇచ్ఛామరణము-15 | 127 |
| 29. | మూడు అగ్నులు-16 | 128 |
| 30. | ప్రకృతి-17 | 130 |
| 31. | త్రిగుణములు-18 | 132 |
| 32. | బుద్ధిగమ్యము -19 | 134 |
| 33. | బ్రహ్మచర్యము-20 | 136 |
| 34. | ఆత్మ -21 | 138 |
| 35. | రసములు -22 | 138 |
| 36. | బుద్ధిగమ్యం-23 | 139 |
| 37. | ఆత్మసంచారము-24 | 142 |
| 38. | చిత్‌శక్తి -25 | 143 |
| 39. | మనోదృష్టి -26 | 144 |
| 40. | విద్య-అవిద్య-27 | 144 |
| 41. | ఆత్మసర్వోత్తమః-28 | 147 |
| 42. | జ్ఞానప్రాప్తి-29 | 147 |

| సీ.నెం. విషయము | పుట | సీ.నెం. విషయము | పుట |
|---|---|---|---|
| 43. సమాధి -30 | 148 | 68. ఆధ్యాత్మసుఖము-55 | 168 |
| 44. తపోజ్వాల-31 | 149 | 69. ఆత్మజ్ఞానము-56 | 169 |
| 45. యోగి -32 | 150 | 70. శాంతిమంత్రము -57 | 170 |
| 46. యోగజీవనము-33 | 151 | 71. స్వర్గము -58 | 170 |
| 47. దేవుడెక్కడ-34 | 151 | 72. యోగనిద్ర - 59 | 171 |
| 48. అవతారములు-35 | 152 | 73. జీవన్ముక్తి - 60 | 171 |
| 49. స్థితప్రజ్ఞత-36 | 152 | 74. జీవశక్తి -61 | 172 |
| 50. ముక్తి-37 | 153 | 75. దేవుడున్నాడా?-62 | 172 |
| 51. జ్ఞాని-38 | 153 | 76. ద్వైతము-అద్వైతము-63 | 173 |
| 52. పితౄణము-39 | 154 | 77. అద్భుతములు-64 | 174 |
| 53. ఋషి-యోగి-40 | 155 | 78. యోగిలక్షణములు-65 | 175 |
| 54. ప్రత్యాహారము-41 | 156 | 79. అచ్యుతులవారు-66 | 177 |
| 55. ధ్యానము-42 | 156 | 80. త్రిగుణాతీతుడు-67 | 180 |
| 56. యోగధారణ-43 | 157 | 81. శ్రేష్ఠగుణము-68 | 181 |
| 57. భక్తి-44 | 158 | 82. గీతాభావము-69 | 183 |
| 58. ఉద్గీత-45 | 160 | 83. అనుభవములు-70 | 184 |
| 59. ఆత్మస్థానము-46 | 161 | 84. సన్యాసి-71 | 185 |
| 60. సాధనాక్రమము-47 | 162 | 85. అంతఃకరణములు-72 | 186 |
| 61. విశ్వాత్మ-48 | 163 | 86. జ్యేష్ఠశ్రేష్ఠప్రజాపతి-73 | 186 |
| 62. పరమాత్మ-49 | 164 | 87. దైవదర్శనము-74 | 187 |
| 63. అమృతప్రాప్తి-50 | 165 | 88. సాధన-సారాంశము-75 | 189 |
| 64. హృదయగ్రంథి-51 | 165 | 89. సాధనా ప్రగతి -76 | 190 |
| 65. సర్వాంతర్యామి -52 | 166 | 90. గురుత్వము-77 | 191 |
| 66. తురీయాతీతస్థితి -53 | 167 | 91. ఆధ్యాత్మబోధన -78 | 191 |
| 67. ఆదిత్యోపాసన-54 | 167 | 92. విజయాంధ్రవివరణ-79 | 193 |





| సీ.నెం. విషయము | పుట | సీ.నెం. విషయము | పుట |
|---|---|---|---|
| 93. ప్రాణశక్తివివరణ-80 | 195 | 113.కోరికల ఉత్పత్తి-100 | 242 |
| 94. అరవిందులు-సృష్టి-81 | 197 | 114.బ్రహ్మవిద్య-101 | 243 |
| 95. అచ్యుతాశ్రమము-82 | 199 | 115.బ్రహ్మము-102 | 244 |
| 96. గురువు-83 | 201 | 116.ఉపనిషత్ సమీక్ష-103 | 247 |
| 97. ఉపదేశము-84 | 203 | 117.అశనోత్పత్తికి ముందు-104 | 252 |
| 98. జ్ఞానసాధన-85 | 204 | 118.అశనోత్పత్తి - ఈశావాస్యము-105 | 253 |
| 99. ధర్మము-86 | 205 | 119.అమృతత్త్వము-స్థిరశాంతి -మోక్షము-106 | 255 |
| 100.భగవద్గీత-87 | 207 | 120.పరమాత్మ దర్శనము-107 | 257 |
| 101.తత్త్వము-88 | 213 | 121.దేహములోని ప్రేరణ-108 | 258 |
| 102.యోగవిద్య-89 | 216 | 122.ఆత్యంతిక బ్రహ్మ-109 | 260 |
| 103.సాంఖ్యయోగము-90 | 217 | 123.బ్రహ్మవిద్య-110 | 261 |
| 104.కర్మ-91 | 220 | 124.వైశ్వానరస్థితి నుండి ప్రపాజ్ఞస్థితి-111 | 265 |
| 105.తత్వసమీక్ష -92 | 222 | 125.ఆత్మదర్శనము-112 | 267 |
| 106.జీవన సమీక్ష-93 | 227 | 126.దేవుడు-పురుషుడు-113 | 269 |
| 107.సాధకుల ప్రశ్నలు-94 | 229 | | |
| 108.లింగోద్భవము-95 | 232 | | |
| 109.అచ్యుతుల జీవిత విశేషములు-96 | 234 | | |
| 110.మార్గము-97 | 239 | | |
| 111.జీవభూతము-98 | 240 | | |
| 112.దివ్యమానవ సమాజము-99 | 241 | | |

# తత్త్వ పరిశీలన

1. గురువు : ప్రభుయోగి అచ్యుతుల తత్త్వమును, వారిచే ప్రసాదించ బడిన యోగవిద్యను, సర్వమానవ బంధువులకు అందజేయు పవిత్ర కార్య నిర్వహణ కేంద్రాలుగా శ్రీ అచ్యుతుల పేరిట కొన్ని ఆశ్రమాలు నెలకొల్పబడినవి.

"ఆదివిద్య", "జీవవిద్య", "అమృతవిద్య" యను పేర్లతో ప్రసిద్ధమైన ఈ యోగవిద్యను, జనులకు అనుగ్రహించుటకు జీవనమును సాధనా క్రమమున నుంచి విశ్వ ఆదిధర్మమువలనను, అనాదితత్త్వమును శాశ్వతరీతిలో పునః స్థాపించుటకు, ప్రభుయోగి అచ్యుతుల అను గ్రహముతో విద్యనిచ్చుటకు, కొంతమంది సాధకులకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేసి ముందు కార్యక్రమాన్ని వివరించటమైనది. విద్య యొక్క నియమాలు వివరించటమైనది. శిక్షణాకాలములో ఈ యోగవిద్యకు సర్వులు అర్హులే అన్నారు, ప్రభుయోగి అచ్యుతులవారు. విద్యను ఉపదేశించుటకు "ప్రత్యక్ష గురువు" అవసరమని అన్నారు. అన్ని విధానాలు శిక్షణా కాలములో తెలియజేయబడును.

గురువు యొక్క విషయ నిర్ణయాన్ని శ్రీస్వామి విజయాంధ్రులు, శ్రీ స్వామి జయతీర్థులవారు బాగుగా వివరించినారు. గురువు సామాన్యులవలె అజ్ఞానిగా ఉండక, మన అజ్ఞానాన్ని పోగొట్టి సర్వచైతన్యాన్ని పొందుటకు కావలసిన జ్ఞానాన్ని పెంపొందించి మన స్వరూప జ్ఞానానికి కారణభూతుడు అగుటవలన సృష్టిలో మానవాళికి పెద్దవాడైనవాడు గురువు. ఇదియే "నగురోరధికం" అనుమాటకు అర్థము. జ్ఞానులైన గురువుగారు కూడ తమ శిష్యులకు విశ్వాత్ముని సాక్షాత్కారానికి కారణమైన ఆ సాధనను చూపించగలుగుచున్నారు. అనగా పరమాత్ముడు తనకంటే గొప్పవాడని



చెప్పినట్లు అగుచున్నది. శిష్యులు కూడ ఈ మర్మాన్ని తెలిసికొని వర్తించవలయును.

అయితే ఈ విద్య వ్యక్తి నుండి వ్యక్తికి రావలసినదే కాని, గ్రంథ పఠనము నుండిగాని, తదితర సాధనల నుండిగాని తెలియరాదు. ఆదినుండియు పరంపరగా అట్లే వ్యాప్తి చెందినదని ప్రభు అచ్యుతుల వారు నుడివియున్నారు. అయితే ప్రథమ వ్యక్తికి ఎట్లు అబ్బినది అను సందేహమునకు, "దైవము" వలననే యని ప్రత్యుత్తరము చెప్పుదురు. కావున ఆదిగురువు దేవుడు. ఇది ఆదివిద్య. ఈ విద్యను పరిచయము చేయువారు ఆదిగురువైన దేవుని ప్రతినిధియే. అందుకే "గురుదేవో భవ", "గోవిందభక్తే గురుభక్తిజాయే" అనుట. విద్యోపదేశము ఇచ్చినంత మాత్రాన అతని బాధ్యత ముగియలేదు. సాధకునకు అవసరమైన నియమముల విధించి, తన ఆదర్శము నుండి నియమపాలనము నుండి సాధనా నిష్ఠను సాధకుని మనస్సులో ప్రతిష్ఠింపచేసి ముందంజ వేయింపవలయును. ఎందుకనగా మానవులు, ఇతరులను అనుసరించు స్వభావము కలవారు. తాము శ్రేష్ఠులని భావించిన వారి ఆచార వ్యవహారములను నమ్మి వారి ననుసరించుటకే ప్రయత్నించెదరు. "యద్యదాచరతి శ్రేష్ఠః" (భ. 21. శ్లో. 3అ) అని గీతాచార్యులవారు బోధించినదియు ఇందు వలననే. సాధకునకు యుక్తమయిన ఆహార విహారములు అవసరము. అంతేగాక వినయవిధేయతలతో కూడిన మనః ప్రవృత్తి, విద్యార్థి దశలోనే అలవడవలెను. అట్టి సాత్త్విక గుణము వలననే బ్రహ్మత్వ ప్రాప్తి (జ్ఞానము) లభ్యమగును. గురుస్థానము నందున్నవారు సాధకులను ఆరీతిగా నుంచి, త్రికరణ శుద్ధిగా సాత్త్వికతను పెంచినపుడే, శిష్యుల కృషి ఉత్కృష్టముగా పరిణమించి ముందంజ వేసి, బంధవిముక్తులై జన్మసార్థకతనందగలరు.

వారి బంధనముల తొలగించ కలిగినది గురువే. "హరుడే" గురురూపము నందవతరించి కాపాడును" అని నిర్వచించిరి.

ఈ ప్రాణాయామమే – బ్రహ్మవిద్య, బ్రహ్మ సాక్షాత్కారానికి ఆవశ్యకమైనదీ – యోగవిద్య – నాభిలో స్థితమైన వాయువు అన్ని నాళాల్లో ప్రసరించు వాయువును లాగి – ఊర్ధ్వముఖముగా బ్రహ్మరంధ్రము వరకు పయనముసాగించుచున్నది. అనగా గురువు గారు చూపించిన రీతి – నాభియందు గలవాయువును ప్రయత్న పూర్వకముగా బ్రహ్మరంధ్రము వరకు పోనివ్వవలెను. అదే ప్రయత్నముతో వాయువును క్రిందికి నెట్టవలయును. అనేక మార్లు ఈ విధంగా చేసి, ప్రాణాన్ని బ్రహ్మ రంధ్రములో విరమింప చేయు అనుభవము వచ్చినపుడు – సమాధిస్థితి ప్రాప్తించును. ఇది సూక్ష్మముగా వివరింపబడినది. తక్కిన విషయాన్ని గురుస్థానమున ఉన్నవారు వివరించవలెను. ఈ సాధన ఇచ్చుట వలన మహాపుణ్యము కలుగలగదు. శ్రీ ప్రభువుల కృపకు పాత్రులగుట సులభమగును.

* * *

2. వాయుమథనము – అశనము: "శాంతిమంత్రములు" ఋతం పదిష్యామి" అన్నారు. ఋతమును తెలిపి అందే స్థితులైన వారు ఋషులు. ఋతము అనగా ఋక్ నుండి ప్రారంభమై తత్ (అది ఆత్యంతికమైన సత్యమైనది అనగా శాశ్వతమైనది). ఐక్యమగు వరకు ఉండునది. ఆశాశ్వత చేతనపు వ్యాప్తి యొక్క వైవిధ్యత అంతయు అనుభవముచే తెలుసు కొనవచ్చును. ఆ ప్రజ్ఞకు అనుగుణముగా వర్తించువారిని "ఋషులు" అని చెప్పియున్నారు. "స్వామిజయతీర్థ".

ప్రాణ చైతన్యము మూర్ధ్నా యోగధారణం" (భ.గీ.) ప్రాణ చైతన్యము బ్రహ్మరంధ్రము వరకు పోవుటకు (మూర్ధ్నము వరకు) బలము



కావలసియుండును. ఆ బలం పొందుటకు "అశనం" దేహము నందే ఉత్పత్తి కావలెను.

కావుననే "అశనగతప్రాణః" అని బ్రహ్మసూత్రకారులు అన్నారు. అశనమనునది స్థూలాహారము కాదు. ఇది వాయురూపము. అనగా సూక్ష్మాహారము. దానినే ప్రత్యాహారమన్నారు. అది ఉత్పత్తి అగునది మనదేహమున ఉన్న వాయుమథనం వల్లనే. నియమ బద్ధముగా సాగెడు సాధకుడు మొదట తన దేహమున వ్యాప్తమైన ప్రాణచేతనము నుండి ఉత్పత్తి అయిన వాయువును దేహమందలి వేరు వేరు భాగము లందు ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన పేర్లతో పిలువబడుచున్న ఈ వాయువును నాభినుండి పైకి అనగా బ్రహ్మరంధ్రము వరకు గురుస్థానము ద్వారా ఆడించవలయును. మరియు క్రిందకు అదే విధముగా చేయ వలయును. అనగా ఈ వాయువును మథించవలయును. ఈ మథనమున పై గతి, క్రింద గతి, ఆడించునపుడు దీర్ఘ మథనం వల్ల ఉష్ణశక్తి ఉద్భవించి శారీరక దోషములు నశించును. మధ్యగతి అనగా తొందరగా చేయుగతి (అంటే పొట్టి గతి) వల్ల దేహమునందు ఉష్ణోగ్రత పెరిగి జ్ఞాన వికాసమునకు తోడ్పడును. ఈ మూడు గతుల యందు కలుగు మథనం వల్ల "ఆశనం" ఉత్పత్తి అగుచున్నది. ఇదియే పుణ్య గంధమనియు విభూతి అనియు "మన్నా" అనియు (బైబిల్) పిలువబడుచున్నది.

ఈ అశనమును మెదడు కేంద్రమునందున్న ప్రాణ చైతన్యము రథ, నాభి, సుషుమ్న, స్థానము నుండి స్వీకరించబడును. ప్రాణుడు అశన స్వీకారం అయిన తర్వాత బహిర్గతముగా సంచరించుచున్న మనస్సును తన వద్దకు లాగుటవల్ల మిలనము ప్రాణుని యందు అగుచున్నది. మనో ప్రాణములు ఏకమై బ్రహ్మరంధ్రము (మూర్ధ్నము) నందు స్థితమగునపుడు అనేకవిధములైన అనుభూతులు కలుగును. (బహుధాయః

కరోతిసః) ఈ స్థితి యందు మనో చాంచల్యము నశించి సమాధి స్థితి (అచలప్రాప్తి) కలుగును. దీనినే సమాధి స్థితి అందురు.

ఈ స్థితి యందు చాలాకాలము నిలిచినపుడు తాను ఈ జన్మయందు చేయవలసిన కర్తవ్యమును గురించి తపస్సు సాగును. దీని తీవ్రత ఎక్కువయై లక్ష్యము నందు ఏకాగ్రత కలిగి ప్రార్థన చేయునపుడు మనో పరిపక్వత పొంది జ్ఞానము ఉత్పత్తి అగుచున్నది. దర్శనము, ప్రేరణ వల్ల అన్నియు గోచరమగుచున్నది. ఈ విజ్ఞానమునే "చిత్కళ" అనుచున్నారు. ఈ స్థితి యందు సచ్చిదానంద భూతి కలుగుచున్నది. ఈ స్థితిలో అప్రమత్తత కావలెను. ఇది నిరీంద్రియ ఆనందం. ఇది మనదేహమునందున్న "ఆత్మ (ప్రత్యగాత్మ) సహజస్థితి. ఈ ఆనందానుభూతిలో అమృతప్రాప్తి కలుగుచున్నది. "ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్". ఈ అఖండ ఆనందానుభవం అయిన పిదప స్వరూప జ్ఞానమై (Know Thy Self - Knothi) పునః బహిర్ముఖుడైన వారిని యోగి అని పిలుచుచున్నారు. పరమాత్మ స్వరూపాన్ని తెలుసుకొని స్థిత ప్రజ్ఞత తెలుసుకొని పరమ పదవి పొంది యున్నారని చెప్పుచున్నారు. ఈ విషయమై "భగవద్గీత" యందు విశదీకరించియున్నారు.

ఈ స్థిత ప్రజ్ఞుడు సమత్వ భావంతో వర్తించును. తన కర్తవ్యము భగవంతుని సేవ అనుభావనతో లోకకళ్యాణానికి గాను శ్రమించు చున్నాడు. దీనినే "కర్మఫలత్యాగ" మన్నారు. చివరకు మోక్షాన్ని కూడా అపేక్షింపక"

"సమదుఃఖ సుఖం ధీరం సో–మృతత్వాయ కల్పతే"

(భ.గీత – అధ్యా2. శ్లో.15)



అనునట్లు జగత్తు సేవకు ఎన్ని జన్మములు వచ్చినను అది భాగ్యమని తృప్తి చెంది సంతోషముతో సదా భక్తి భావనతో సేవ చేయుచూ అమృతత్వాన్ని (చిరజీవనాన్ని) పొందుచున్నాడు. దీనినే పరమపదవి అనుచున్నారు. తాను జన్మ పొందిన తర్వాత పొందవలసిన అత్యంతిక ఉన్నతస్థితి ఇదే.

పైన తెలిపిన విషయములు అనుభూతి పొందుటకు ఆశ్రమము నందు సాధన క్రమమును తెలియచేయుచున్నారు. ఇది జపమనియు, వేద విద్య, జీవ విద్య, అమృత విద్య, బ్రహ్మ విద్య, శ్రీవిద్య 'నిత్య జీవన మార్గము" అను పేర్లతో వ్యవహరింపబడుచున్నది. సాధన అనుభవము లేకపోవుటవలననే తత్వజ్ఞుల భాష తెలుసుకొనుట కష్టము కావున బైబిల్, ఖురాన్, సూక్తులు అర్థముకావడం దుర్లభము. ఇటీవల కాలంలో వచ్చిన వేదాంతులు సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్ మొదలైన వారి బోధనలు ఒకదానికొకటి భిన్నమని జనులు ఊహించి తమకు తెలిసిన పద్ధతులను చేయుటవలన అనేక సిద్ధాంతములు వెలసియున్నవి.

శ్రీ అచ్యుత గురువుగారు తత్త్వమనునది ఒక దేశం, జాతి, మత, లింగ, భాషల వారికే కాదు. మొత్తము జగత్తునకే. మనుష్యత్వము, ముక్తి, ఆనందము, దేవుడు ఏవిధంగా మార్పు కాకుండా శాశ్వత స్థితియందున్నదో ఆ విధముగనే మనుష్యులకు, ముక్తికి ఆనందమునకు దైవమును తెలుసుకొనుటకు సాధన కూడా ఒకటే కాని అనేకములు కావని వారి నిర్ణయము. విశ్వమే వారికి కర్తవ్యరంగము. భారతదేశము ఒక్కటే కాదు తత్వప్రసారము విశ్వమందలి దేశములన్నింటికి అవసరమని అన్నారు. వారి తత్వ విషయమై వివరముగా చెప్పుటకు "స్వామి విజయాంధ్రుల వారు సమర్థులు. అందు వల్లనే వారిని శ్రీ గురువుగారు "నావాణి"

అన్నారు. "శ్రీ జయతీర్థుల" వారిని "నాచేయి" అన్నారు. ప్రస్తుతం ఆశ్రమములో ఉన్న తత్వగ్రంథములన్నియు వారు వ్రాసినవే.

విశాలదృష్టితో తప్పులను దిద్దుకొని సర్వులకు సామాన్యరీతిలో అర్థమగునట్లు వ్రాయుటయే కాక, నిజాన్ని దాచకుండా, అసత్యాన్ని చేర్చకుండా, నిర్దాక్షిణ్యముగా, ఏకదృష్టితో వ్రాయవలసినదిగా "శ్రీ అచ్యుత గురువుగారు" "శ్రీస్వామి జయతీర్థుల వారిని ఆదేశించి యున్నారు.

* * *

3. అంతఃకరణములు : ప్రభు శ్రీయోగి అచ్యుతులవారు సమాధి గైకొనక ముందు మాహాత్మ్యములు ఏమియు చూపి ఉండలేదు. మహిమల ప్రదర్శనము వలన ఆత్మశక్తి వ్యర్థమగుటయేగాక, అహంకారము ఆవహించి, జ్ఞాన వికాసమునకు ఆటంకము ఏర్పడునని "ప్రభువుల" నిర్ణయము. అద్భుత క్రియలు చూచి జనులు భయభ్రాంతులగుదురే కాని, జ్ఞానాకాంక్షులు కాజాలరనుచుండిరి. లోకకళ్యాణమునకు జ్ఞానులైన "ఋషులు" తమ తపశ్శక్తిని వినియోగించుచున్నారు. అది సహజ క్రియయే గాని మహిమ ప్రదర్శనము కానేరదు. "నేను అదే విధముగ విశ్వ శ్రేయస్సుకొరకు ఒక మాహాత్మ్యము చేయవలసి యున్నది. చేయుదును. ఇక ముందు అట్టిది ఎవ్వరూ చేయజాలరు" అని ప్రభు శ్రీ యోగి అచ్యుతులు చెప్పియున్నారు.

సరళజీవనము, ఉన్నత ఆదర్శములతోడనే మానవుడు తన జీవన సార్థక్యమును పొంది, లోకశ్రేయస్సు సాధనతో సాధ్యము కాగలదని తాము ఆచరించి చూపియున్నారు. జ్ఞానము లేకుండా కేవలము కర్మ శ్రద్ధతో గాని, కర్మాచరణ లేకుండా కేవలము జ్ఞానముతో గాని వైయక్తిక, సామాజిక కళ్యాణము సమకూరదు అన్నారు ప్రభువులు. యోగము



(జ్ఞానయుత కర్మాచరణ) చేతనే అయ్యది ప్రాప్తించునని బోధించిరి. జ్ఞానప్రాప్తి కేవలము విచార (బుద్ధి) శక్తితో కాజాలదు. దేహాంతర్గత ముఖ్యశక్తులైన "ప్రాణ-జీవుల" మిలనమై మన నడినెత్తిన ఉన్న "బ్రహ్మ రంధ్రమున" ఆనందానుభవమై జ్ఞాన వికాసము కావలసి యున్నది. ఇందుకు యోగవిద్యయే శరణ్యము. ఇది జ్ఞానాకాంక్షులకు ప్రభువుల సందేశము.

అచ్యుత ప్రభువులు హంపి క్షేత్రము చేరి, రెండున్నర సంవత్సరములు "రత్నకూట" గుహలో తపోజీవనము సాగించి శ్రీ విజయీంద్ర స్వాముల ప్రార్థన మేరకు 1949 వ సంవత్సరములో ఆదర్శ కర్మానుష్ఠాన బ్రహ్మ విద్యాప్రసరణ కేంద్రముగా "ఋష్యమూకాశ్రమము"ను విరుపాపుర గడ్డయందు స్థాపించి తత్త్వాకాంక్షులయిన పెక్కురకు విద్యోపదేశము కావించినారు. శిష్యసమేతులై ఆశ్రమ భూమిలో స్వంత వ్యవసాయము చేసినారు. తాము ఒక సిద్ధపురుషుని వలన వారి ప్రాంతములో ఈ "అమృతవిద్య" ను పొందినారట. దీనిని చూపించు సాధనను ఆశ్రమములో "ఉపదేశము" అని అనుచున్నారు.

ఈ దేహములో ఉండి "నేను" అనుచున్న చేతనమే "ఆత్మ" అన్నారు. ప్రత్యగాత్మ, విశ్వాత్మకాదు. దీని సహజ స్థితి సత్-చిత్- ఆనందము అనునది అనుభవ సిద్ధము. ఈ స్థితులను యోగ విద్యాసాధనతో పొంది ఆనందము అనుభవించినవాడే తన్ను తాను ఎరిగినవాడు. దీనినే లాటిన్‌భాషలో "KNOTHI" అన్నారు. అనగా KNOW THY-SELF.

మనస్సు - బుద్ధి - చిత్ - అహంకారములు ఆత్మయొక్క అంతః కరణములని చెప్పుదురు. అనగా చతుర్ముఖములు అని కూడా చెప్పుదురు. భక్తి, దాని యొక్క ఐదవ ముఖము ఈ నాలుగును వేరు వేరు గాక

ఆత్మలో కలిగెడి వేర్వేరు స్థితులని చెప్పవచ్చును. ఇచ్ఛ కలిగినపుడు అది మనోవ్యాపార మనియు, విమర్శించుకొన్నప్పుడు బుద్ధియనియు, నిర్ణయాత్మక శక్తికి చిత్తమనియు, నేను శక్తుడను చేయగలను. ఇత్యాది భావన కలిగినపుడు అహంకార మనియు మన గురువులు చెప్పియున్నారు. ఈ "ఆత్మ" ఇంద్రియ సంబంధ సుఖాదులకు ఆకర్షింపబడి చింత, ఆశ, మోహములకు చిక్కిన స్థితిలో 'జీవి" అనియు, ఇంద్రియాతీతమైన అంతర్ముఖత ఆనందానుభవ స్థితిలో "ఆత్మ" అనియు ఈ దేహమునందలి చేతన మనియు వర్ణించినారు. దేహములోని ప్రాణము వలన ఏర్పడు శక్తిని క్రియాశక్తి అంటారు. ప్రాణమున్నంత వరకే ఆత్మ దేహము నందు ఉండుటకు సాధ్యమగుచున్నది. శ్వాసక్రియ జరగడం ఈ ప్రాణశక్తివల్లనే. ఆత్మ మనస్సు కంటె భిన్నమని తెలిసికొనవచ్చును.

భగవద్గీతలో మన దేహములో రెండు శక్తులు ఉన్నాయని, అందులో ఒకటి "క్షరము" అని అనగా నాశనమగునది, వేరొకటి "అక్షరము" అనగా నాశరహితమగునది, అనగా ప్రాణము అని, ఆత్మ జీవశక్తి అని పేర్కొన్నారు. ఈ ప్రాణుడు దేహము నందున్న జీవిని (ఆత్మను) పరమాత్మునితో కలుపుచున్నది. భగవద్గీతలో "కూటస్థ అక్షరః ఉచ్యతే" ప్రాణము నాశనము లేనిది. ప్రాణము వంతెనవలె "జీవాత్మ – పరమాత్మను" కలుపునది అని అర్థము.

ప్రాణాయామమునకు అనగా ప్రాణునికి అవసరమైన వ్యాయామమునకు సర్వవ్యాపకమై, సర్వభూత హృదయస్థితమై ఆడుచున్న ఆచైతన్యమును ఆది స్థితికి గొనిపోవుటకు 'గతాగతి' అవసరమైనందున, ఆ గతిని చేసి చూపిననే కాని బోధపడదు. దూరమునుండికాని, నోటితో వర్ణించి చెప్పుట కాని, కాగితముపై వ్రాసి చూపించుట కాని సాధ్యము



కాదు. కనుకనే చెవి దగ్గర "గతాగతి" జరిపి చూపించు పద్ధతినే ఉపదేశమని, సాధనమని ఆశ్రమములో అనుచున్నారు. దీనికే ఆదివిద్య, జీవవిద్య, అమృతవిద్య అని అనేకమైన పేర్లు వాడుకలో ఉన్నవి.

ఈ సృష్టి యావత్తు భగవంతుని (విశ్వాత్మ) యొక్క లేశ మాత్రపు చైతన్యమే అన్నారు ప్రభువులు. శ్రీ యోగి అచ్యుతులవారు "ఆత్మ ఒక్కటే (విశ్వాత్మ) అమరం అన్నారు. దీనికి పుట్టుక, చావులేదు. దీని నుండే మొట్టమొదట "ప్రాణశక్తి" తర్వాత "జీవశక్తి" ఉత్పత్తి అయినది. ఆత్ముని యొక్క ఆనందస్థితిలో ఈ "జీవశక్తి" ఉత్పత్తి అవుతుందని ప్రభుయోగి అచ్యుతులు అన్నారు.

"ఆనందాద్ధ్యేవ ఖలు ఇమాని భూతాని జాయన్తే"

"తైత్తిరీయ ఉపనిషత్"

భగవద్గీతలో దీనినే "మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః " అన్నారు. బ్రహ్మసూత్రకారులు "ఓం ఆత్మ సర్వోత్తమః ఓం" అన్నారు. కావున ఆత్మ – విశ్వాత్మ ఒకటే. (దేవుడు అని అర్థం). తక్కిన వారందరూ విభూతులు అనగా జీవమాత్రులే అని ప్రభువుల వారి భావన. కావున జీవాత్మ సంయోగానికి సాధకమైన సూత్రాత్మ ప్రాణమన్నారు.

ఆది నుండి సదా అంతర్ముఖము నందున్న భగవంతుని చైతన్య స్పందనము బహిర్గతమై రూపుగొన్నవే అవతారములు. అవతారము లన్నియు ఆర్తజనుల ప్రార్థనవల్లనే వచ్చినవన్నారు మన గురువుగారు. తత్త్వసాధనలో తన్ను తాను తెలిసికొని సమన్వయ దృష్టి కలిగి,భూత దయ, పరామర్శలతో తన దేహము ద్వారా చేయగల సేవయే పరోపకారము అన్నారు ప్రభువులు. "పరోపకారార్థం ఇదం శరీరమ్" అన్నారు. ధర్మము యొక్క ఆంతర్యాన్ని తెలుసుకొనవలెను. జీవుడు దేనిని

ధరించి ఉన్నాడో అదే ధర్మమన్నారు. ఆ జీవి ధరించిన ఆ ప్రాణ చేతనాన్నే ఆశ్రయించి, దాని గమ్యాన్ని తెలిసికోవలసి యున్నది. ఈ స్వధర్మములో మరణిస్తే శ్రేయస్కరము. దీన్ని తెలిసికొనక బయటి దాన్ని నమ్మి ఆధారపడినచో అది భయానక మన్నారు. భగవద్గీతలో "స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః" అని చెప్పబడినది. మన గురువుగారు ఇది వర్ణ ధర్మాలకు సంబంధించినది కాదు అని అన్నారు. ఈ ప్రాణశక్తినే ఈశ్వరశక్తి అన్నారు తత్త్వజ్ఞులు. అర్థమగుటకు దీన్ని స్థూలమైన మాటల్లో "వాయుచేతనము" అన్నారు. "వాయు జీవోత్తమః" అని కూడా అన్నారు.

## 4. ప్రాణయజ్ఞము

ప్రాణయజ్ఞము : దేని వలన మనము ఉన్నామో, ఏది ఉన్నపుడు మనము అన్ని కార్యములు చేయగలమో ఆ ప్రాణుడే ఆధారము. ఆ ప్రాణుడు మన దేహములో ఏ విధముగా ఉన్నాడు ? "అశనగతః ప్రాణః " అశనం వలన ప్రాణుడు జీవించుచున్నాడు. అశనమనగా స్థూల ఆహారము కాదు. మనదేహములో ఉన్న వాయువును మథించినపుడు ఉత్పత్తి యగు ఒక శుద్ధాంశము అశనము. ఇది వాయురూపము. ఇది ప్రాణునికి ఆహారము. దీనికై ప్రాణవిద్య సాధనము. ఈ ప్రాణయజ్ఞమే జీవవిద్య. మన దేహములో ఉన్న జీవుని, ఆత్మను (బ్రహ్మను) తెలుసుకొనునట్లు చేయునది బ్రహ్మవిద్య అని మన గురువులు పలుమార్లు చెప్పియున్నారు.

ఉపనిషత్తుల యందు ప్రాణాన్ని "వామన" అన్నారు.

"ఉర్ధ్వం ప్రాణ మున్నయతి అపానం ప్రత్యగస్యతి ।
మధ్యే వామన మాసీనం విశ్వే దేవా ఉపాసతే॥"

"కఠోపనిషత్"



అనగా ఈ ప్రాణము ప్రాణవాయువును పైకి లాగుచున్నది అపాన వాయువును క్రిందకు నొక్కుచున్నది. ఇది దేహము మధ్యలో ఉన్నది. ఈ వామనుని, విశ్వంలో ఉన్న దేవతలందరు ఉపాసించు చున్నారు. ఇచ్చట "వామన" అను శబ్దము చెప్పునదీ పంచవాయువుల ఉత్పత్తికి కారణమైన ప్రాణచేతనమునే. ఈ ప్రాణుడు "రథనాభి" యందు సంచరించుచున్నాడు. ఆత్ముడు ప్రతిష్ఠితమైన బ్రహ్మరంధ్రానికి దిగువ స్థలము నుండి భ్రూమధ్యము వరకు అని అర్థము చేసికొనవలయును.

ఈ ప్రాణుడు ఆత్మ ఉన్న బ్రహ్మరంధ్రములో చేరవలయును. అప్పుడు "ప్రాజ్ఞ" స్థితి ప్రాప్తమగును. ఇదే యోగస్థితి. ఇది ఎట్లు సాధ్యము ? మనస్సు వలననే కాని సంకల్పము నుండి కానేరదు. అందుకు అశనోత్పత్తి కావలెను. ఈ అశనాన్ని ప్రాణుడు స్వీకరించు చున్నాడు. ఈ అశనాన్నే "పృథివ్యాం పుణ్యగంధోస్మి" అన్నారు (ఋగ్వేదం శ్రీ సూక్తం). విభూతి అని కూడా అన్నారు. కాని కేవలము వాయుమథనమే యోగం కాదు. మరియు మానసిక ఆలోచనలు యోగ క్రియ కాదు. మనస్సు విషయమై మహర్షులు ఛాందోగ్యోప నిషత్తులో

"తన్మనోదిశం దిశం పతిత్వాన్యత్రాయతన
మలబ్ధ్వా ప్రాణమేవో పశ్రయతే।
ప్రాణ బంధనం హి సోమ్య మన ఇతి"। (6-8-2శ్లో)

అనగా మనస్సు నలుదిక్కులకు వెళ్ళి చాంచల్యము కలదై ఎక్కడా ఆశ్రయము దొరకక తిరిగి ప్రాణాన్నే ఆశ్రయించు చున్నది. మనస్సును బంధించుచున్నది ప్రాణమే. మనస్సునకు చాంచల్య స్థితి తొలగునది ప్రాణుని యందు లీనమైనపుడే అన్నారు. ప్రాణుడు అశన స్వీకారము వలన బలీయుడైనపుడు మనస్సును అంతర్ముఖ స్థితికి లాగుచున్నాడు. ప్రాణుని ఇదే ఉపనిషత్తు నందు

"ప్రాణో హపితా, ప్రాణోమాతా, ప్రాణోభ్రాతా,
ప్రాణఃస్వసా, ప్రాణ ఆచార్యః ప్రాణోబ్రాహ్మణః (7-15-1)

అన్నారు. అనగా ప్రాణుడు, తండ్రి, తల్లి, సోదరుడు, సోదరి, గురువు అన్నియుతానే. ఇది అందరి దేహముల యందు ఉన్నదన్నారు.

* * *

5. ప్రాణాయామము – అమృతవిద్య : అచ్యుతాశ్రమములో ప్రార్థన సమయమునందు శాంతి మంత్రములు పఠించునపుడు మొదట, తుదిని ప్రణవ సంకేతమైన "ఓం' చేర్చు పరిపాటి కలదు. ప్రణవమున సమైక్యమై మనస్సు శాంతి స్థితి పొందగలుగును. కోరికలను ఆశించి చేయు నామ జపాదులలో ప్రారంభమున మాత్రము "ఓం"చేర్చుదురు. సమస్త మంత్రములకు మాటలకు ప్రణవమే మూలము అనే సంకేతమే ఇది.

1. ఓం శాంతిః శాంతిః శాంతిః

ఇచ్చట సర్వ మూలకారణుడైన దేవుడు సదా శాంతియందు సమస్థితుడు. ఆయనను దర్శించినపుడే మనకు "శాంతి" అని శ్రీస్వామి జయతీర్థుల వారు వివరణ ఇచ్చినారు. శాంతియే మానవుడు పొందగల పరమ ఉచ్ఛ స్థితి అని శ్రీ అచ్యుతప్రభువుల నిర్ణయం. శాంతికి జ్ఞానమే మూలము. అందుకు తపస్సు అనగా ప్రణవోపాసనయే ఆధారము.

2. ఓం తత్ సత్ శాంతిః ఓం

ప్రణవము ద్వారా అదే రీతి శాంతిస్థితుడైన దేవుని శాంతికి పోల్చగలిగిన శాంతిని శాశ్వతముగా పొందవచ్చును.

3. ఓం శ్రీ గురుభ్యో నమః ఓం

ప్రణవోపాసన క్రమము నెరుగుటకు గురువే ఆధారము. అందువలన గురువునకు నమస్కారము.



4. ఓం హరిః ఓం

విశ్వవ్యాప్తమైన సర్వమును లో గొన్న చేతనము ఏదో, దాని మూలకముగా గమ్యము చేరవలసి యున్నది.

5. ఓం శివాయ నమః ఓం

సదా శాంతిస్థితుడు శివుడు. ఆయనకు నమస్కారము. మన దేహము నందలి ప్రాణ చేతనమును హరితో, మనశ్శక్తిని శివునితో పోల్చియున్నారు. అలాగే వివిధ చేతనములకు వివిధ దేవతలు ఉన్నారు.

6. ఓం ఆత్మ సర్వోత్తమః ఓం

ఇది ప్రభు అచ్యుతుల స్వంత సూత్రము. శివ సర్వోత్తమః, హరి సర్వోత్తమః ఇత్యాది సూత్రములను గ్రంథములలో చూడవచ్చును. కాని "ఆత్మ సర్వోత్తమః" అనుట ఏ గ్రంథములో కనిపించుట లేదు. దేవుడు సర్వాతీతుడు గనుక ఆయనను సర్వములో చేర్చుట అనుచితమని శ్రీ అచ్యుత ప్రభువులు అన్నారు. శ్రీ ప్రభువులు, "ఆత్మ" అనగా మన దేహము నందు ఉండునది కాదు. మన దేహములో ఉండునది ప్రత్యగాత్మ. ఆత్మ ఒక్కడే – దేవుడు. పుట్టుక, చావు లేనివాడు. తక్కిన వారందరు విభూతి రూపాలే అన్నారు. మన దేహములో ఉన్న జీవిని (ప్రత్యగాత్మను) కూడా ఉపనిషత్తులయందు ఆత్మ అన్నారు. ఇది విశ్వాత్మ కాదు. మానవ దేహమునందున్న జీవికి (ప్రత్యగాత్మ) పుట్టుక, సాయుజ్యము ఉన్నవి అన్నారు శ్రీ అచ్యుతుల వారు.

7. ఓం వాయుజీవోత్తమః ఓం

జీవుల ఉత్తమగతికి వాయువే ఆధారమని నిర్ణయము. మన దేహము, మనస్సులకు అంటిన దోషములను తొలగించి అంతర్ముఖతను

పొంది, ఆనందానుభవము, జ్ఞానోదయము అగుటకు వాయుమథనమే ముఖ్యసాధనము గనుక జీవులకు వాయువు ఉత్తమము.

8. ఓం అథ ఏవ ప్రాణః ఓం

వాయువును ఆశ్రయించి సాగునపుడు ఆవాయువు యొక్క మూల చేతనమైన ప్రాణుని ఎరుగవచ్చును.

9. ఓం ప్రాణస్తథానుగమాత్ ఓం

ఆప్రాణునితో మనస్సు మిలనమై సాగి, మూర్ధ్నమున (బ్రహ్మ రంధ్రమున) స్థితము కావలసి యున్నందున ఇట ప్రాణుడు ముఖ్యము. సర్వసృష్టికి కారణమైనందున ఐక్యానికి ప్రాణుడే కారణము.

10. ఓం ఆకారస్థ లింగాత్ ఓం

ఈ ప్రాణలింగము మూలతః ఆకారములో (నిత్యదేహము) స్థితమైనది. ఇచ్చట కూడా ఆకారము గల సర్వప్రాణుల దేహము నందు స్థితమైనది.

11. ఓం అశన గతః ప్రాణః ఓం

ఈ ప్రాణుడు అశనధారియై ఉన్నాడు. వాయు మథనములో ఈ ప్రాణుని ఆధారమైన "అశనము" దేహమున ఉత్పత్తి అగుచున్నది.

సాధన చేయుటయందు "స్వామి జయతీర్థులు" విశదీకరించిన కొన్నింటిని తెలిసికొనవలసియున్నది. పైన ఉదహరించిన సూత్రములు ఈ సాధనకు సంబంధించినవే. ఈ సాధనా క్రమాన్ని "జపమ"ని మన గురువుగారు తెలియచేసియున్నారు.

లోకహితార్థమై చేయు జపమునకు "జపయజ్ఞం కుర్యాత్" అనుచున్నారు. తమకు ప్రియమైన ఏదో ఒక భగవన్నామమును మనస్సునందే ఉచ్చరించుకొనుటను "నామస్మరణము" అని జ్ఞానులు



అనుచున్నారని "స్వామి జయతీర్థులవారు' విశదీకరించినారు. మానవుడు తన్ను తాను తెలిసికొనుటకు "జప" మను యజ్ఞమును చేయవలెనని బోధపడుచున్నది. జప మనగా జనోలోకము నుండి పృథివీ లోకము వరకు వ్యాప్తమైన వాయువును "గతాగతి" యందు ఉంచు క్రియ. ఇదే జపయజ్ఞము. ఈ యజ్ఞము మూలముననే ప్రజాపతియు (సృష్టికర్తయైన బ్రహ్మ) జగత్తును సృష్టించెనని, ప్రజలకు కామధేనువువంటి ఈ యజ్ఞము నిచ్చెనని, దీనివలన వారు తమలో గల కల్మషములను నాశన మొనర్చుకొని పరిశుద్ధులై దేవతలను ప్రసన్నులను జేసికొని, పరస్పర సహకారముతో సృష్టి యొక్క హితము సాధించవలెనని "శ్రీకృష్ణుడు" భగవద్గీత యందు బోధించి యున్నాడు.

కఠోపనిషత్తు నందు –

న ప్రాణేన నాపానేన మర్త్యో జీవతి కశ్చన ।
ఇతరేణ తు జీవన్తి యస్మిన్నేతా వుపాశ్రితౌ॥

పంచమవల్లి – 5వ శ్లోకం

తా॥ కేవలము ప్రాణ అపానములచే మానవుడు జీవించుట లేదు. జీవుడు ప్రాణ అపాన వాయువులపై ఆధారపడలేదు. ప్రాణచేతనము వాయు సేవతో లభించు అశనముపై ఆధారపడును.

మన దేహములోని ప్రాణుని నుండి వాయువు ఉత్పత్తియగుచున్నది. ప్రాణస్పందన వలన పుట్టిన వాయువు దేహము యొక్క వేర్వేరు భాగములయందు వేర్వేరు పేర్లతో పిలువబడుచు, ప్రాణుని పంచముఖములని పిలుచుకొనుచున్నవి. దీనికి కేంద్రం హృదయం. "HEART" ఈ వాయువు ప్రాణుడనియు, ఈశ్వరుడనియు పిలువబడినది. ఈ వాయువును దేహమునందలి "శంఖము" (కంఠము) మూలకముగా

ఆడించుచు వాయుమథనము చేయవలెను. దీనినే మన ఆశ్రమములో జపము అనుచున్నాము. భగవద్గీతలో "యజ్ఞానాం జప యజ్ఞోస్మి" (విభూతి యోగము – 25వ శ్లోకం) అన్నారు. మానవ దేహములో త్రికూటము (సుషుమ్న) జనోలోక మనెడి స్థానము నందు ప్రాణచేతనము స్పందించుట వలన పుట్టినది ఈ వాయువు. ఇది భ్రూమధ్యము నుండి (త్రికూటము నుండి) నాభివరకు (పృధ్వి) దేహమంతయు సంచరించుచున్నదని భగవద్గీత, ఉపనిషత్తుల యందు వివరించబడినది. ఈ క్రియ తల్లి గర్భము నుండే ప్రారంభమైనది. శిశువు తల్లి గర్భములో ఉన్నపుడు ఈ క్రియ సహజముగా నడచుచుండెడిది. శిశువు భూగర్భమునకు వచ్చిన తరువాత మనస్సు ఇంద్రియ మూలకముగా బయటగాలి లాగుడు శక్తికి లోనై బహిర్వ్యాప్తి పొందినపుడు తన దేహములో తల్లి గర్భములో ఉన్న సహజస్థితి తప్పి ముక్కుద్వారా అనగా ఊపిరితిత్తులు పనిచేయడం ద్వారా శ్వాస ఉచ్ఛ్వాశ, నిశ్వాసములు కలుగుచున్నవి. అప్పుడు క్రిందిభాగమునందు వాయువు సంచరించడం వలన కఫదోషములు ఎక్కువగుచున్నవి. కఫదోషముల వలన ప్రాణశక్తి మూలస్థానమును (బ్రహ్మరంధ్రము) మూర్ధ్నా చేరుటకు అవకాశము లేదు. గీతయందు "మూర్ధ్నా యోగధారణమ్" అన్నారు. దీనినే కొన్ని సంస్థలవారు "శ్వాసపై ధ్యాస" ఉంచమన్నారు. అయితే శ్రీకృష్ణభగవానుడు భగవద్గీతలో "నాసాభ్యంతర చారిణౌ" అన్నాడు. బయటగాలిని 'అనలము' అని కొన్ని చోట్ల ఉపయోగించినారు. మన దేహములో ఈ క్రియ సహజముగా నడుస్తూ ఉన్నపుడు మనకు వేరే గురువు ఎందుకు అనే ప్రశ్న వస్తుంది. శిశువు మాతృగర్భములో ఉన్నప్పుడు సహజముగా నడిచిన ఈ క్రియ, మాతృగర్భము నుండి బయటకు వచ్చిన తరువాత తప్పిపోయినది. కావున సాధనాపరుడైన ప్రత్యక్ష గురువు



ద్వారా ఈ క్రమము ఉపదేశించబడవలయును. అప్పుడు సాధన గావించిన, మనకు అంటిన దోషములు నివారించబడునని శ్రీ విజయాంధ్ర స్వాములవారు సమర్పకంగా బోధించియున్నారు. శ్రీ ప్రభుయోగి అచ్యుతుల వారి తత్త్వదర్శనముపై అనేక విధములుగా ప్రసారం చేసి యున్నారు.

ఈ జపము చేయు క్రమము నందు మూడు స్థితులు ఉన్నవి. మొదటిది శబ్దముతో చేయు దీర్ఘగతి. తదనంతరం శబ్దము నందే గురుస్థానము వద్ద (భ్రూమధ్యము వద్ద) శబ్దముతో వేగముగా చేయుగతి. తరువాత శబ్దము లేని స్థితిలో తనకు తానుగా నడచు నిశ్శబ్ద స్థితి. ఈ సమయమున ఆ వాయువు యొక్క గతాగతి యందు లక్ష్యము నుంచి చేయునది. ఈ విధముగా మూడు స్థితులయందు చేయు సాధనను అజపగాయత్రి అనుచున్నారు.

కఠోపనిషత్తునందు సాధన చేయు క్రమము బోధించబడినది.

త్రిణాచికేతస్త్రిభిరేత్య సన్ధిం
త్రికర్మకృత్తరతి జన్మమృత్యూ ।
బ్రహ్మజజ్ఞం దేవమీడ్యం విదిత్వా
నిచాయ్యే మాం శాన్తి మత్యన్త మేతి॥

(ప్రథమవల్లి – 17వ శ్లో)

మూడు అగ్నులను ఉంచి (ఆహవనీయ, గార్హపత్య, అన్వాహార్య) వీటిని తెలిసికొని యజ్ఞము చేయువాడు మృత్యువును గెలుచుచున్నాడనే భావము. అయితే స్థూలాగ్ని పూజవలనగాని, యజ్ఞము, దాన కర్మలవలన గాని, అనుష్ఠానములు వ్రతములు, పూజలు, మంత్రతంత్రముల వలన గాని జన్మము, మృత్యువును దాటుట సాధ్యముకాదని మన గురువులు అన్నారు.

అందువలననే "త్రిణాచికేత స్త్రిభిరేత్య సంధిం" అని చెప్పియున్నారు. ఇది మన దేహమునందు జరుగు విద్యక్రమాన్ని తెలిసికొని ఆ విధముగా చెప్పబడియున్నది.

మూడు అగ్నులు అనగా మొదట వాయు మథనం వలన ఉత్పత్తి అగు అగ్ని (శాఖ). రెండవ స్థితిలో ఆ శాఖయే ఊర్ధ్వ ముఖముగా తీవ్రమై విద్యుత్తుగా మారి వివిధ రూపములలో కనిపించు విద్యుదగ్ని. మూడవ స్థితిలో ఈ వాయువునకు, అగ్నికి (విద్యుత్తులకు) ప్రాణమైన ప్రాణాగ్ని యొక్క ఊర్ధ్వగమనము. ఇది మూర్ధ్నములో (బ్రహ్మరంధ్రము) చేరినపుడు మృత్యువునుండి దూరమై ఇచ్ఛామరణ స్థితి ప్రాప్తించును. ఈ మూడింటిని సమర్పకముగా ఉపాసించునపుడు ప్రాణము బ్రహ్మ రంధ్రములో చేరుచున్నది. ఈ స్థితి చాలసేపు కలిగినపుడు తపస్సు అంటే తెలియనగును. ఈ తపస్సు తీవ్రమయినపుడు జీవ ఆత్ముల ఐక్యస్థితి కలుగుటవలన జ్ఞానము ఉదయించి ఆత్యంతిక శాంతిని (మోక్షమును) పొందుటకు సాధ్యమగునని మన గురువుగారు అన్నారు. అందువలననే "నహి జ్ఞానేన సదృశం" (భగవద్గీత – అధ్యా.4 – శ్లో.38) అన్నారు శ్రీకృష్ణభగవానుడు. అనగా జ్ఞానముతో సమానమైనది లేదని భావము.

ఈ విద్య అభ్యాసానికి త్రిసంధులు ఈవిధంగా ఉన్నాయి. 1. ప్రదోష కాలము – సాయంకాలము సూర్యాస్తమయం అయిన తరువాత. 2. రాత్రి పరుండునపుడు. 3. తెల్లవారుజామున – అనగా బ్రాహ్మీ ముహూర్తములో (3.30 నుండి 5.00) ఈ విద్యను అభ్యసించు కాలము. ఈ క్రమమును తెలిసికొని ఆహార నియమముతో సాధించు సాధకుడు ఇచ్ఛామరణి అగునని ఉపనిషత్తుల యందు విశదీకరించి యున్నారు. ఇందుకు సాధన అవసరము.



ఇట్టి జపమును ఆచరించువాడు బ్రహ్మత్వమును (జ్ఞానమును) పొందును. ఆత్మ యొక్క సహజత్వమైన ఆనందమును అనుభవించును. కనుక వేదవిహితమైన యజ్ఞయాగాదులను చేసినను, విడచినను, మానవుడు జపమును చేసే తీరవలయును.

దానివలననే బ్రహ్మత్వము సిద్ధించునని మనశ్రుతి వాక్యము ఉన్నది. ఉపనిషత్తులయందు "జిజీవిషేత్ శతం సమాః" అన్నారు. ఈ విషయమై అచ్యుతప్రభువువారు 120 సంవత్సరాల వరకు జపము చేయవలెనని చెప్పియున్నారు. మన గురువుగారు ఈ జపమునే "ప్రాణోపాసన" అని చెప్పియున్నారు. ప్రాణమునకు అశనప్రాప్తి అనంతరం ప్రాప్తియగు ధ్యాన, ధారణ, సమాధులయందు సుప్తముగా ఆత్మ (జీవాత్మ – మనుష్యదేహములో) బ్రహ్మరంధ్రములో ఉన్న (ఆత్మ) హెచ్చరించబడి తపస్సు నడచును. ఈ స్థితి యందు తమ ఇష్టదేవతల ప్రార్థన వలన వరములు పొందవచ్చును. అయితే వీరి వలన జ్ఞానము పొందుటకు అవకాశము లేదు. తపస్సు తీవ్రతరం అయినపుడు జ్ఞానము పొందగలడు. తరువాత ప్రపంచమున చేయవలసిన కర్తవ్యము ముగించి ముక్తుడగుటకు సాధ్యమగును. జగత్తున జరుగుచున్నదంతయు ఈ స్థితిలో క్షణకాలములో కాంచనగునని మన గురువర్యులు చెప్పియున్నారు. కావున జ్ఞానమే ముఖ్యము.

శ్రీ అచ్యుత ప్రభువులు ఆధ్యాత్మ గ్రంథముల విషయమై మాట్లాడుచూ భగవద్గీత పూర్తిగాను, ఉపనిషత్తులు చాలా వరకు ఫరవాలేదన్నారు. అవతారపురుషుల విషయములను తెల్పుచూ శ్రీ కృష్ణ పరమాత్మ అత్యున్నత స్థానం నుండి వచ్చిన వాడు. అతని సమీపస్థులము మేము అన్నారు. "నేనే ఆయనో ఆయనే నేనో" అని చెప్పునటువంటి ఆత్మీయత మాలో ఉన్నదన్నారు. అయినా కూడా నేను యోగి, ఆయన యోగీశ్వరుడు అని అచ్యుతుల వారు పలుమార్లు చెప్పియున్నారు.

జన్మాంతర విషయములు గూర్చి మన గురువుగారు ఇట్లు వివరించిరి. నేను అనేక జన్మలను పొందినాను. స్త్రీగా, పురుషునిగా, నానాదేశములలో పుట్టి ఏమేమో చేయుచు వచ్చినాను. అయితే ఈ జన్మలో పూర్ణత్వము పొందియున్నాననే ధైర్యము నాకు కలిగినది. భారతదేశములో జన్మ వచ్చి తపస్సు చేస్తే తప్ప పూర్ణజ్ఞానము అసాధ్యమని నా అనుభవము, అన్నారు శ్రీ అచ్యుత ప్రభువులు.

శ్రీ విజయీంద్ర స్వాములవారి మాటల్లో చెప్పాలంటే సత్యసాధ్యత, అనుభవజ్ఞులు చెప్పిన మాటలు, మానవులను హెచ్చరిస్తాయి. "నమస్తే వాయో త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి" (తైత్తిరీయ ఉపనిషత్) అని ఉపనిషత్తు ఘోషిస్తున్నది. "తపస్విభ్యో–ధికోయోగీ .... తస్మాత్ యోగీ భవార్జున' (భగవద్గీత – అధ్యా – 6–శ్లోకం.46) అని శ్రీకృష్ణభగవానుడు ఆజ్ఞాపిస్తాడు. ఇచ్చట తపస్సు వేరే యోగవిద్య వేరే అని కాదు. జీవాత్మ సంయోగమే యోగము అన్నారు. ఇది కలుగు వరకు విద్య యందు సాగి తపించవలసి యున్నది. తపస్సు యొక్క విద్యాభ్యాసమే ప్రాణజపమన్నారు. జీవాత్మ సంయోగమైనపుడు అతడు "యోగి" అనిపించుకొంటాడు.

బ్రహ్మవిద్య తెలిసిన వారి నుండి ఉపదేశం అయితే తప్ప, చదివి అభ్యసించుట వలన రాదు. ఆ జీవవిద్య, ఆదివిద్య, నిత్యగర్భము నుండి అనగా ఆ హిరణ్య గర్భ పరమాత్మని నుండి పరంపరాగతిగవచ్చినదే కాని, నేను కనిపెట్టినది కాదని శ్రీ ప్రభువు అన్నారు. ఇంద్రియముల ద్వారా సాగింపబడు అభ్యాసము ఏదైనను, యోగవిద్య కానేరదని మన గురువుగారు చెప్పియున్నారు. శ్వాసబంధనాది ప్రక్రియలు అన్నియు కేవలము హఠమే గాని యోగము కాదని బోధించి యున్నారు. సహజముగా సాధ్యమైన అమృత విద్యను పలువురికి ప్రసాదించిన పుణ్యమూర్తి ప్రభుశ్రీ అచ్యుతయోగిగారు.



తప్పుకల్పనతో, ఊహతో కూడి జనులను తప్పుదారి పట్టించు గ్రంథములు కనుమరుగు అగునంత వరకు ఆధ్యాత్మసాధన సాగుటకు వీలులేకున్నదని శ్రీ ప్రభువు గారు వాపోయినారు. ఋషి ప్రోక్తమయిన మూలగ్రంథములు మాత్రము ప్రచారములో ఉండవలెనని అన్నారు. అప్పుడే వేదముల యొక్క అర్థము సాధ్యమగును అన్నారు. శ్రీ ప్రభువుల అర్థములో వేదమనగా జ్ఞానము. ఈ విషయమై అనేక సత్యాంశములు జ్ఞానసాధనమైనవి. విద్య, ఇందుకు గల నియమములు మరియు అనేక విషయములు వేదములందు ఉండుటచేత విద్యను యోగవిద్య, ప్రాణవిద్య, బ్రహ్మవిద్య, అమృతవిద్య, వేదవిద్య అని ప్రభువుగారు పలుమార్లు చెప్పియున్నారు.

ఈశావాస్యోపనిషత్తు వివరములు వివరించుచు శ్రీస్వామి జయతీర్థుల వారు ప్రాణుని విషయమై ఈ విధముగా తెలియజేసినారు. ప్రాణశక్తి మనదేహములోను మరియు బయట (ఆకాశం బయలు) ఉన్నది. ఇది ఒక మారు మన దేహము వదలి వెళ్లడం సహజం. మానవ దేహములో ఉన్నట్లుగనే అది అన్ని ప్రాణివర్గ దేహములందు ఉన్నది. ఆ ప్రాణము జడము కాదు. శక్తి అగుట వలన అది చలించుచున్నది. అయితే ఈ ప్రాణము మానవ దేహములలో ఏస్థానములో ఉండి, వాయు మూలకముగా పనిచేయు చున్నది అన్న విషయము యోగ విద్య అభ్యాసము చేసినగాని తెలియదు. అలాగే ఆ ప్రాణశక్తి దేహమునందు ఏ స్థానము నుండి ఏస్థానము వరకు చలించుచున్నదనే విషయము తెలిసికొనజాలము. మన గాఢ నిద్రయందు (సుషుప్తి) ఈ ప్రాణశక్తి చలించి ఊర్ధ్వగమనమై దేహములో బ్రహ్మరంధ్రము అనబడు స్థానాన్ని చేరుచున్నది. మరల అక్కడి నుండి అది క్రిందికి దిగివచ్చినపుడే మెలకువ

కలుగును. గాఢ నిద్రయందు అన్నింటిని గమనించు ముఖ్యమైన మనస్సు మెలకువ లేకుండుటవలన ఈ ప్రాణశక్తి యొక్క చలనము తెలియదు కాబట్టి అది చలించదని సామాన్యుల దృష్టి. ఈ ప్రాణమునకు దేహమునందున్న జీవాత్మని సమీపస్థానములో ఉన్నను మెలకువ లేనందువలన అది అతిదూరములో ఉండవచ్చునను భ్రాంతి కలుగుచున్నది.

మన దేహములో జీవాత్మని స్థానము బ్రహ్మ రంధ్రము. యోగవిద్యా సాధనలో మాత్రమే ఈ విషయము తెలియనగును. యోగవిద్యయందు సాగి అనుభవము పొందుటవలననే ఉపనిషత్తు ఋషులు ఆ ప్రాణుని విషయమై వర్ణించియున్నారు. ఆవిద్య తెలియనటువంటి వారు ఉపనిషద్వాక్యములు ఏవిధముగా తెలిసికొనగలరు? అందువలన ఒకరి నుండి ఒకరికి ప్రాకి గ్రంథములు వ్రాసినట్లు గోచరమగుచున్నది. కావున అనేక సంస్థలు ఏర్పడి, బహువిధములైన మార్గములు తయారై విభేదములు, ద్వేషభావములు నెలకొన్నవి. అందువలన సాధన చేసి అనుభవము పొందిన తరువాత మాత్రమే ఉపనిషత్తు వాక్యముల అర్థాన్ని ప్రజలకు బోధించ వలయునని శ్రీ అచ్యుతస్వామిగారు అన్నారు.

* * *

6. సాధనాక్రమము: స్థూల పూజలవలన ఆత్మ సాక్షాత్కారము, దైవ సాక్షాత్కారము, బ్రహ్మసాక్షాత్కారము సాధ్యము కాదు. శూద్రస్థాయిలో ఉన్నవారికి దైవమునందు నమ్మకము కలుగజేయుటకు మాత్రమే స్థూల పూజల ప్రయోజనము. వాటివలన ఆత్యంతిక సత్యమును తెలిసికొనుటకు వీలు కాదని శ్రీస్వామి విజయాంధ్రుల వారు వివరించి యున్నారు. శుచిత్వమే తెలియని శూద్రత్వములో ఉన్నవారికి ఉపనిషత్తులలో ఉన్న



విషయాలు వారి స్థాయికి అందని విషయాలు. స్థూల, సూక్ష్మ శుచిత్వము ఆధ్యాత్మిక జీవనానికి అత్యవసరము. ఇదే భారతీయుల జీవన విధానము. ఇదే భారతీయుల సంస్కృతి మరియు విశ్వ సంస్కృతి యొక్క సారాంశము అని శ్రీ విజయాంధ్రులవారు అన్నారు.

ముక్తిని పొందుటకు ఈ ఏకైకసాధన అయిన అనుభవ విద్యను శ్రీ ప్రభుఅచ్యుతులవారు మనకు ప్రసాదించి యున్నారు. మిగిలిన విద్యలు దుర్విద్యలు అని తీవ్రముగా ఖండించినారు. ఈ విద్యనే బ్రహ్మవిద్య, జీవవిద్య, అమృత విద్య, ప్రాణవిద్య అని పిలుస్తూ వచ్చినారు. ద్వాపరాంతమున శ్రీకృష్ణభగవానులు "ప్రాణాయామము" అని పిలిచినట్లు తెలియుచున్నది. ప్రాణాయామమంటేనే చాలా మందికి భయము. దీనిని చేయబోయి ఏదో ఏదో చేస్తూ అనేకులు రోగముల పాలయినారు. మతిభ్రమణము చెందినవారూ ఉన్నారు. శ్రీకృష్ణభగవానుడు చెప్పినరీతిలో చేసి ఉన్నట్లయితే ఈ విధముగా జరిగి ఉండేదికాదు. ఊహాపోహలతో గాలిని ఒక ముక్కుతో పీల్చి ఒక ముక్కుతో వదలటము, గాలిని బంధించటము మొదలైన పద్ధతులు ప్రాణాయామము కాదు. ఆ విధముగా చేయడము ప్రాణహింస అని శ్రీ స్వామి విజయాంధ్రులవారు తెలిపియున్నారు.

అయితే ప్రాణాయామము జరుగునట్లు చేయుసాధన ఏవిధముగా చేయాలి ? ప్రాణమున్నది దేహములోనే. ప్రాణా యామము కూడా మనదేహములోనే జరుగుతుంది. ఆ ప్రాణునికి ఆయామము (దీర్ఘ కదలిక) ఇచ్చు క్రియ కూడా దేహము నందే కాని దేహము వెలుపల జరుగదు. ఆ ప్రాణాయామ క్రియ శిశువు తల్లి గర్భము నందు ఉండునపుడే సహజముగా నడుచుచుండెడిది. తల్లి గర్భము నుండి శిశువు బయటకు వచ్చిన తరువాత శిశువునకు బయటిగాలితో సంపర్కము ఏర్పడును.

క్రమముగా ఆహార దోషములవలన ప్రాణాయామము జరుగు మార్గములో కఫదోషము ఏర్పడి ప్రాణాయామప్రక్రియ కనుమరుగు అవుతుంది. దీనినే గురువు మరలా ప్రత్యక్షముగా చేసి చూపించినగాని తెలియదు. ఆ విధముగా గురువు చూపించుటనే "ఉపదేశము" అందురు. అపుడు గురువు చూపించు శబ్దము (అదే ప్రాణశబ్దము, ప్రణవము) ఊర్ధ్వముఖముగా వెళ్లినపుడు నాదబ్రహ్మముగా తెలియనగును. దీనిని మాటలలో వర్ణించుట సాధ్యముకాదు. హావభావములతో చూపించినను తెలియబడదు. కావుననే సూల్థముగా చేసి చూపించవలసియున్నది. ఈ విధముగా కావలసిన వారికి బ్రహ్మోపదేశము ఇచ్చుట మహాపుణ్య కార్యమని శ్రీ ప్రభు అచ్యుతుల వారు అన్నారు. ఒకరికి ఉపదేశమిస్తే పెండ్లి జరిపినంత పుణ్యము రాగలదని వారు సెలవిచ్చారు. ఈ సాధన అందరికి అలవడిన రోజున, తత్త్వస్థాపన జరుగునని మన గురువుగారు బహువిధములుగా వర్ణించి శ్రమించియున్నారు.

కేనోపనిషత్తు నందు ఈ విద్యను గూర్చి ఉన్న విషయాన్ని శ్రీ స్వామి జయతీర్థుల వారు వివరించియున్నారు.

"ఇహ చే దవేదీ దథ సత్యమస్తి, నచే దదే దీన్మహతీ వినష్టిః।
భూతేషు భూతేషు విచింత్యధీరాః, ప్రేత్యాస్మాల్లోకాదమృతాభవంతి॥"

ఈ విద్యను ఈ జన్మలోనే తెలిసికొంటే జన్మసార్థకమవుతుంది. ఈ జన్మలో తెలిసికొనక పోయినచో గొప్పనష్టము కలుగును. వెనుకటి కాలములో (ఈ విద్యవలన అమృతత్వాన్ని పొందిన) ధీరులు విద్యను తెలిసికొని ఈ మృత్యులోకాన్ని విడిచి వెళ్లిన తరువాత అనగా చనిపోయిన తరువాత అమృతత్వాన్ని పొంది యున్నారని చెప్పబడినది. ఇచట అన్ని ప్రాణుల కంటె మానవులకు మాత్రమే ఈ విద్యను పొందుటకు సాధ్యమని, ఇతర లోకాల వారికి కూడా ఇది అసాధ్యమనే అంశాన్ని గ్రహించవలసి



యున్నది. ఈ సాధన చేసినవారు చనిపోయిన తరువాత తాము ఆదిలో ఎచ్చటనుండి వచ్చినారో ఆ స్థానాన్ని అనగా బ్రహ్మస్థానాన్ని చేరుదురని ఈ కేనోపనిషత్తు తెలియజేయుచున్నది. ఈ బ్రహ్మవిద్యను సాధన చేసి ముందురాబోవు మునిసంతతి సామ్రాజ్యము యొక్క "సత్" ప్రజలగుటకు ఈ విద్యను ఆశ్రయించి సాధించి సుఖములు పొందుదని శ్రీస్వామి విజయాంద్రులవారు సాధకులందరిని ఆశీర్వదించియున్నారు.

ప్రభుయోగి అచ్యుతులవారి సాధనాక్రమము యొక్క విశిష్టతను గూర్చి శ్రీ జయతీర్థస్వాములవారు కొన్ని వివరములు తెలియజేసి యున్నారు.

ప్రభు అచ్యుతులు మాకు ప్రసాదించిన అమృతవిద్య ఈ కలికాలంలో సమాజ మధ్యమునందు దొరుకుట కష్టమనే చెప్పవచ్చునన్నారు. కేరళ రాష్ట్రములో స్వామి శివానంద పరమహంస వారిచే స్థాపించబడిన సిద్ధసమాజము, బడిగెర యందు ఉన్నది. అచ్చట బ్రహ్మవిద్యను సాధన చేయువారున్నారు. అనగా ఒకటి రెండుచోట్ల ఈ విద్య మాకు తెలిసినంత వరకు దొరుకుచున్నది. మేము అనగా శ్రీ బి.హెచ్. నాడగౌడగారితో పాటు బడిగెర ఆశ్రమానికి వెళ్లివచ్చినాము. అయితే అచట సాధన చేయు క్రమములో వ్యత్యాసము ఉన్నది. రోజులో కొన్ని సమయాల్లో సాధనను ఒక్కొక్క స్థితిలో చేయుచున్నారు. అనగా ఒక మారు కేవలము పెద్దశబ్దముతో, ఇంకొక మారు మధ్యశబ్దముతో, మరొకమారు కేవలము నిశ్శబ్దములో అచ్చట జపము చేయుచున్నారు. మన ఆశ్రమము నందు ప్రతిసారి జపమునకు కూర్చున్నపుడు "ఇదే నా ఆఖరి జపము" అని నిర్ధారణతో కూర్చొనవలయునని ప్రభువులు చెప్పుచుండెడివారని శ్రీ జయతీర్థస్వాములు చెప్పియున్నారు. ఈ జపము చేయుటకు దొరికిన చివరి అవకాశమని భావించి శ్రద్ధ వహించండి అని అన్నారట శ్రీ

ప్రభువుగారు. ఈ విధముగా జపిస్తే జపములో నిష్ఠ కలుగునని హితబోధ గావించినారట ప్రభువులు. అదే విధముగా కర్తవ్యము చేయునపుడు, ప్రస్తుతము నేను చేయుచున్న కర్తవ్యము వేయిన్నూరు సంవత్సరముల వరకు ఉంటుందనే భావన కలిగి ఉండాలని అన్నారట ప్రభువుగారు.

సాధనా క్రమములో మూడురకముల శబ్దగతులు ఉన్నవి. మొదటిదయిన దీర్ఘగతి ఉద్దేశ్యము, జపమార్గములో కఫాదులను శుద్ధము చేయుట. ఇంకా ఇందులో హెచ్చు ఉష్ణశక్తి ఉత్పత్తియై దేహము నందలి దోషములను నాశనము చేయును. మధ్యగతి శబ్దము చేయునపుడు మనస్సునకు హితమైనందున మనస్సు యొక్క బహిర్ముఖ వ్యాప్తిని తప్పించుట సాధ్యమగుచున్నది. మూడవ శబ్దగతి హిస్సింగ్‌లో విద్యుత్ ఉత్పత్తియై ఆధ్యాత్మిక ప్రగతికి తోడ్పడును. మూడు శబ్దగతులు అయిన తరువాత అనగా నిశ్శబ్ద స్థితిలో అనగా ధ్యానస్థితిలో ప్రాణ వాయువు యొక్క గతాగతికి గాను మన ప్రయత్నము నిలిపినచో తానుగా నడచుగతిని గమనించుచు కూర్చున్నపుడు పూర్ణముగా మనస్సునకు బహిర్వ్యాప్తి లేకుండా పోవును. అనగా అంతర్ముఖస్థితి ప్రాప్తించును. ఈ స్థితిలో దర్శనము, వాణిశ్రవణము ఇత్యాది అనేక అనుభవములు కలిగి సమాధి స్థితి ప్రాప్తించి ఆనందానుభవము అగుటకు సాధ్యమగును. సాధనలో అశనప్రాప్తి కలిగిన తరువాత పై అనుభూతులు కలుగును. అశన మనగా వాయుమథనము నుండి ఉత్పత్తి కాబడు వాయు స్వరూపమైన ప్రాణుని ఆహారము. దీనిని స్వీకరించిన ప్రాణుడు ఊర్ధ్వగామి అయి మనస్సును అంతర్ముఖ స్థితికి లాగుచున్నది.

ఈ సాధనకు అధికార గ్రంథము భగవద్గీత. ఇందులోని కొన్ని శ్లోకములను గమనించండి. 17, 18 అధ్యాయములలో వివరించబడింది. సాధన చేయుటలో ఆసనము గూర్చి కూడా గీతయందు వివరించబడినది.



"సమంకాయం శిరోగ్రీవం ధారయ న్నచలం స్థిరః।
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్ ॥"

(భ.గీ.6అ–13శ్లో)

దేహము శిరస్సు నిటారుగా నిలిపి స్థిరదృష్టితో తన భ్రూమధ్యమును చూచుచు జపము (సాధన) చేయవలయును.

ఈ సాధనలో ఆనందానుభవము పొందుట వలననే జ్ఞానులు "నిశ్శబ్దం బ్రహ్మ ముచ్యతే" అని చెప్పినారు. నిశ్శబ్దస్థితి యందే బ్రహ్మత్వానుభవము కలుగుట సాధ్యమన్నారు.

జపము చేయు క్రమములో కూడా నిర్దిష్టమైన ఆదేశములను ప్రభువుగారు ఇచ్చియున్నారని శ్రీ జయతీర్థ స్వాములవారు తెలియ జేసినారు. జపము చేయునపుడు శబ్దస్థితిలో పైకి ఎంత దీర్ఘముగా శబ్దగతి ఉంటుందో అంతే దీర్ఘముగా క్రిందికి వచ్చునపుడు ఉండవలెను. శబ్దము కూడా పైకి, క్రిందికి వచ్చునపుడు ఒకే రీతిగా ఉండవలెను. (ఏకనాదము). ఈ విధముగా సాధన సాగాలంటే సాధకుల లక్ష్యం గురుస్థానంపై (అనగా శబ్దము ఉత్పత్తి యగు స్థానము) కదలకుండా ఉండవలెనని ప్రభువులు చెప్పియున్నారని శ్రీ స్వామి జయతీర్థులు అన్నారు. సాధనలో కొంతవరకు అనగా షుమారు 20 నుంచి 25 దీర్ఘగతులు గావించిన తరువాత నెమ్మదిగా దీర్ఘగతిని తగ్గించుకుంటూ చివరకు హ్రస్వగతుల యందు ఎంత వేగముగా చేయుటకు సాధ్యమగునో అంత వేగముగా చేయుచు, ఆ స్థితిలో ప్రయత్నము విరమించి శాంతమనస్కుడై తనకు తానుగా గతిని గమనించుచు గురుస్థానముపై ధ్యాస ఉంచి సాధనలో కూర్చొనవలయును. ఉపదేశకుడు సాధకుని సమక్షములో చేసి చూపించవలయును. లేని ఎడల అర్థము కాదు. శబ్దగతి 10

నిమిషములు చేయగలిగితే దానికి రెండింతలు అనగా 20 నిమిషములు నిశ్శబ్ద స్థితిలో కూర్చొనవలయును. దీనివలన శరీరమునందున్న రక్తములో ఆక్సిజన్ (ప్రాణవాయువు) ఎక్కువగా చేరి రక్తము బాగా శుద్ధి అగును. ఆధునిక కాలములో మనము ఎదుర్కొంటున్న అనేక వ్యాధులకు తగినంత ప్రాణవాయువు లభించకపోవడమేనని డాక్టర్లు చెప్పుచున్నారు. శరీరమునకు అవసరమైన ఆక్సిజన్ (ప్రాణవాయువు) అందిస్తే రోగములు తనకు తానుగా నశిస్తాయి. బి.పి., షుగర్ లాంటి వ్యాధులు ఖచ్చితముగా తగ్గపోతాయి. సాధనవలన పైన చెప్పిన వ్యాధులు పోగొట్టుకున్న సాధకులు ఉన్నారు.

నిశ్శబ్దస్థితిలో, శబ్దగతి చేసిన కాలము కంటె రెండింతల కాలము కూర్చొనవలయునని ప్రభువుగారు ఎందుకు చెప్పినారు అనగా శబ్దమును గావించునపుడు ఉత్పత్తి యైన ఉష్ణము తగ్గుటకు కొంత సమయము కావలసి యుండును. ఆ విధముగా సాధన చేయలేనిచో దేహమునకు కొన్ని బాధలు కలుగుటకు అవకాశ మున్నది. దీనివలన దేహేంద్రియములు నీరసించిపోవుటకు అవకాశ మున్నది. మనసునకు శాంతి స్థితి తప్పును. ఇంకనూ మనసునకు బహిర్వ్యాప్తి కలిగి అంతర్ముఖ స్థితి తప్పి, మనస్సు ప్రాణునితో పాటు పై స్థానాన్ని చేరే స్థితి తప్పిపోవును. కావున హెచ్చుకాలము నిశ్శబ్దస్థితిలో కూర్చొనుట అత్యవసరమని శ్రీ ప్రభువుగారు అన్నారు.

ఇంకను ఆసనము, దృష్టి విషయమై నిర్దిష్టమైన ఆదేశము ఇచ్చి యున్నారు. జపసాధనలో ఎంత సమయము కూర్చొనుచున్నారో అంతవరకు దృష్టి స్థిరముగా ఉండవలయును. ఆసనము యొక్క స్థిరత్వము, ముద్రవిషయమై లక్ష్యము అత్యవసరము అని అన్నారు. ఇక సమాధిస్థితికి వెళ్లినప్పటి స్థితి వేరన్నారు. సాధ్యమైనంతవరకు సాధకులు ప్రతిరోజు ఒకే స్థలములో, ఒకే సమయానికి, ఒకే రీతిలో మనస్సును శాంతి స్థితికి



తెచ్చుకొని జపానికి కూర్చొనవలయును. ఆ విధముగా ఉన్నట్లయితే సాధనలో నిష్ఠ కుదురుతుంది. దీనివలన సాధనలో ప్రగతి కలుగును అని ప్రభువులు చెప్పియున్నారు. జపము చేయునపుడు భయము, సంశయము, హఠము కూడదు. శాంతిగా ప్రీతితో సాధన చేయ వలయును. లేనిచో సాధన వ్యాయామంగా మారుతుంది. ఈ విధముగా నిష్పత్తి పాటించనిచో ఆకలి, నిద్ర, కోపము, వికల్పములు కలుగును. ఆహార విషయమై "కాయకల్పము" అనే పుస్తకమునందు వివరించబడినది. దానిని గమనించవలయును. అత్యవసరమైన కర్మాచరణ కూడా తప్పకచేయవలెను. కర్మభ్రష్టులకు యోగము సిద్ధించదని ప్రభువుగారు అన్నారు. ప్రతిరోజు 24 గంటల వ్యవధిలో కనీసం 4 గంటలకాలము సాధకులు జపానికి వినియోగించిన ఎంతో మేలు కలుగుతుందని ప్రభువుగారు అన్నారు. సూర్యాస్తమయమైన తరువాత అనగా ప్రదోషకాలములో ఒక మారు, రాత్రి భోజనము చేసిన తరువాత రెండు గంటల కాలము వదలి ఒకమారు, (సాయంత్రము పెందలకడనే భోజనము చేయవలెను). తరువాత తెల్లవారు ఝామున ఒక మారు, త్రికాలములలో తప్పకుండా జపము చేయవలెను. స్త్రీలు బహిష్టు కాలములో శాంతిగతిలో మాత్రము సాధన గావించవచ్చును. బహిష్టు కాలము ముగిసిన తరువాత 4వ రోజునుండి శబ్దగతి చేయవచ్చును. సాధకులు పగటిపూట అనగా సూర్యోదయము నుండి సూర్యాస్తమయము మధ్యకాలములో జపము చేయకూడదు. పగలు సమయము కర్తవ్యానికని ప్రభువులు అన్నారు. పగలు జపము చేస్తే దేహాది బాధలు కలుగునని ప్రభువుగారి ఆదేశము. స్నానానంతరము భోజనానికి ముందే కొంతకాలము నిశ్శబ్దస్థితిలో ధ్యానానికి కూర్చొనడం ఉత్తమమని ప్రభువులు తెలియజేసి యున్నారు. సాధకులు వినయవిధేయతలతో జీవించ

వలయునని, అహంకార పూరితమైన జపము నిష్ప్రయోజనమని ప్రభువులు ఆదేశించియున్నారు. సాధనచేస్తూ పోతే సహజంగా ప్రాణశక్తి పటిష్ఠ మగును. దీనివలన ప్రాణుడు బలవంతుడగును. ప్రాణశక్తికి మనస్సుతోడు కాకుండా ఉంటే ప్రాణుని శక్తి సద్వినియోగము కాదు. ప్రాణుడు ఖడ్గములాంటివాడు. పూర్వజన్మ కర్మ మరియు గ్రహగతుల వలన ఎన్నో గండములు జీవితములో రావచ్చును.

కాని ఈ అమృత విద్యలో క్రమబద్ధముగా సాగువానికి అన్నియు తప్పిపోవునని ప్రభువుగారు అన్నారు. భగవద్గీతలో "యజ్ఞ క్షపిత కల్మషః" అన్నారు. ఈ సాధన కూడా "ప్రాణయజ్ఞము" కాబట్టి కర్మ దోషములను నశింపజేస్తుందని మన గురువులు చెప్పియున్నారు. ఇతరులకు సాధనగూర్చి చెప్పునపుడు తత్త్వవిచారణ చేయునపుడు "అహం" భావన ఉండకూడదు. ఎవ్వరిని దూషించుట కాని లేక భూషించుట (పొగడుట) కాని ఉండకూడదు. ఇవి ఉన్నచో వినువారికి వికల్పము కలుగుటకు అవకాశము ఉన్నది. కావున వినయ పూర్వకముగా, హితముగా ప్రీతితో విషయాలు తెలియ జేయవలయును. ఇచట వ్యక్తి ప్రతిష్ఠకు తావు ఉండకూడదని ప్రభువుల వారు సాధకులకు హితబోధ గావించియున్నారు. జనులను ఆకర్షించుటకు వేషభూషణాదులు (అనగా కావిగుడ్డలు ధరించడము, జడలు పెంచడము, గడ్డం పెంచడము) మొదలగునవి కూడదని ప్రభువుల ఆజ్ఞ. సాధకులు పెండ్లి చేసికొనవలెను. సంసారమును వదలనవసరము లేదు. సతీపతులు ఇరువురు సాధకులే అయినచో సత్ సంతానము కలుగుటకు అవకాశమున్నది. ఇది లోక కల్యాణమునకు సహకారం అగునని ప్రభువుగారు తెలియజేశారు. ఋషులు సంసారులుగానే ఉన్నారు గదా. సాధకులు బ్రహ్మచారులు గానే ఉండవలయుననే పట్టుదల కూడదన్నారు. ఎందుకనగా కాయక, వాచక, మానసిక బ్రహ్మచర్యాన్ని



కాపాడుకొనుట అసాధ్యమనునంతటి దుస్తరమైనదని ప్రభువులవారు అన్నారు. ఆనందానుభవము, జ్ఞానప్రాప్తి ఈదేహములో ఉన్న మహాశక్తి అని ప్రభువులు చెప్పియున్నారు. అద్వైతానుభవము (ఆత్మానంద స్థితి యొక్క అనుభవము) అదే విధముగా ద్వైతజ్ఞానము (పరమాత్ముని మూలమైన దైవము యొక్క అస్తిత్వజ్ఞానము) ఈ రెండు కలిగినపుడు సాధన పూర్ణమైనట్లని ప్రభువుగారు సాధకులకు వివరించియున్నారు. దేవుని గురించి మాట్లాడటం ఎందుకని పలుమార్లు నొక్కి వక్కాణించి యున్నారు. దైవాన్ని దర్శించినవారు వర్ణించుటకు ప్రయత్నించలేదు. ఇది ప్రభువుల తత్త్వప్రణాళిక.

అవతారముల విషయమై శ్రీ ప్రభువుల నిర్ణయము వెలి బుచ్చినారు. అవతారములు నిజము. ఎన్నో అవతారములు జరిగినవి. ఇంకను జరుగవలసియున్నది. ఆయాకాలమానములలో లోక కల్యాణానికి అత్యవసరముగ జరుగవలసిన పనులు మహత్యానికి తగురీతిగా దైవము యొక్క చేతనాంశము రూపుపొంది ఆయా కార్యములు నిర్వహించి పోవుచున్నారు. అన్ని అవతారములలో అంతరమున్నది. కృష్ణావతారము యొక్క స్థానము అన్ని అవతారముల కంటె గొప్పస్థితి. పై స్థితి. కొంతమంది పూర్ణుడైన దైవానికి అవతారములకు భేదము లేదనుచున్నారు. అయితే సత్యము ఆ విధముగా లేదు. అవతారమనే శబ్దమే అపూర్ణత్వాన్ని సూచించుచున్నది. పూర్ణుని అవతారమనునది సాధ్యము కాదు. ఆ పూర్ణుని ఏ ఒక్క అంశమును కూడా ఈ భూగ్రహము భరించగలదా? అని ప్రభువుగారు అన్నారు.

తత్త్వగ్రంథాలలో భగవద్గీత ఒక్కటే సమగ్రమైన గ్రంథము. తత్త్వజ్ఞులలో శ్రీకృష్ణుడు ఒక్కడే శ్రేష్ఠుడు అన్నారు మన ప్రభువులు. మేము

వారి సమీపానికి వెళ్లగలము. తానే నేను, నేనే అతను అన్నంత సన్నిహితత్త్వము మాలో ఉన్నను, నేను యోగి, అతను యోగీశ్వరుడు అని అచ్యుతుల వారు అన్నారని శ్రీ స్వామి జయతీర్థులు చెప్పియున్నారు. మరొకమారు స్థూలతః నేను అందరికంటె చిన్నవాడిని. సేవచేయుటకు వచ్చినవాడిని. సూక్ష్మతః నా విషయం వేరే. నేను అందరికంటె పైవాడిని. నాకంటె పైన మరెవ్వరూ లేరు అని ప్రభువులు చెప్పినారట.

సాధకులకు "గురుస్థానము" విషయమై ప్రభువులు ఈ విధముగా వివరించినారట. జపము చేయునపుడే కాదు అన్ని కాలములయందు మీ లక్ష్యము గురుస్థానము పైనే ఉండవలయును. ఈ విధముగా ఉంటే సాధకులకు చిత్త చాంచల్యము లేకుండా నిష్ఠ ఏర్పడుతుంది. ప్రతిదినము తప్పకుండా ఆహార విహారములయందు శ్రద్ధతో సాగు సాధకులకు ఎప్పటికప్పుడు కాలాన్ని అనుసరించే మార్గదర్శకము తమలోనే దొరుకునని ప్రభువుగారు అన్నారట. ఈ సందర్భంలో సిద్ధులకు ఆశించకూడదని అన్నారు. సాధకులకు సిద్ధులు తనకు తానుగా వశమగుటకు అవకాశము ఉన్నదని శ్రీ ప్రభువుగారు అన్నారు. వీటిని వెన్నంటి మాహాత్మ్యములు చేయరాదు. దీనివలన ఆత్మశక్తి అపవ్యయమై సాధకుడు తను చేరవలసిన స్థాయి చేరుట అసాధ్యమగునని శ్రీ ప్రభువుగారు అన్నారు. అనేకమంది మహాత్ములు సమాధిస్థితిని ఆశ్రయించి, బ్రహ్మత్వాన్ని పొందియున్నారని ప్రభువులు తెలియజేసినారు. అట్టివారికి సమాధిస్థితియందే ఆనందానుభవము సాధ్యమన్నారు. అయినా కూడా సమాధి మాయకు దొరకకూడదని శాసించినారు. ఇచట మనము తెలిసికొనవలసినది ఏమిటంటే సమాధి స్థితిలో లభ్యమగు ఆనందానుభవానికి మోహితులై చేయవలసిన కార్యములు మరచి కూర్చొనగూడదని ప్రభువులు అన్నారు. ఎందుకనగా



మనము జన్మాంతరములలో అనుభవించవలసిన కర్మశేషాన్ని పూర్ణముగా అనుభవించి, లోకకల్యాణానికి గాను చేయవలసిన దానిని భక్తితో చేస్తే తప్ప ఎవ్వరికి మోక్షము లేదనియే ప్రభువుగారి అభిప్రాయము.

విద్యోపదేశ విషయమై, బ్రహ్మవిద్య కావలెనని వచ్చినవారికే ఇవ్వవలెనని ప్రభువుగారు అన్నారు. విద్యలో ప్రగతి సాధించుట సాధకులపై ఆధారపడియుండును. విద్యోపదేశానికి వచ్చినటువంటి వారు పాత్రులో అపాత్రులో విచారించుట మీకు అనవసరము. కావలసిన వారికి విద్యోపదేశము చేయుట మీ కర్తవ్యమని ప్రభువులు అన్నారు.

విద్యోపదేశము ఇచ్చువారికి క్రమసాధన, ఆహార విహారముల యందు నియమము అత్యవసరము. లేనిచో విద్య తీసికొన్న వారికి గురువుపై గురి ఉండదు. ప్రాణప్రతిష్ఠ కానివారు విద్యోపదేశము ఇచ్చినచో అది సాగుటకు వీలుపడదు. కావున విద్యోపదేశము ఇచ్చుటకు గురువుకు ఈ అర్హత కలిగియుండిన, సాధకులకు సాధన విషయములో వారికి సలహాలు ఇచ్చుటకు అవకాశము ఉండును.

ఓం సహనావవతు । సహనౌ భునక్తు ।
సహవీర్యం కరవావహై । తేజస్వినా వధీతమస్తు ।
మావిద్విషావహై ॥ ఓం శాంతిః శాంతిః శాంతిః ॥

* * *

7. ప్రాణశక్తి – ప్రాణుడు: ప్రభుయోగి అచ్యుతులవారు సృష్టి యొక్క తత్త్వవివరణ మరియు సాధనాంశములను మనకు వివరించి యున్నారు. సాధనా విషయములు కేవలం విని చెప్పునవి కావు. వారు మనకు బ్రహ్మవిద్యను అనుగ్రహించి క్రమబద్ధముగా సాధనలో సాగుటకు మార్గమును సుగమము చేసినారు. అప్పుడప్పుడు కావలసిన సలహాలు

ఇచ్చి ముందుకు నడిపించు గురువుగా, మనకు దొరికినారని శ్రీస్వామి జయతీర్థులవారు, శ్రీస్వామి విజయీంద్రులవారు చెప్పియున్నారు. మా అందరికి అర్థమయ్యే భాషలో చెప్పియున్నారు. వారిమాటలలో చెప్పవలెనంటే తత్త్వమన్నది ఒక దేశ, జాతి, మత, లింగ, భాషలకు మాత్రమే పరిమితము కాదు. అది జగత్తు అంతటికి. మనుష్యత్వము ముక్తి, ఆనందము, దైవము ఇవి శాశ్వత సత్యస్థితిని పొందటానికి మార్పులేకుండా ఉన్న విషయాలు. అదే విధముగా మానవులకు ముక్తికి, ఆనందానికి, దైవదర్శనానికి ఉన్నది సాధన ఒక్కటే గాని అనేక మార్గములు లేవు అని అన్నారుశ్రీ ప్రభువుగారు. విశ్వమే కర్తవ్యరంగమని, భారతదేశము మాత్రమే కాదన్నారు. వారు మనకు ప్రబోధకులై, తత్త్వవేత్తలై, ధర్మకర్మనిష్ఠులై దొరికియున్నారు. వారు పూర్ణులు. ప్రభువుగారు తత్త్వజ్ఞులలో శ్రీకృష్ణుని అగ్రగణ్యునిగా వర్ణించియున్నారు. జనకుని, ప్రభువుగారు జగత్తులో ఆదర్శ పురుషుడని చెప్పియున్నారు. వీరి విషయాలు పూర్తిగా వివరించవలె నంటే శ్రీ విజయీంద్రులవారి ఉపన్యాసముల వలన తెలియనగును. అవి చెప్పవలెనంటే వారే సమర్థులు. శ్రీ జయతీర్థులవారు, అచ్యుతుల వారు తెలియజేసిన కొన్ని విషయములను తెలియజేస్తాను.

తపస్సు వలన తత్త్వదర్శన అనుభవము లేనివారు తత్త్వజ్ఞులు ఎన్నటికి కాలేరు. కేవలము శాస్త్రపాండిత్యము చాలదు. కేవలము శాస్త్ర పండితులను తత్త్వజ్ఞులు అనుట ఆభాసమగుచున్నది. సృష్టి విషయాన్ని గురించి ప్రభువులు వివరించి యున్నారు. సృష్టి సహజమైనది. నిత్యగర్భము నందు ఉన్న సమస్త భూతధాతువులు బయటకు వచ్చి రూపమును పొందుచున్నవి. అయితే అవి కాలానుగుణముగా మూలస్థానాన్ని చేరుకొను చున్నవి. కర్త ఒకడున్నాడు. అతనిని అనాది అన్నారు. దీనికి అంతమనేది లేదు. దీనికి ప్రభువయినవాడు ఆది. సృష్టి కావించినవాడు త్రిమూర్తులలో



ఒకరైన బ్రహ్మదేవుడు కాదు. ఈ విషయమై ప్రభువుల వారు "భ్రమించిన వాడు బ్రహ్మ, రచించిన వాడు విరించి" అన్నారు. ఇచ్చట నిత్యగర్భుడు అంటే సూక్ష్మ ప్రకృతి అని అనుకొనవలయును అని అన్నారు. మనము దేవుడు అనే మూలచేతనము ఇది కాదు. ఈ మూలచేతనము యొక్క క్రియాపరిణామము వలన రెండు శక్తులు ఉద్భవించినవని, అందులో ఒకటి ప్రాణము రెండవది జీవము (Individual soul).

"ద్వావిమౌ పురుషౌ లోకే క్షరః - అక్షరః" (గీత -15 అధ్యా-16 శ్లోకం) అని తెలియజేసినారు. మొట్టమొదట సృష్టిలో ఉత్పత్తి అయినది ప్రాణశక్తి అని ప్రభువులు వివరించినారు. దీనిని ఉపనిషత్తుల యందు "జ్యేష్ఠ, శ్రేష్ఠ ప్రజాపతి" అన్నారు. ఈ ప్రాణుడు జ్యేష్ఠుడే కాని శ్రేష్ఠత్వము లేదు అంటే ఇచట జ్ఞానమునకు అవకాశము లేదన్నారు. ప్రాణశక్తి కేవలము క్రియాశక్తి మాత్రమే అని ప్రభువులు అన్నారు.

ప్రాణశక్తి స్పందనవలన ఆదిభూతమనిపించుకున్న వాయువు, దాని నుండి అగ్ని, జలము, పృథ్వి ఉత్పన్నమయినవని సృష్టి విజ్ఞానాన్ని తెలిసినవారు చెప్పియున్నారని ప్రభువులు వివరించినారు. శ్రీ గురువుగారి భావనలో భూతధాతువులు పరిణామము చెంది ఆకాశతత్త్వములో మిశ్రమము చెంది జగత్తు ఏర్పడినది అన్నారు. చతుర్భూతములలో వాయువు ప్రధానమైనది. దేహ ఉత్పత్తికి ముఖ్యకారణము ఆత్మ. దేహమునకు ఆత్మ ముఖ్య సారధి. ఆత్మతో పాటు ప్రాణుడు దేహములో వసించుచున్నాడు. అందువలననే జీవులకు వాయువు ముఖ్యమైనది అన్నారు. మన దేహములో ఉన్న ఆత్మ భగవంతునిలో ఐక్యస్థితిని పొందును. ఈ స్థితి లేనివాడు ప్రాణుడు. భగవద్గీతలో ఈ ప్రాణుని "కూటస్థో-క్షర ఉచ్యతే" (అధ్యా15-శ్లోకం 16) అన్నారు అని ప్రభువుగారు తెలియజేశారు.

వాయువును పట్టి సాగునపుడు ప్రాణాన్ని, ప్రాణుని సాయమున ఆత్మను (మనదేహమునందు ఉందునది - ప్రత్యగాత్మ) చివరకు పరశ్రేష్ఠుని తెలిసికొనుటకు సాధ్యమన్నారు. ఆ సాధనను మనకు శ్రీ గురువుగారు ప్రసాదించియున్నారు.

ప్రాణుడు తల్లి గర్భానికి ఎట్లు వచ్చినది ? ఈ ప్రశ్నకు "ఇది అంత తొందరగా అర్థముకాదు" అని శ్రీ గురువుగారు అన్నారు. హంస నీటిని వదలి పాలను మాత్రమే స్వీకరించినట్లు, ప్రాణుడు వాయువును గతాగతియందుంచి శుద్ధీకరించినట్లు, ఆ శుద్ధాంశాన్ని అంటే అశనాన్ని ప్రాణుడు స్వీకరిస్తాడు. అందువలననే వాయువును మొట్టమొదటి ప్రత్యక్ష బ్రహ్మ అన్నారు. దీనిద్వారా అన్నియు తెలియనగునని వివరించినారు. మనము సదా ప్రాణుని వైపు లక్ష్యము ఉంచవలెను. మనము తల్లి గర్భానికి ఏ విధముగా ప్రవేశించామంటే తండ్రి గర్భము నుండే అని ప్రభువుగారు అన్నారు. తల్లి గర్భములో దేహ నిర్మాణము జరుగుట వలన, యోగదృష్టి పొంది చెప్పాలంటే తల్లి గర్భము ఈ భూగర్భము వలె మనకు సంబంధము. కాని తండ్రి సంబంధమే పెద్దదన్నారు ప్రభువులు. ఆ విధముగానే ఆదిలో పూర్ణత్వము నుండి ప్రాణశక్తి వచ్చినది. ఇందువలన పూర్ణత్వము యొక్క శక్తి తగ్గదన్నారు. అదే విధముగా బిడ్డలు కలిగినా తండ్రి యొక్క ప్రాణశక్తి తగ్గదన్నారు. ఉపనిషత్కారులు.

"పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే
పూర్ణస్య పూర్ణ మాదాయపూర్ణమేవావశిష్యతే॥"

(ఈశావాస్య ఉపనిషత్) అన్నారు.

ఇందుకు ప్రాణాయామమే ముఖ్యసాధనమని ప్రభువుగారు అన్నారు. ప్రాణుడు మన దేహములోనే ఉందుటవలన అతనికి కావలసిన



ఆయామము దేహము లోపలనే జరుగవలసి యున్నది. ఇది ఆస్థానము నందుంచి ఊదేపద్ధతి. అయితే ముక్కు ఇత్యాది బాహ్యేంద్రియాలతో ఈ సాధన చేయరాదు.

"ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశే అర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా॥"

(భగవద్గీత - అధ్యా. 18 - శ్లోకం. 61)

సర్వప్రాణుల లోపల "ఈశ్" అను శబ్దము ఆడి, ఆడించుచున్న వాయు చేతనానికి "ఈశ్వర" అనియు, "ఈశావాస్యమిదం సర్వం" అని ఉపనిషత్తుల యందు వివరించియున్నారు.

మనకు కళ్లకు స్పష్టంగా కనిపించుటకు విగ్రహారాధనలో చూపించియున్నారు. విగ్రహములయందు ఫాలనేత్రము, సర్పభూషణము ఇత్యాదులు చూపించినారు. పాము ప్రాణాయామ జీవి అయినందున సర్పభూషణమని తెలియపరిచినారు. ఇవన్నియు మనదేహమునందున్న వాయు చేతనానికి నిదర్శనములు. మన దేహమునందలి ప్రాణునితో సహవాసము సర్పముతో సహవాస మున్నట్లే అని శ్రీ గురువుగారు మనకు తెలియజేసినారు. ప్రాణునికి ప్రియమైన ప్రణవ నాదములో అనగా ఝంకార నాదములో సాగితే ఆనందము (Inorganic enjoyment) జ్ఞానము, ఇచ్ఛామరణము ఇత్యాది అన్నియు లభ్యమగునని మన గురువుగారు తెలిపి యున్నారు. ముఖ్యముగా చెప్పునది తపస్సు చేయవలయునని. కర్మబద్ధత ఉందవలెను. అనగా కర్మభ్రష్టత్వము వలన మోక్షము సాధ్యము కాదన్నారు ప్రభువులు. కావున ప్రాణుని పట్టి సాగునదే ఉత్తమ మార్గమన్నారు. ఈ బ్రహ్మవిద్య మన దేహములో కంఠము ద్వారా దేహములో నాభి నుండి బ్రహ్మరంధ్రము వరకు గతాగతిలో చేయవలెను. అనగా వాయుమథనము. ఈ వాయుమథనము మానవ దేహము నందు

మాత్రమే సాధ్యము. తక్కిన ప్రాణులు బయటి గాలిపై ఆధారపడి జీవించుచున్నవి. వాయు మథనము వలన అశనోత్పత్తి కలుగుచున్నది. ఇది ప్రాణునికి ఆహారము. ఇది మానవ ప్రాణికి మాత్రమే సాధ్యమని ఉపనిషత్తులయందు నిర్వచించబడినది. బయట గాలిపై మానవుడు ఆధారపడితే దానిని పరధర్మమన్నారు. అందువలన దీనిని ఆచరించ కూడదని భగవద్గీత యందు బోధించినట్లు మన గురువుగారు వివరించారు.

"స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః"

(భగవద్గీత – అధ్యా.3 – శ్లోకం.35)

ఈ వాయుమథనం సూక్ష్మకర్మ. దీనిని జీవిత పర్యంతము చేయవలసినదేనని ఈశావాస్యోపనిషత్తు నందు "జిజీవిషేత్ శతం సమాః" అని చెప్పబడినది. అనగా నూరు సంవత్సరములు జీవించి సాధన చేయవలెనని ఉపనిషత్కారుల అభిప్రాయమని మన ఆశ్రమములో గురువుగారు బోధించియున్నారు. ఈ సూక్ష్మకర్మని జ్ఞానులు ఎన్నో రీతులుగా బోధించినను తెలిసికొనుట కష్టమైనదని ప్రభువుగారు చెప్పియున్నారు. జగత్తులోని ప్రజలు తెలిసికొనలేక పోవుచున్నారని శ్రీ గురువుగారు వాపోయినారు. ఇదే అగ్నిపూజ గుట్టు అని ప్రభువుగారు అన్నారు. విద్యోపదేశము కాని వారికి దీనిని తెలిసికొనుటకు అవకాశము లేదన్నారు గురువుగారు. ఈ విద్యనే సిద్ధార్థుడు రామపుత్రుడైన రుద్రునినుండి పొంది సాధించి బుద్ధుడైనాడని వారి గ్రంథాలలో చెప్పబడియున్నదని ''స్వామి జయతీర్థులు'' తెలియపరచినారు. దీనినే బుద్ధుడు "ఆర్యాష్టాంగయోగ" మని చెప్పినట్లు గ్రంథమూలముగా తెలియబడు చున్నది. వైదికులు "అష్టాంగయోగమని", ఋషులు "జీవవిద్య, మధువిద్య, అమృతవిద్య" అని చెప్పుచున్నారు. దీనిని గురించి ఏసుక్రీస్తు నిత్యజీవన మార్గము చక్కగా ఉన్నది. అయితే దీని తలుపులు ఇరుకుగా ఉన్నవని



"తట్టు తీసుకుంటాయి, చూడు – కనిపిస్తుంది, అడుగు – ఇవ్వబడుతుంది అని చెప్పినది ఈ బ్రహ్మ విద్యను గురించే. "పై స్థానమున నిలిచి కూత పెట్టుము, దేవలోకానికి వినిపిస్తుంది" అని మహమ్మద్ పై గంబరు గారు చెప్పియున్నది ఈ విద్య గురించే అన్నారు శ్రీ ప్రభువుగారు. ఇవి స్థూల ఆచారములుగా అయి వాటిని స్థూలముగా, గ్రుడ్డిగా అనుసరించు చున్నారు.

ఈ సూక్ష్మ కర్మ విభాగాన్ని అంటే ఈ యోగ విద్యను తెలిసిన వారి వద్ద నుండి పొంది సాధించవలయును. ఇది గురువు లేకుండా సాధ్యముకాదు. ఈ విద్యను పొంది అభ్యసించి పై విషయములను అనుభవించినవాడు "గురువు". అలాంటి గురువు వలననే విద్యను పొందవలెనే కాని ఇతరత్రా సాధ్యము కాదన్నారు. ఈ విద్య ఒకరి నుండి మరొకరికి రావలెనని గ్రంథపఠనము నుండి కాని, వినుట వలన కాని సాధ్యముకాదని శ్రీ ప్రభువుగారు వివరించియున్నారు. కావుననే గురువు లేనిదే ముక్తి సాధ్యము కాదన్నారు. అందువలననే "నగురోరధికం" అన్నారు. ఈ విషయమై భగవద్గీతలో "ఈ విద్యను నేను సూర్యునికి ఉపదేశించినాను. అతడి నుండి యమునికి ఉపదేశమైనది. అవసరమైనపుడు నేనే వచ్చి ఉపదేశిస్తానన్నారు, భగవాన్ శ్రీకృష్ణులవారు.

గురువు ఉపదేశమంటే "ప్రణవము". అదే మొదటి మంత్రము. తారకము ఇత్యాదులుగా చెప్పబడుచున్నది. ఇచట "ప్రాణము" విషయమై తెలిసికొనవలసి యున్నది. ప్రాణుని కార్యక్షేత్రము హృదయమని శరీర శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. హృదయము అనగా గుండె (Heart). రక్త సంచలనమునకు కారణమైన వాయువును ప్రాణమన్నారు. అనగా "ఈశ్" అనే శబ్దముతో కూడి చలించు వాయుస్థానము మరియు కార్యక్షేత్రము అని చెప్పబడినది. అయితే భగవద్గీతలో "ఈశ్వరః సర్వభూతానాం

హృద్దేశే..." (అధ్యా. 18 – శ్లోకం. 61) దేహ యంత్రాన్ని నడుపుటకు ముఖ్యకారణమైనదని చెప్పబడినది. అయితే ఉపనిషత్ మహర్షులు ప్రాణుని నివాస స్థానము శరీర శాస్త్రజ్ఞులు చెప్పిన హృదయము (కలిబిజీశి) కాదన్నారని స్వామి జయతీర్థుల వారు వివరించినారు. ఎచ్చటయితే దేహము యొక్క నాడులు కేంద్రస్థానమైన చోట చేరునో దానిని "సుషుమ్న" అన్నారు. ఇది మెదడు యొక్క మధ్య స్థానములో ఉన్నది. దీనినే "రథనాభి" అని వారు పిలిచినారని జయతీర్థులవారు అన్నారు. ప్రాణశక్తి యొక్క పంచప్రాణములని పిలువబడేవి దానికి భిన్నముగా ఉన్నాయి. వీటిని పంచ వాయువులు పంచాగ్నులు అని కొంతమంది పిలిచియున్నారు. రథనాభిలో సంచరించునది ముఖ్యప్రాణమని మహర్షులు పిలిచియున్నారు. కఠోపనిషత్తులో ప్రాణుని "వామనుడని" అన్నారు. అంటే భ్రూమధ్యము నుండి ఆత్మస్థానము వరకు ప్రాణుని సంచారము. భ్రూమధ్యము యొక్క క్రింది వైపు పంచ వాయువులు పనిచేయుచున్నవని శ్రీ స్వాములవారు వివరించి యున్నారు.

మానవదేహములో ప్రాణాన్ని గురించి శ్రీ స్వాములవారు వివరణ ఇచ్చి యున్నారు. ప్రాణశక్తి శరీరములో అన్ని ప్రదేశములందు ఉన్నది. అన్నింటికి ఇదే ఆధారము. ఈ ప్రాణము తక్కువ అయినపుడు ఆ దేహము నశించిపోతుంది. అంటే దేహము పీనుగగా మారుతుంది. ఇది "నిత్యగర్భము" నుండి మొట్టమొదట బయటకు వచ్చి ప్రకృతి వలన తండ్రి దేహమునుండి తల్లి గర్భము చేరి దేహ నిర్మాణము గావించును. ఇచట వెలుపలి గాలి యొక్క సంబంధము లేకనే, ఆ ప్రాణుని వలననే వాయువు ఉత్పన్నమయి (ప్రాణాద్వాయురజాయతే) నాభి నుండి బ్రహ్మరంధ్రము వరకు నిత్యయానము సాగించుచున్నది. ప్రాణునితో పాటే



మనదేహము లోనికి ఆత్మ, తల్లి గర్భానికి వచ్చుచున్నది. ఈ ఆత్మపురుషుడు కాదు. స్త్రీ కూడా కాదు. ఇది ఏ దేహాన్ని ధరిస్తే ఆదేహ ధర్మాలు మరియు రూపము వర్తించునని మన స్వాముల వారు వివరించినారు. దీనిని "ప్రత్యగాత్మ" అన్నారు. ఇది విశ్వాత్మయందు ఒక కిరణము వంటిది. దీనిని భగవద్గీతలో "మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః" అన్నారు శ్రీ కృష్ణభగవానులు. (అధ్యా. 15 శ్లోకం. 7)

దీనికి చావు పుట్టుకలు లేవు. మనిషి దేహములో ఈ ఆత్మ ఎచ్చట ఉన్నది? దీనికి ఉపనిషత్కారులు (ముండకోపనిషత్) "దివ్యే బ్రహ్మ పురే హ్యేష వ్యోమ్న్యాత్మా ప్రతిష్ఠితః" అన్నారు. అంటే మూర్ధ్నములో ఉన్నదన్నారు. మూర్ధ్న మనగా బ్రహ్మరంధ్రము. ఈ దేహము చేతనానికి (ప్రాణ) ఆత్మకు రథము వంటిది. ఈ దేహములో ఉన్న ప్రాణునకు అశనము ప్రాప్తిస్తే సాధన యందు అన్ని విషయములు తెలుస్తాయని ఉపనిషత్కారులు వివరించినారు.

ఒక విద్యలో సాగునపుడు దేహమునకు సాత్విక ఆహారము అందినచో, మనో ఇంద్రియమునకు చపలత తగ్గి, అన్ని విషయాలు తమకు తాముగా బోధపడును. అపుడు దేహము పరిపూర్ణముగా శుద్ధమై నిలబడినపుడు, సాధకుడు ఆత్మస్థితిని తెలుసుకోగలుగుతాడు. భగవద్గీతలో ఆత్మను గూర్చి

"నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః
న చైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుతః ॥"

(అధ్యా–2–శ్లోకం. 23)

అని చెప్పబడిన స్థితి అనుభవానికి వస్తుంది.

ఆత్మ శస్త్రాలతో నశింపబడజాలదు. అగ్ని కాల్చనూ లేదు. వాయువు ఆర్పనూ లేదు నీరు తడపనూ లేదు అన్నారు. ఆధ్యాత్మ సాధనలో,

"అసతో మా సద్గమయ
తమసో మా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ"

అన్నారు. అనగా అసత్ నుండి సత్యానికి, తమస్సు నుండి జ్యోతిస్సునకు, మృత్యువు నుండి అమృతత్వానికి – సత్యానికని ఉపనిషత్తులలో వర్ణించినారు.

శ్రీ స్వామి జయతీర్థుల వారు విశదీకరించిన విషయాలు కొన్నింటిని తీసుకుంటే ఈశావాస్యోపనిషత్తు నందు గల శ్లోకము విషయమై వివరణ ఈ విధముగా ఇచ్చినారు.

"విద్యాం చా విద్యాం చ యస్తద్ వేదోభయగ్ం సహ
అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయా–మృత మశ్నుతే॥

ఎవ్వరైతే విద్యను, అవిద్యను మొత్తాన్ని తెలుసుకుంటాడో అతడు అవిద్య ద్వారా మృత్యువును దాటి, విద్య ద్వారా అమృతత్వాన్ని పొందుచున్నాడు. ఈ విద్యలు రెండింటిని ఉపాసించవలసి యున్నది అను అభిప్రాయము వివరించబడినదన్నారు స్వాములవారు. ప్రాణ విద్యనే "విద్య" అని, వ్యాకరణము, ఛందస్సు, వేదములు, ఇతిహాసములు పురాణములన్నియు "అవిద్య" అని, జ్ఞాన విహీనమైన కర్మాచరణములు అన్నియు అవిద్యలని ఉపనిషత్కారులు ఘోషించి యున్నారని శ్రీ స్వామి జయతీర్థులవారు వివరించి యున్నారు. అవిద్య ద్వారా మృత్యువును దాటవచ్చునని, విద్యద్వారా అమృతత్వాన్ని పొందవచ్చునని ఇచట చెప్పబడినది. అయితే కేవలము స్థూలమైన ధర్మము, అలాగే వేదశాస్త్రాదుల



అధ్యయనము నుండి మృత్యువును దాటుట అనగా ఇచ్ఛామరణము పొందుటకు సాధ్యము కాదన్నారు. ఇంకనూ అజ్ఞానాంధకారాన్ని కూడా మరణమే అను అర్థములో ఉపనిషత్కారుల అభిప్రాయమని శ్రీ జయతీర్థస్వాములవారు వివరణ ఇచ్చినారు. శ్రీ అచ్యుత ప్రభువులు దీని విషయమై వారి అభిప్రాయమును వెల్లడించినారు. అంధకారము వలన మృత్యువును (అజ్ఞానము) దాటుట సాధ్యము కాదని అందరికీ తెలుసును. అయితే మృత్యువును దాటుటకు, జ్ఞానాన్ని పొందుటకు విద్యయే ఆశ్రయమని వారికి తెలిసినది. ఈ విధముగా విద్యోపాసనలో స్థూల, సూక్ష్మములు రెండు ఉన్నవి. విద్య యొక్క స్థూలోపాసనవలన మృత్యువును దాటి ఇచ్ఛామరణియొక్క స్థితిని పొంది, విద్య యొక్క సూక్ష్మోపాసన వలన అమృతత్వాన్ని (జ్ఞానాన్ని) పొందుట సాధ్యమన్నారు శ్రీ ప్రభువుల వారు. విద్యోపాసనలో జపము, తపములున్నవి. జపమనగా ప్రాణాయామముతో ప్రారంభించి ఆనందానుభవము (నిరీంద్రియా నందము) వరకు అనగా ఈ స్థితిలో అమృతపానం జరుగుటవలన ఇచ్ఛామరణ స్థితి (మృత్యువును వాయిదా వేయు స్థితి) లభ్యమగును. ఇచ్చటితో ఆగకుండా తర్వాత విద్యయొక్క సూక్ష్మోపాసన సాగవలెను. అనగా అంతర్ముఖస్థితిలో ఆత్మను (తన మూలాన్ని) దర్శించి తెలిసి కొను ప్రయత్నం చేయవలెను. దీనినే తపస్సు అన్నారు జ్ఞానులు. ఆ పరశ్రేష్ఠుని కృపవలన దర్శనము, జ్ఞానము నుండే పరమ పదవి (అమృతత్వము – చిరశాంతి – మోక్షము) సాధ్యమన్నారు శ్రీ ప్రభువులు.

ఇచట కర్మత్యాగము చేయకూడదనే విషయాన్ని మరువ కూడ దన్నారు ప్రభువుగారు. జ్ఞానప్రాప్తి తర్వాత దేహ త్యాగము వరకు కర్మాచరణ చేయుట అవసరమన్నారు జ్ఞానులు. ఇంకనూ అజ్ఞానస్థితిలో ఉన్న

సాధకులు కర్మత్యాగము చేయుటవలననే భ్రమకు లోనై నాస్తికత్వమునకు లోనగుచున్నారు. ఇది వేరుకాదని స్వాముల వారు తెలియపరచినారు.

ఇచ్చట శాశ్వతమైన దైవదర్శన, తత్పరిణామము వలన (ఫలము) అనగా జ్ఞానప్రాప్తి పొందిన తర్వాత జ్ఞానఫలమైన మోక్షము లభ్యమా ? ఈ ప్రశ్నకు సమాధానమంటే భగవద్గీతలో చెప్పబడిన దన్నారు శ్రీ స్వాములవారు.

"నహి జ్ఞానేన సదృశం...." (అధ్యా4 – శ్లో.38)

అని చెప్పిన గీతావాణియే

తపస్విభ్యోధికో యోగీ జ్ఞానిభ్యోపి మతోధికః

కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున॥"

(అధ్యా –6, శ్లోకం – 46)

జ్ఞాని కంటె యోగి శ్రేష్ఠుడని చెప్పి "తస్మాద్ యోగీ భవార్జున" అని నిర్దేశింపబడినదన్నారు. కేవలము జ్ఞానప్రాప్తి అయినంత మాత్రాన మోక్షము కలుగుట సాధ్యపడదనే భావమన్నారు శ్రీ గురువుగారు. మోక్షప్రాప్తికి జ్ఞానోత్తర కర్మాచరణ అవసరమని చెప్పబడినదనే విషయమై శ్రీ స్వామివారు వివరించినారు.

దేహానికి ముఖ్యాధారమైన ప్రాణుడు తన ఉపవర్గములైన ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానమనే ఐదు వాయువుల మూలముగా దేహములో వ్యవహరించుచున్నది. ఈ వాయువుల మథనములో ఉత్పత్తి అయిన అశనమును (ఇది కూడా వాయురూపమే) ప్రాణుడు గ్రహించుచున్నాడు. ఈ సాధనయే "విద్య –జపము". ఐతే నామ జపము కాదు. వాయువు అగ్నికి మూల కారణము అయినందున ఈ పంచ వాయువుల పూజయే పంచాగ్ని పూజ అని శ్రీ స్వాములవారు వివరించి



నారు. దేహేంద్రియములపై అధికారియైన మనసే దేహములో ఉన్న శక్తి. ఈ మనస్సు, ప్రాణముల మిలనమే యోగము యొక్క మొదటిమెట్టు. ఈ రీతిగా మిలనమై బ్రహ్మరంధ్రములో ఉన్న ఆత్మను (ప్రత్యగాత్మ) చేరినపుడు ఆత్మకు తన సహజమైన ఆనందానుభవము కలుగును. ఈ అనుభవము వలన ప్రారంభములో ఉన్న అజ్ఞానము క్రమముగా దూరమగుచున్నది. చిత్‌శక్తి ప్రజ్వరిల్లుచు తన మూలమైన "సత్యాన్ని" తెలిసికొనుచున్నారు. సాధకుడు తనలో తాను వ్రతుడై ఆనందించునపుడు బ్రహ్మవిదుడై మోక్షమును పొందుటకు జగత్తులో కార్యాచరణమునకు నియుక్తుడైనవాడు బ్రహ్మవిదులలో శ్రేష్ఠుడన్నారు ఉపనిషత్కారులు.

"ఆత్మరతః ఆత్మక్రీడః క్రియావాన్

ఏష బ్రహ్మ విదాం వరిష్ఠః"

అని ఉపనిషత్కారులు ఘోషించియున్నారు.

మనసు గురించి తెలిసికొనవలసి యున్నది. ఇది మనలో ఉన్న అద్భుతశక్తి అన్నారు శ్రీ స్వాములవారు. ఇంద్రియముల ద్వారా వ్యవహరించునపుడు దీనిని "కల్పము" అన్నారు. మన ఆశ్రమ గ్రంథములలో "కాయకల్పము – ముక్తిసాధన" అనునది ముఖ్యమైన గ్రంథము. ఇంద్రియముల ద్వారా బహిర్వ్యాప్తిలో ఉన్న ఈ మనస్సు అంతర్ముఖమై తనకు దేహములో ఆధారమైన ప్రాణునితో చేరి ఊర్ధ్వ ముఖముగా సాగితే, బ్రహ్మరంధ్రములో ప్రాణ మనస్సుల మూలమైన అధిష్ఠాన చేతనాన్ని (ఆత్మను) చేరినపుడు మనస్సు యొక్క మూలస్థితి ఏమనునది అనుభవానికి వస్తుంది. ఈ స్థితిలో విశ్వములో దానిని తెలిసికొని, దాని నైజాన్ని సాధకుడు తెలుసుకోగలుగుచున్నాడు. ఈ శక్తినే "ఇచ్ఛాశక్తి" "విల్‌పవర్" అని పిలుచుచున్నారు. ఈ మనస్సు యొక్క

మూలస్థితిని విమర్శాశక్తి (బుద్ధి) కంటె పైస్థితే అని స్వామివారు అన్నారు. ఇచ్చట ఇచ్ఛాశక్తిని స్వప్రేరణ అని అన్నారు. ఈ శుద్ధమైన మనస్సు విశ్వవ్యాప్తమైన తన మూలమైన మనస్తత్వములో (ఆత్మ తత్వములో) లీనమై కాలగతిని తెలిసికొని కర్తవ్యాన్ని అర్థము చేసికొనగలుగుచున్నారు. ఈ స్థితినే దైవప్రేరణ (Inspiration) అన్నారని శ్రీ స్వామి జయతీర్థులు వివరించినారు. ఈ మనస్సు యొక్క ప్రాధాన్యత చాలా అధికము అయినందువల్లనే "మన ఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః " అని చెప్పియున్నారు పెద్దలు. అయితే మనలోని మనస్సు క్రింది స్థాయిలో వ్యవహరించుచు నిలబడి యున్నది. ఇది పై స్థాయికి పోవాలంటే ప్రాణునితో మిలనమైనపుడు మాత్రమే సాధ్యమగును. మనస్సు అనునది జీవుని లక్ష్యమని గ్రహించవలెను. అయితే ఇది మనదేహములో ఉన్న జీవునికంటె భిన్నమైన శక్తి కాదు. అదే విధముగా బుద్ధి, జ్ఞానము, అరిషడ్వర్గములు కూడా అని స్వామివారు తెలియజేసినారు. ప్రాణాన్ని గురించి శ్రీ స్వాములవారు వివరించినారు. ప్రాణశక్తి అన్ని చోట్ల ఉన్నది. ఇదే ఆధారమైనది. తల్లి గర్భము నుండి భూగర్భానికి వచ్చిన తర్వాత స్థూలవాయువు ఆకర్షణ వలన శ్వాసోచ్ఛ్వాసాలు నడుచు చున్నవి. మనస్సు కూడా బహిర్ముఖ ప్రాప్తి పొందుచున్నది. వయస్సు పెరుగుచున్నపుడు కఫాది దోషములు ఎక్కువ అయి తల్లి గర్భములో జరిగిన ప్రాణాయామస్థితి నడుచుటకు వీలుకాదు. ఆ మార్గము మూసుకొని పోవుచున్నది. తిరిగి దానిని స్థూలగురువుద్వారా విద్యను పొంది సాధిస్తే ఈ మబ్బు తొలగి ఆత్మానుభూతి కలుగుచున్నది. ఈ స్థితిని చేరుటకు స్థూల పూజలతో నిష్ఠలతో సాధ్యము కాదని ఉపనిషత్కారులు చెప్పియున్నారు.

దేహములో ఉన్న అన్ని ఇంద్రియాలకు, మనస్సునకు శక్తి ఇచ్చునది ప్రాణచేతనమే, దేహానికి శక్తి కేంద్రము. ఇది దేహముపై భాగములో



ఉన్నది. ఇంద్రియముల ద్వారా పనిచేయునపుడు ఈ శక్తి ఖర్చు అగుటచే దేహము అలసట చెందుచున్నది. ఈ శక్తి కేంద్రస్థానమే "బ్రహ్మపురి – ఆత్మపురి –గుహ" ఇత్యాదిగా పిలువ బడుచున్నది. దేహములో అత్యుత్తమస్థానము బ్రహ్మరంధ్రము. మనస్సు ఉన్నతస్థితి పొందవలెనంటే బ్రహ్మరంధ్రమును చేరి విరమించి నపుడే సాధ్యమగును. ప్రాణుడు అశనమును తీసికొని శక్తిని పొంది మనస్సుతో కూడి బ్రహ్మరంధ్రములో ఉన్న ఆత్మను చేరవలసి యున్నది. ఈ ప్రాణుడు అశనాధారి అగుటవలన అశనాన్ని ప్రతిరోజు సాధనలో ఉత్పత్తి చేయవలెను. అందువలననే "అన్నం బహువిధం కుర్యాత్" అన్నారు. అన్నం అంటే అశనం. ఈ అశనం దేహానికి ఆహారం కాదు. ప్రాణశక్తికి మాత్రమే ఆహారము. దేహములో వ్యాప్తి చెందిన ప్రాణుని ఉపవర్గమైన వాయువును మథించునపుడు దేహములోని కల్మషములు ప్రాణాగ్నిలో భస్మమై, వాయువు యొక్క శుద్ధసారమైన "అశనము" కలుగుచున్నది. ఈ అశన సేవన వలన ప్రాణుడు పరిపుష్టుడై మనోమిలనము చెంది ఊర్ధ్వమార్గములో సాగి మూలాన్ని చేరుట సాధ్యమగును. ఈ అశనోత్పత్తికి వాయు మథనము కావలెను. ఇదే సూక్ష్మకర్మము జీవకర్మము అని ఉపనిషత్కారులు దీనిని గురించి ఈ విధముగా తెలియజేసినారు. (ఈశావాస్య ఉపనిషత్)

"కుర్వన్నే వేహ కర్మాణి । జిజీ విషేచ్ఛతం సమాః। తేన త్యక్తేన భుంజీథా । మాగృధః కస్యస్విద్ధనం॥" అనగా తాను ఈ జీవకర్మ నుండి ఉత్పత్తి యగు స్వధనమైన అశనము తప్ప ఇతరములను స్వీకరించకుండా నూరు సంవత్సరములు జీవించి స్థూలమైన ధర్మకర్మలు చేసి జీవితాన్ని ముగించవలయునన్నదే బోధితమగు చున్నది. ఈ సూక్ష్మ కర్మను జ్ఞానులు ఎన్నోరీతులుగా బోధించినను తెలిసికొనుట కష్టమైనదని స్వామివారు వివరించినారు. ఈ సూక్ష్మ కర్మాచరణము రహస్యముగా ఉన్నది. విద్యోపదేశము కానివారు చూచుటకు అవకాశము ఉండలేదన్నారు.

మనదేహములో ఉన్న ప్రాణుడు చేయు స్థూలకర్మను గూర్చి ఉపనిషత్తులలో తెలియజేసినారు.

"ఊర్ధ్వం ప్రాణమున్నయ త్యపానం ప్రత్యగస్యతి
మధ్యే వామన మాసీనం విశ్వే దేవా ఉపాసతే॥"

(కఠోపనిషత్ - పంచమవల్లి - శ్లోకం. 3)

అనగా ఈ ప్రాణము వాయువును పైకి లాగుచున్నది. అపాన వాయువును క్రిందకు నొక్కుచున్నది. వాయువు యొక్క ప్రాణాపానుల మార్పుచేయు స్థానములో (మధ్య) స్థితముగా ఉన్న వామనుని (అణురూపమైన ప్రాణచేతనాన్ని) విశ్వములో ఉన్న అందరు దేవతలు ఉపాసించుచున్నారు. మధ్య అనగా రథనాభిలో అనగా భ్రూమధ్యము నుండి పై భాగము అనగా బ్రహ్మరంధ్రము క్రింది భాగము వైపు అని స్వాములవారు వివరించినారు. దేహములో ఉన్న "జీవి" దేనిపై ఆధారపడి జీవించుచున్నాడు అను విషయమును కఠోపనిషత్తు నందు వివరించి యున్నారు.

"న ప్రాణేన నా పానేన మర్త్యోజీవతి కశ్చన
ఇతరేణ తు జీవంతి యస్మిన్నేతా వుపాశ్రితా"

(కఠోపనిషత్ - పంచమవల్లి - శ్లోకం. 5)

మనదేహములో ఉన్న జీవము ప్రాణవాయువు నుండి గాని అపాన వాయువు నుండి గాని జీవించి యుండలేదు. ఈ రెండు దేని ఆశ్రయము వలన నడుచుచున్నవో దాని బలము వలన (ప్రాణ బలము) ఆ ప్రాణుని నుండి బ్రతికియున్నది. అనగా మన దేహములో ఉన్న పంచ వాయువులకు జీవిని బ్రతికించు శక్తి లేదనే భావన. కాబట్టి ప్రాణమే అన్నింటికి ముఖ్య సారధి అని శ్రీగురువుగారు చెప్పినారు.

* * *



8. తపస్సు : శ్రీ విజయాంద్రస్వాములవారు శ్రీ అచ్యుతగురువు గారి సాన్నిధ్యములో గవి జీవనము ఆచరించి పసితనము నుండి వారి అధ్యయనములో జీవించి, తపస్సు విషయమై వెలిబుచ్చిన కొన్ని విషయాలు సారాంశాన్ని కొంతవరకు తెలిసికోవలసియున్నది. వారు ఈ విధముగా ఉపన్యసించినారు.

ఓం సహ నావవతు సహనౌ భునక్తు
సహ వీర్యం కరవావహై తేజస్వి నావధీతమస్తు
మా విద్విషావహై ఓం శాంతిః శాంతిః శాంతిః ॥

(ఈశ, కేన, తైత్తిరీయోపనిషత్తులు)

పైన తెలిపిన మంత్రము నుండి ఋషి మునులు దేహము నందున్న విషయాలను ప్రార్థించుకొన్నారు. ఇది మనస్సు ప్రాణముల యొక్క సంభాషణ అని తెలియనగును. మనమిద్దరము ఒక్కటౌదాము. అనగా మనస్సు ప్రాణములు ఒక్కటగుట. ఉపదేశమై తపించి పొందిన దానిని ఇరువురము కలసి భుజించుదము. ఇరువురము చేరి వీర్యాన్ని చేయుదము. అది తేజస్వియై ప్రాప్తించుగాక. మన యిద్దరి మధ్య విరుద్ధము ప్రాప్తించకుండా ఉండును గాక.

తపస్సు అను శబ్దము ఈ రోజుది కాదు. దీని అనుభూతి, ధ్యానము ఈ రోజుది కాదు. అనగా మనకు తెలియకుండా ఏనాడో చెప్పబడిన తపస్సు విషయమై ఒక రోజులో వర్ణించి ముగించుట కష్టము. అయితే సాధకునకు అంతటి విషయమై చర్చించుట తగనే తగదు. కొంత విషయమై అనగా యావత్తు నాగరికత, సంస్కృతి, సుఖానుభూతి, ఆనందము, త్యాగము, అన్ని విషయములు ఈ తపస్సుపై ఆధారపడి బ్రతికియున్నవని తెలుసుకొంటే చాలు.

రాజులయందు గాని, ఋషి మునుల యందు గాని మరి ఎవ్వరి విషయమునందుగాని, అనుభవము పొంది బయటకు వచ్చి తమ అనుభవాలను తత్ఫలములను విశదపరచెదరో వారిదే ప్రాధాన్యముగా కనిపించుచున్నది. "ఆత్మక్రీడః ఆత్మరతః క్రియావానేవ బ్రహ్మవిదాం వరిష్ఠా" వీరినే మనము అనుసరించవలయును. వీరే మనకు మార్గదర్శకులు. మానవులకు బహుకాలము నుండి ఇంద్రియ జీవనమై జీవించి వీటి విషయము తెలియకనే కేవలం విషయలంపట జీవనమై సాగుచు వచ్చినది. మనకు తెలియునది ఏమనగా ఈ రీతి మనుష్యులే హెచ్చు. అయితే ఇచ్చట ఆ విధముగా లేదు. ఇటువంటి మనిషి విచారణశక్తిని పొందవలసి యున్నది. ఆధ్యాత్మిక చింతన కావలసియున్నది. దైవభక్తుడు కావలసియున్నది. మహాతపస్సు ఆచరించిననే తప్ప ఇది ప్రాప్తించదు. ఆ మనుష్యత్వము ప్రాప్తించనిదే ఆనందము, మానవ జీవనము యొక్క సాఫల్యము ప్రాప్తించదు. ఇవన్నియు లభించనిదే మానవ జీవితము సార్థకము కాదు. ప్రతి సామాన్య జీవనములో ఈ నాలుగు విధములు నడచుచున్నవి. ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞాని అని భక్తులను (7-16) నాలుగు విధములుగా విభజించినారు. అయితే ఈ నాలుగు అంతరములు అనునవి సహజములు. తపస్సు నందు దర్శనము, అనుగ్రహము, ఆనందము, అచ్చట ప్రాప్తించునవి కావటం వలన మనలను ఒక స్థితికి కొనిపోవును.

సారాచార విచారము లేకయున్నను, ఒక విధముగా ఈ లోక విహారములో విముఖుడైనట్లే. భిన్నమై ఉన్నతి దొరకక పోయిననూ ఆ స్థితియందే విహరించు ఒక రీతికి ఆర్త భక్తుడనుచున్నారు. పుణ్యము వలన అతని జీవితము సాధువై, సారాచార విచారము తెలిసికొని తపస్సు దొరికి, సాగి, చికిత్సాబుద్ధి, విహారానికి అనగా అంతకు ముందున్న



విహారానికి మరియు విచారానికి పొందిన వానిని జిజ్ఞాసు భక్తుడు అన్నారు. ఆ విధముగానే నిర్ణీత సుఖము, నిర్ణీత జ్ఞానాన్ని పొంది తగినట్లు తపస్సు నందు సాగి అతని ప్రవర్తనలో అర్థమైన రీతిలో ప్రవర్తించువానిని అర్థార్థి అన్నారు. ఎటువంటి జటిలములైన విషయముల నైనను నిశ్చయబుద్ధితో తెలిసికొని అటువంటివి భగవత్ప్రేరణము అని జీవించువారిని జ్ఞాని అని పిలిచియున్నారు. ఈ నాలుగు విషయములు అందరు పొందుటకు ప్రయత్నింప తగినవి. అందరు పొందవలసి యున్నది.

పై విషయములలో తపస్సు సాగునపుడు దైవానుగ్రహము వలన దర్శనములు కలుగును. వీటిని దాటిన తరువాత జీవాత్మల ఐక్యముయొక్క ఆత్మానందము కలుగును. ఇది కలిగినపుడు సుఖానుభూతి, తృప్తి, ఆరాధన, భక్తి, ఆనందము కలుగును. వీటి నన్నింటిని పొందవలెనంటే తపస్సు తప్ప మరొక మార్గము ద్వారా అసాధ్యము

ఏకో వశీ సర్వభూతాంతరాత్మా
ఏకం రూపం బహుధాః యః కరోతి
తమాత్మస్థం యే-ను పశ్యంతి ధీరాః
తేషాం సుఖం శాశ్వతం నేతరేషామ్ (కఠోపనిషత్)

అని ఋషులు చెప్పియున్నారు. ఈ విధముగా చెప్పుకొంటూ రాగా తపస్సు ప్రత్యక్ష దుర్లభమై మనకు అంతర్ముఖ జీవనము కరువై కేవలము బాహ్యాచార విచారములందే నిమగ్నమై, మత వైశిష్ట్యములు, వైషమ్యములయందు పడి జీవించడమైనది. ఇంతకంటె వేరే ప్రయోజనము ఏమీ లేదు.

భారతదేశములో ఆధ్యాత్మిక సాహిత్యమునకు ఏ విధమైన కొరత లేదు. అయినను ప్రాచీన సాహిత్యమునకు అనగా వేదోపనిషత్తులకు

తగిన రీతిగా అర్థము చెప్పుటకు ఆ తపస్సు కావలసి యున్నది. అనేకులు అనేక రీతులలో ఆతపస్సును వచ్చినట్లు వివరించి చెప్పినట్లు కనిపించు చున్నది. ఈ విధముగా ఆ ప్రత్యక్ష సాధనా మార్గము యొక్క విషయము తెలియకుండా పోయినది. మొదటి దశయందే ఈ విషయమై ఉత్సాహము లేదు. దీని విషయమై ఆ సాధన మార్గము విషయమై తెలియలేదు. మానవుడు ఎన్నో విజ్ఞాన విషయములలో ముందంజ వేసినాడు. ఎన్ని బాహ్య సౌందర్యములు నిర్మించుకొన్నను వాటివల్ల లభించు బాహ్య సుఖాలు క్షణికములే. శాశ్వత సుఖము లభించదు. ఈ సాధన తెలిసికొని సాధించి నప్పుడే శాశ్వత ఆనందమును పొందగలుగుచున్నాడు.

వీటన్నింటికి కావలసిన సాధనను "విద్య" అని అన్నారు. దీనిని సాధించు క్రమమును "తపస్సు" అంటూ వచ్చినారు. ప్రపంచంలో అనేక పద్ధతులు చెప్పువారు ఉన్నారు. కావున సాధకుడు విచికిత్సా బుద్ధితో ఈ విషయమై విచారించవలసియున్నది. అకార, ఉకార, మకారములలో తిరుగు చేతనము ఈశ్ అనునట్లుగా సహకార ప్రాధాన్యమైన స్పందనతో మనలో ప్రవహించుచున్నది. అందువలననే స్వరూప ధ్యానము, స్వరూప జ్ఞానము, స్వరూప అనుభవాన్ని గురించి తెలియజేసి యున్నారు. దీన్ని విహారాన్ని ఓమ్ అని వర్ణించియున్నారు.

సాధనా విషయమై జపము అని పిలిచినారు. ఇది తపస్సు యొక్క మరొక పేరు. ఇది నాభి నుండి బ్రహ్మ స్థానము వరకు ఊర్ధ్వగతిలో ప్రాణచేతనమును క్రమపద్ధతిలో ఉపదేశిత మార్గములో అభ్యాసము నందు ఉంచవలెను. దీనినే తపోమార్గమని పిలచినారు. ఇది కాలాతీతము. సాధన అదే విధముగా సాగవలెను. త్రి గురువు అనగా ఇందులో సాగి అనుభవించినవాడు. అంతస్థ మహా గురువు ప్రాణశక్తి యొక్క స్నేహము



చేయుటకు అవకాశము ఇచ్చినందులకు ధన్యవాదములు. ఈ విధముగా చేయగల్గితేనే తపస్సు యొక్క సుఖము అనుభవమగుట సాధ్యము.

ఋషి మునులు తపస్సు విషయములో వివరించిన మాటలు చూచినచో మనకు మనలో సాగిన ప్రయాణము ఉన్నది. నాభి నుండి బ్రహ్మస్థానము వరకు హృదయకేంద్రమై సాగు ప్రయాణమున్నది. ఆ అంతః చేతనమును ప్రాణ చేతనము అనుచున్నారు. దానినే స్నేహముతో సాగు క్రమానికి బ్రహ్మవిద్య, బ్రహ్మవిద్యోపదేశము అన్నారు.

తెలిసిన గురువుగారి నుండి ఆవిద్య యొక్క సాధనా క్రమాన్ని తెలిసికొని అనగా దాని ప్రారంభస్థానము నుండి ప్రారంభించి సాధించు మార్గాన్ని పొంది సాధించవలెను. ఆ స్థానాన్ని గురుస్థానము అని అను చున్నారు. ఆ గురుస్థానము యొక్క స్నేహమును వదలక సాగినచో తపస్సు సాగును. తరువాత సాధనానుభవము పొందుటకు వీలున్నది. ఇది ఒకటే ఆత్యంతిక సాధనము.

"ఏకం సత్ విప్రా బహుధా వదంతి" అన్నారు ఋషులు. ఉన్న ఒకే ఒక మార్గమును బహు విధములుగా వర్ణించవచ్చును. అయితే అనేక మార్గములు ఉన్నవని చెప్పుట అనుచితము. ఇది వృథా అసంస్కృతము, అనాగరికతలో చెప్పు సాధనా విహీనులు మాట అని తెలియనగును.

ఈ విధముగా కాకూడదని మా పరమపూజ్య ప్రభుశ్రీ యోగి అచ్యుతులవారు ఋష్యమూక ఆశ్రమాన్ని స్థాపించినారు. అది ప్రస్తుతము శ్రీ అచ్యుతాశ్రమము అని పిలువబడుచున్నది. తపోవిద్య, తత్త్వప్రణాళిక జీవనోపాధి అయిన బ్రహ్మవిద్యను బోధించుచున్నారు. సాధకులు అనేకులు సాధనయందు సాగుచున్నారు.

ఇంకనూ తెలిసికోవలయుననన్నచో ప్రణిపాతేన, పరిప్రశ్నేన, ప్రతిబోధయేత్ అన్నారు ప్రభువుగారు. బ్రహ్మవిద్య, బ్రహ్మత్వం, తపస్సు ఇత్యాదులను బోధించు పాఠశాలలు లేవు. కేవలము బాహ్య విషయములు తెలిసికొనుటకు పాఠశాలలు, కళాశాలలు పెట్టి యున్నారు. వీటి వల్ల విద్యార్థులు తమకు తామే చదువు కొనుటకు అవకాశమున్నది. ఆత్యంతిక సత్యమును తెలిసికొనుటకు మాత్రము ఋషి వాణినే అనుసరించవలసి యున్నది. ఇచ్చట శరణాగతి లేనిదే సాధ్యముకాదు.

పూర్వము ఆశ్రమాలు అరణ్యాలలో ఏకాంత స్థలాలలో ఏర్పాటు చేసేవారు. బయటి ప్రపంచానికి దూరముగా ఉండి కొన్ని సంవత్సరములు ఋషులను ఆశ్రయించి వారి నుండి ఉపదేశితులై తపించి, మరియు వారి నుండి బోధితులై తెలిసికొని సేవచేసి తపస్సును చేసి అనేక విధములైన ఫలితములను పొంది జ్ఞానము, బ్రహ్మజ్ఞానము, తన్మూలకముగా లభించిన ఆనందానుభూతులను పొందు అవకాశముండెను.

మానవుడు పూర్ణుడగుటకు కావలసిన సంపత్తులు అనగా ప్రయత్న సంస్కారం, సహకారము, అనుగ్రహములు. ఈ సుందరమైన సంపత్తునుండి అలంకృతమైనపుడు మానవ పూర్ణత్వము సుఖానుభూతికి పూర్ణత్వము కాగలదు. వీనిలో ఏది తక్కువైననూ కష్టమే. అయినా మానవుడు తపస్సులో సాగు ప్రయత్నములో అనుగ్రహము బలమైనపుడు దేనినైనా దాటుకొని ఉత్తుంగ స్థితిని పొందుచున్నాడు. కావున అన్నింటికి అనుగ్రహమే పెద్దది. దీనిని పొందుటకు సవినయ పూర్వకమైన ప్రయత్నము సాగవలయును. అనగా తపస్సు అనుగ్రహ దత్తమై మానవుడు పొందుచున్నాడు.

కావున తపస్సులో దేనినీ ఉదాసీనము చేయకూడదు. బాహ్య జీవన శుచిత్వము ఉండవలెను. జగజ్జీవనము త్యాజ్యము కాదు. సృష్టి



జీవులది కాదు. భగవంతునిది. ఆహార శుచిత్వము, స్థాన శుచిత్వము, దేహ శుచిత్వము, మనో శుచిత్వాన్ని కాపాడుకొంటేనే తపస్సు లభించి సుఖమును ఇస్తుంది. లేనిచో ఎచ్చటికో తోసివేయబడి మబ్బు ఆవరించును. మానవ జీవితములో అశాంతి, అసంతృప్తి పోవాలంటే తపస్సు యొక్క అవసరమున్నది. దీనిని పొంది నిర్మల మనస్సులై కనీసము ఒక గంటకు పైబడి తపస్సు సాగినచో రోజులో కలిగిన మానసిక అలసట తప్పును. దీనిని సాధించవలసి యున్నది. కేవలము వినుటవలన సాధ్యము కాదు. ఏదో విధముగా పుస్తకములు చదివి ఈ తపో సాధన చేయుట సాధ్యము కాదు. కావున ఈ సాధన తెలిసినవారి నుండి ప్రత్యక్షముగా పొంది సాగవలసి యున్నది. యోగసాధన అందరికీ ఒక్కటే. ఇది ఒక జాతి, ఒక మతానికి సంబంధించినది కాదు. ఎవరైనా ఆ విధముగా భావించినచో అది కేవలము బాలబుద్ధి అగును. కేవలము వాచాలత్వము అగును. మానవుల దేహములో సంచరించు వాయువు వేర్వేరు కాజాలదు. ఇది ఒకటే. యోగము కూడా ఒకటే. సాధన కూడా ఒకటే. యోగ మనగా ప్రాణవాయువును నాభి నుండి బ్రహ్మరంధ్రము వరకు సహజముగా ప్రయాణము చేయునట్లు ఉపదేశము పొంది గురుస్థానము నుండి దాని కేంద్రమైన హృదయము నుండి నాభివరకు అనగా బ్రహ్మరంధ్రము నుండి నాభి వరకు గతాగతి ఆచరించవలెను.

"సర్వ ద్వారాణి సంయమ్య మనోహృది నిరుధ్య చ।
మూర్ధ్న్యా ధాయాత్మనః ప్రాణం ఆస్థితో యోగధారణామ్॥"

(భగవద్గీత – అధ్యా. 8 – శ్లోకం. 12)

అని భగవద్గీతలో వివరించబడినది. అనగా ఇంద్రియ మూల కముగా ప్రవహించు మనోవికారములను సంయమించి క్రమముగా మనో ప్రాణములు మిలనము చేసి సదా గురుస్థానములో మనస్సును

నిలిపి ప్రాణుని గతాగతిని బ్రహ్మస్థానము వరకు (బ్రహ్మరంధ్రము) ఏకరీతిగ నడిపించుసాధనకు యోగము అన్నారు. ఇది దేహము లోపలనే జరుగు క్రియ. బ్రహ్మేంద్రియములతో కాదు. మనోవాయుమిలనము, మనోప్రాణ మిలనము, జీవాత్మల మిలనము ఇవన్నీ సాధనలో కలుగు అనుభవములు. కావున తపస్సు సకల శ్రేయోదాయకము. ఈ తపస్సు దేవతల నుండి, ఋషిమునుల నుండి, సిద్ధ సాధ్యుల నుండి ఆచరించు కొనుచూ వచ్చిన తపస్సు అని శ్రీ స్వామి విజయీంద్రులవారు తెలియచేసిరి.

శ్రీ అచ్యుతగురువుగారు మెచ్చిన గ్రంథము భగవద్గీత. మీరు ఈ గ్రంథాన్ని ఎందుకు మెచ్చుచున్నారని అడుగగా వారు ఈ విధముగా సెలవిచ్చినారట. జగత్తులో సమగ్రమైన తత్త్వగ్రంథము "గీత" ఒక్కటే. ఉపనిషత్తులు కొంతవరకు ఫర్వాలేదు. శ్రీకృష్ణుడు పై స్థాయి నుండే అవతరించినాడు. మేము వారి అతి సమీపానికి పోవు వారము. నేనే వారు, వారే నేను అని చెప్పునటువంటి ఆత్మీయత మాయందున్నది. కాని నేను యోగిని. వారు యోగీశ్వరులు అన్నారు.

ఈ ప్రపంచము ఏ విధముగా ఉద్భవించినది అను విషయమును స్వామి జయతీర్థులవారు ప్రభువుల నిర్ణయము విషయమై తెలియజేసినారు. దైవము నుండి సృష్టి యొక్క ఆదిలో ఉద్భవించిన పురుషుడు హిరణ్యగర్భుడు. పురుషరూపి పరమాత్ముని వలన నరఋషి, ఆదికేశవుడని, శివుడని, కాముడు అని, ఆదికపిలుడు అని జ్ఞానులు ఒక్కొక్కరు ఒక్కొక్కరీతిగా వర్ణించినారని ప్రభువులు అన్నారు. ఈ పురుషుడు మూడు మూర్తులను సృజించి, విశ్వనిర్మాణం గావించి ఈ మూర్తుల మూలకముగా జగత్తును రక్షించు చున్నారని శ్రీ ప్రభువులు తెలియజేసి యున్నారు.



అయితే పురాణ ఇతిహాసములు చూచినపుడు పరీక్షిత్ మహారాజు ఈ ప్రపంచము ఏ విధముగా ఉద్భవించినదో తెలిసికొనవలె ననెడి కుతూహలముతో శుకయోగిని అడిగెనని శ్రీ స్వాములవారు తెలియజేసినారు. శుకమహర్షి గతములో సర్వేశ్వరుడు బ్రహ్మకు తెలిపిన క్రమాన్ని పరీక్షిత్ మహారాజుకు తెలియజేసిన విషయాలు వివరించినారు. రచించినవాడు విరించి అని, భ్రమించిన వాడు బ్రహ్మ అని శ్రీ ప్రభువులు అన్నట్లు శ్రీ జయతీర్థ స్వాములవారు చెప్పినారు. ఇది సంకల్ప సృష్టి. దీనిని సంకల్పించునది పురుష రూపి పరమాత్మ. సృష్టి, స్థితి, లయ కర్తవ్యములు ఎప్పుడూ నడచుచున్నదని, దేవుని యందు ఇచ్ఛలేదు. ఆయన ఆనందానుభూతి లోనే పురుషుడు ఆవిర్భవించినాడని, ఇతనినే ఆదిదేవుడని, పురుషరూపి పరమాత్మ, హిరణ్యగర్భుడు, విరాట్ పురుషుడు, ఈశ్వరుడని జ్ఞానులు తెలియజేసినారని శ్రీ ప్రభువులు చెప్పినట్లుగా జయతీర్థస్వాముల వారు తెలియజేసినారు. ఆ దేవునినే ఆత్మ, విశ్వాత్మ అన్నారట జ్ఞానులు. ఇది ప్రభువుల నిర్ణయము.

"ఆత్మ సర్వోత్తమః ఓమ్" అని ఆశ్రమములో సూక్తుల యందు పఠించుచున్నాము. ఈ విరాట్ పురుషుని యందు ఇచ్ఛకలిగి ఆ ఇచ్ఛవలన శక్తియు వ్యాప్తమై, విశ్వమై రూపము పొందినదట. కావున ఇతనిని జ్ఞానులు "కాముడు" అన్నారు. అనగా "ఇచ్ఛ" పురుషుడు ఆపర శ్రేష్ఠుడే అనగా ఆ పురుషుని జనకుడని "స్వరాట్" అనియు జ్ఞానులు తెలిపియున్నారని శ్రీ గురువుగారు చెప్పినట్లుగా జయతీర్థ స్వాములవారు అన్నారు. ఆ పరశ్రేష్ఠునే దేవుడని సాక్షీభూతముగా నిలచియున్నాడని నిర్లిప్తుడు అని తెలియజేయుచూ శ్రుతి విషయమును గురించి వివరించినారు. "నాహం కర్తా, కర్తా కామః" ఇది శ్రుతి యొక్క రహస్య భావమన్నారు శ్రీ జయతీర్థులు. ఈ

సృష్టికి ఎవరు కర్త ? అంటే "కాముదు' ఇచ్ఛాపురుషుడు. ఇచ్చట "కాముదు" అనగా మన్మధుడు కాదని తెలిసికొనవలయునని శ్రీ జయ తీర్థస్వాముల వారు సెలవిచ్చినారు.

## 9. గీతా సందేశము

పై విషయమును గురించి శ్రీ విజయాంధ్రస్వాములవారు ఇట్లు తెలియజేసినారు. విశ్వములో భక్తికి ప్రేమకు అవరోధములు ఉండవు. తత్త్వమునకు వలె ప్రేమకు కూడా జాతి, మత, లింగ, దేశ, భేదములుండవు. విచక్షణతయు కూడదు. శాశ్వతమైన సత్యమును గ్రహించుటయే మానవుని లక్ష్యముగా ఉండవలెను. అట్టి సత్యమును అనుభవమునకు తెచ్చుకొని ఇతరులకు అనుభవము కల్గించుటయే జీవనోద్దేశముగా ఉండవలెను. ఇది నాగురువాజ్ఞ. నా లక్ష్యము కూడా. కర్తవ్య పరాయణతను పురిగొల్పుటయే గీతా సందేశము. అంతేకాని నిత్యము పారాయణము చేయుట కాదని శ్రీ విజయాంధ్ర స్వాములవారు అన్నారు.

శ్రీ కృష్ణభగవానుడు వినా, నానుండిగాని, మీ నుండి గాని, మరియెవరి నుండి గాని తత్త్వవిచారము అంత సరళముగా, సుందరముగా వివరించుట సాధ్యముకాదు. కాని లోకులు ఎంతమంది అర్థము చేసుకొన్నారు? ఆ విధముగా ప్రవర్తించు చున్నారు? ఒకనాడు నా గురు దేవుడు నన్ను గూర్చి నీ వద్ద భగవద్గీత కలదా అన్నపుడు ఉన్నదనుటయే గాక నిత్యము పారాయణము చేయుచున్నాను అన్నాను. అందులకు ఆయన నవ్వుచూ నాయనా! కృష్ణుడు గీతను చదువుమని కాదు చెప్పినది, చేయుమని. మీరు దానిని చదువుటకే ప్రాధాన్యమిచ్చి రోతపట్టించితిరి అన్నారు. కొంత లోతుగా ఆలోచించిన అందలి సత్యమేమో మనకగపడును. కృష్ణుడు అర్జునునకు కర్తవ్యమును అట్లే కర్మను చేయవలెనని బోధించెనే



కాని చదువుమనలేదు. భగవద్గీత ఆదికాలము నుండి ఉండనే ఉన్నది. మరచినందుననే ద్వాపరాంతమున కృష్ణావతారమున పునః దానిని ఆచరించవలసినదిగా గట్టిగా ప్రబోధించెను. ఈ గీత అన్ని చోట్ల వ్యాపించినది. స్థూల సూక్ష్మములందు సర్వదా మనలను వెన్నంటి యుండునది ఏది? కర్మ. అది మనలను బంధించుచున్నది. మనమై అంటుకొన్న కర్మ కర్తవ్యము దానిని గురించి మాట్లాడుట తక్కువ చేసి ఆచరణ పెంచవలెను.

విదేశములందు తత్త్వవిచార విషయమై మాట్లాడే చాపల్యము తక్కువ. అందువలన మాట్లాడేవారిని చూచిన ఆశ్చర్యపడెదరు. సత్యమును గూర్చి మాట్లాడుట యందే కాలక్షేపము చేయక స్వానుభవమున గ్రహించెదరు. విదేశీయులు స్థూలకర్మరంగమున అన్ని విషయములందును ప్రగతి సాధించినారు. జీవనావసర వస్తు సమృద్ధి, సంతోషము, తృప్తి లభించినది. ఇది దేని వలన ? వారికి కర్తవ్యముపై గల ఇచ్ఛ వలన. మన భారతదేశమున తత్త్వమును గూర్చి మాట్లాడుటతోనే పుణ్యకాలము గడచిపోవును. స్థూలముగను, సూక్ష్మముగను కర్మభ్రష్టత్వము ఎక్కువగుటవలననే. మన దేశము అన్ని విషయములందును దైవ కృపకు దూరమైనది. మనము మాత్రము "తత్త్వజ్ఞుల" మనెడి గర్వము విడువమైతిమి. కర్మ నిష్ఠుడైన సామాన్య విదేశీయుని ముఖముపై గల విజయహాసము తత్త్వజ్ఞులమని చెప్పుకొను మన వారి ముఖము లందుండదు. మరి మీరు వారికి ఏమివ్వగలరు ? వారు మన వట్టి మాటలకు విలువ ఎందుకిచ్చెదరు ? కష్టపడువానికే ఫలమబ్బును. భారతీయ తత్త్వము ఆది నుండి ఋషులవలన ప్రఖ్యాతి గన్నది వారు "యద్యదాచరతి శ్రేష్ఠః" అనబడు ఆదర్శ పురుషులగుటచే కొన్ని శతాబ్దములుగా కార్యశూరులుగాక మనవారు వాక్యశూరులైనారు.

స్వరూప చింతనయనుడు, ధ్యానమనుడు ఆచరించు స్థానము స్థితి స్వల్పమున సూక్ష్మములో ఉన్నది. పదునెనిమిది అధ్యాయములు గల గీతా శ్లోకముల చెప్పుట నా విధి కాదు. అందుకు గ్రంథము ఉండనే ఉన్నది. ఈ గీతాబోధ ఉద్దేశమును దాని సారాంశమును సింహావలోకనముగా స్పృశించి మన కర్తవ్యము నిత్యము చేసికొన్న చాలును. కావలసినంతయున్నది.

అర్జునునకు గీతోపదేశమైనది అదియును యుద్ధావసరమున మాత్రమే. అయిన అందరికిని అన్ని కాలములకు అది అవసరమై యుండలేదు. ఈనాడు మన దేశీయులు మాత్రమే కాదు విదేశీయులు కూడా దాని విషయమై శ్రద్ధాభక్తులతో గమనించుటకు ఏమి కారణము. దాని మహిమ ఎంత ? అంతటి ఉత్కృష్టతకు ఏమి కారణమో ఆలోచింతము.

అర్జునుడు అధీరుడు కాదు. శాస్త్ర జ్ఞానమున విడువదగిన వాడును కాడు. కృష్ణునికి భక్తులు లేక పోలేదు. ఏకాంతభక్తుడైన భీముడున్నాడు. మహాభక్తుడు, ఇచ్ఛామరణుడైన భీష్ముడున్నాడు. సాత్విక భక్తుడు విదురుడున్నాడు. ఇంకనూ ఎంతోమంది ఉన్నారు. అయినను గీతను బోధించుటకు అర్జునుడే తగినవాడైనాడు. కారణం? ఎంత స్నేహమున్నప్పటికిని మోహితుడు కాడు. సాహసవ్యక్తే గాక సాధకుడు కూడా. ఆంతర్యమున కలిగిన మహా వైరాగ్యమే కారణము. అప్పటికతడు పరిపక్వుడై పూర్ణుడయ్యెను. అర్జునుని పాత్రను అఖండ విశ్వమానవతకు ప్రతినిధి గావించుకొని బోధించెను. పురుషశ్రేష్ఠుడైన పార్థునికి పురుషోత్తముడైన కృష్ణుడు బోధించినదే గీత.

"గీత"లో మనము గుర్తించవలసినది భక్తి, కర్మ, జ్ఞానముల సమ్మేళనము. ఉదయ సూర్యుని చూచుటకు పూర్వాభిముఖముగానే నిలువవలయును. అట్లే "అనన్యాశ్చింతయంతోమామ్" (9–22) అను వాక్యము ఏల పల్కెను. "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ"(18–66) అనియు, "తపస్విభ్యో అధికోయోగీ" (6–46) అనుట పరస్పరము contradictory arguments గా కనిపించినను వాస్తవమదికాదు. సత్యాన్ని వివిధ రీతులుగా విప్రులు వర్ణించినారు. ఆ "సత్" వేర్వేరు రూపములందు లేదు. శాంతి, మోక్షము, సుఖము, ఆనందము కావలసినపుడు దానికి శాశ్వతమైన మార్గము కావలెను. అశాశ్వత మార్గము నుండి శాశ్వత సుఖము లభించదు. గీత అంతయు ఉపన్యాసములతో ముగియు ననెడి భావము పెట్టుకొనకుడు. దాని లక్ష్యమైన బ్రహ్మ విద్య విషయమై కొంత తెలియచేయ గల్గితినేని ధన్యుడను. పూర్వము రాజాధిరాజులు కూడా తపస్వుల నోటి నుండి తత్త్వ విషయమై స్వానుభవ వాక్యములేవైన చెప్పుదురేమో అని ఆర్తులై ఆశ్రమములయందు భక్తిశ్రద్ధలతో ఏండ్ల తరబడి కాచుకొని యుండెడివారట. వారి భక్తిశ్రద్ధల కొలది అట్టిది లభ్యమై ఉద్ధారమగు చుండిరి. నేడు ప్రజల పైశాచిక ప్రవర్తన ఎచ్చటికి వచ్చినది? ఒక తపస్వి, ఒక సాధకుడు లేదా ఒక సన్యాసి తన అనుభవము నుండి తత్త్వ విషయమై మాట్లాడి హెచ్చరించుటయోగాక బ్రహ్మ విద్యోపదేశ మొనర్పను పల్లెపల్లెకు ఇంటింటికి వచ్చినను ప్రజలు జడత్వము మానక మబ్బునే కౌగిలించుకొనుచున్నారు. ఇక చేయునదేమి? అతడు తన చిత్ శక్తిని ఉజ్జ్వలమొనర్చి రుద్రుని గూర్చి మూడవకన్ను తెరువవలసినదిగా (జ్ఞాననేత్రమును) ప్రార్థించవలసి యున్నది.

తత్త్వము ఎవ్వరికి కావలెను. బ్రహ్మవిద్య బ్రాహ్మణులకే కదా అనెడి గ్రుడ్డి నమ్మకము ఉన్నది. మరికొందరు అధీరతతో ఉదారముగా బ్రాహ్మణ క్షత్రియులకే వేదాధికారము కలదనిరి. అవన్నియు అజ్ఞానుల సామాన్యుల మాటలు. అవి అట్లుండనిండు.

దేవుడనిపించుకున్న కృష్ణుడేమన్నాడు. స్త్రీలకు, వైశ్యులకు, శూద్రులకు, సమస్తజాతులకు అర్హత కలదని ఇట్టి కాలము వచ్చునని తెలిసే మున్ముందుగా స్పష్టపరచినాడు. వేదములు స్వంతమని వదరెడు వారు ఆ గ్రంథములుంచుకొని అట్లే వదరుచుందురుగాక. మనకు కావలసినది పుస్తకము కాదు. అందలి తత్త్వము, దానికి సాధనమైన యోగవిద్య. దాని ననుసరించియే పోవుదము. అందులకు సిద్ధము కండు. స్త్రీలకు తత్త్వము కావలెనా యనునది అమాయకుల ప్రశ్న కావలెను. అంతేకాదు అది వారికి సులభము కూడా. ఎందుకో తెలియునా ? వారి యందు మాతృత్వపు వాత్సల్యము ముగ్ధత ఎక్కువ. వ్యవహార లంపటము తక్కువ. కావున తత్త్వ సాధనయందు వారికి శ్రద్ధ, ఏకాగ్రతలు సులభముగా లభ్యమగును. అంతేకాదు తుదకు లంపటములకు లోనైన తమ భర్తలను సైతం సిద్ధపరచవలసిన బాధ్యత స్త్రీలదే. శుద్ధ సంతానమిచ్చి కాలగతిలో భవిష్యము నుజ్జ్వల మొనర్చి ముని సంతతి సామ్రాజ్యము నందలి సత్ ప్రజనులుగా జీవించగల జీవన జ్యోతులను లోకమునకు కానుకగా ఇచ్చి జగత్పూజ చేసి కృతార్థులు కావలసినవారు స్త్రీలే సుమా. వారి దేహము మనస్సు అన్నియు శుద్ధము కావలెను. అందులకు ఆ యోగ విద్యయే శరణ్యము.

గీతయందలి తపోమార్గము సర్వుల కొరకే. తత్త్వ సాధన విషయమై ఏమి చెప్పను? తపస్విభ్యో-ధికోయోగీ" దీని అర్థమేమి? తపస్సు యొక్క లక్ష్యము యోగము. అందువలన తపస్వికంటె యోగి అయినవాడు శ్రేష్ఠుడు. యోగములు అనేకములున్నవి. భక్తి యోగము, కర్మయోగము, జ్ఞానయోగములని. వీటి అర్థము తెలిసినవారికి యోగము వేర్వేరు లేదు. ఒకటే అని అర్థమగును. అందరును విషాదమున ఉన్నారు. భక్తి



అందుండియే జనించును. ప్రయత్నపడి ఫలము లభింపచేసుకొనుట యోగమగునా ? అట్లు పిలుచుటయే యోగమైన ప్రపంచ వ్యవహారములను "కర్తవ్య" యోగ మనవచ్చును గదా. నిజమైన అర్థము అది కాదు. తత్త్వార్థములందు మన అధో భాగమున సంచరించుచున్న చేతనాంశమును ఊర్ధ్వముగా ప్రయాణమొందించి మూల స్థానము విలీనమైనపుడు కలిగెడు ఆనందానుభవమే యోగము. దేవుడు, ఆత్మ ఇత్యాది Technical Terms ముఖ్యము కాదు. గీతా సందేశము ప్రజలందరికై ఉన్నప్పుడు మానవులందరికిని అర్థము కాగల వాక్యములందే దానిని ప్రచార మొనర్చిన మనము కూడా దానిని కొంత సేవించిన వారమగుదుము.

మనో చాంచల్యమును నిగ్రహించుటకు తాత్కాలిక స్థూలపూజ నామజపము వలన సాధ్యము కాదు. అలాగే కర్మేంద్రియముల వలన జ్ఞానేంద్రియముల వలన మనస్సునకు అపజయము కలుగును. జ్ఞానేంద్రియముల వలన లభించెడి ఆనందము శాశ్వతము కాదు. మనస్సునకు జ్ఞానేంద్రియముల ద్వారా శాశ్వతపదవి పొందుటకు సాధ్యము కాదు. అందులకు భక్తి కర్మ జ్ఞానముల సమ్మేళనము కావలెను. అది ఎట్లు ? ఇది సంస్కారపరులకు తెలియుభాష. సంస్కృతులు (సంస్కరింప బడిన వారు) భక్తిపరులు కూడా అనుకొనుడు.

"స్వస్వరూప కర్మ కృతౌ సంస్కృతౌ"

ధర్మపరమున నిరంతరము చేయ కల్గినదే కర్మ. ఆనందము పొందెడి లేక గ్రహించెడి చైతన్యమే జ్ఞానము. జ్ఞానము పొంది యోగమని తెలిసి, ఆనందైక జీవియై నిలిచిన యోగి శ్రేష్ఠుడు. ఇవన్నియూ రీశిబీవీలిరీ మాత్రమే. వేర్వేరు విషయమలు కావు. అన్ని స్థితులకు మూలమైన ఆ స్వరూప కర్మను ఆచరించుట ఎట్లు అన్నపుడు "ఉత్తిష్ఠత, జాగ్రత, ప్రాప్తవరాన్ని

బోధత" లెండు, జాగృతులు కందు, విద్య తెలిసిన వారితో ఉపదేశము నొందుడు. అట్లుగాక ఊహాపోహలతో ముక్కు మూసికొని లేదా సర్వద్వారముల బంధించి చేయు కువిద్యలవల్ల ప్రజావళి అధోగతికి వచ్చినది. జగద్వ్యవ హారములకు కావలసిన స్థూల విద్యలకే గురువు కావలసియుండ దివ్యత్వమును ప్రాప్తింపజేయగల జీవవిద్య, అమృతవిద్య, బ్రహ్మవిద్యకు గురువులేక సాధ్యమగునా ?

ఎక్కడనో ఉన్న దేవుని మెప్పించుటకు ఇంత శ్రమ ఏల అనవచ్చును. "అన్నియు నాలో ఉన్నవి. నేను వాటిలో లేను" ఇది కృష్ణుడు దేవుడై నిల్చి చెప్పిన మాట. అన్నిటియందును దేవుడు ఉన్నచో ఆయా వస్తువుల అల్పత్వమెందేగును? పీనుగులను కాల్చరా? ఆ పరమాత్ముని చైతన్యము యొక్క కించిదంశమైన ప్రాణమున్నచో దేహమును కాల్చలేరు. పూడ్చలేరు. అది చెడిపోవును అన్నపుడు పరమాత్ముడు అందులో ఉన్నపుడు ఆ దేహము కుళ్లునా ? విమర్శించుడు. తొందరపడి నన్ను నాస్తికుడనబోకుడు.

దేవుని అన్ని చోట్ల చూడవచ్చునె తప్ప అన్నింటియందు లేడు. అట్లే తమతమ సంకల్పముల ననుసరించి ఆయా ఆకారములందు "అతనిని' మానసికముగా కాంచి ఆనందమొందితిమి అనవచ్చును. కానీ అతడు ఆకారములకే అంటిపెట్టుకొని యుండడు. దేవుని దేవునిగానే చూడవలెను. ఇది తపోనిధులకు మాత్రమే సాధ్యము. అతని చైతన్యాంశము అన్ని చోట్ల నిండియున్నది. దానినే ఈశుడు, ఈశ్వరుడు ఇత్యాది నామములతో పిలుతుము. అదియు "స్వయం స్థానేన వ్యక్తః సర్వ స్థానేన వ్యక్తా వ్యక్తః" అందురు. ఈ మనదేహమనెడి రథమును తన కర్తవ్యమునకై నిర్మించుకొన్న ఆత్మసారథ్యముగా కావలసిన ప్రాణము సృష్టించుకొనెను. ఆ ప్రాణుని ముఖాంతరముననె ఆత్మదర్శనము సాధ్యము. ఆ ప్రాణము మన దేహమునందు కలదు. బయట లేదు. అందుకే శ్రీకృష్ణుడు



"సర్వద్వారాణి సంయమ్య" అన్నది. అపస్వరమున పోయెడి ప్రాణుని, సుస్వరమున ఉంచుటకు కొంత కష్టపడిన సాధకుడే కావలెను. అతడే "గురువు". అతని వలన మాత్రమే యోగవిద్య లభ్యమగును. మాటల వలననూ, పుస్తకముల వలననూ సాధ్యమగునది "రోగవిద్య". అందుకే "నగురోరధికం" అన్నది. "అన్యధా శరణం నాస్తి త్వమేవ శరణం మమ" దీని రహస్యమేమి? మాకు శ్రీకృష్ణుడే కావలయును. అతడే ఆదర్శము. అతడే శరణ్యుడు. మనకు ఆయన బోధన ఆదర్శము కావలెనా? లేక కేవలము ఆయన రూపము, నామ జపము చాలునా ? ఇందు "శరణం మమ" అను దానికి అర్థమేమి ? తెలియునా ? నన్ను అనగా సర్వకర్మ పరిపూర్ణుడనై నిల్చిన నన్ను చింతించిన, యోచించిన కాదు. సర్వకర్మలు, తపస్సు, అన్నింటిని నావలె ఆచరించి, నన్ను శరణుజొచ్చినచో, అని అర్థము. ఈ మార్గమున కొనసాగువాడు ఎట్లుండవలెను ?

"నాత్యశ్న తస్తు యోగోస్తి" (6-16) అనగా దేనియందును అతిగాపోక క్రమము తప్పక నియమబద్ధమైన జీవనము ఉండవలెను. ఆహార విహారములయందును అంతే.

"యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మసు ।
యుక్త స్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా॥"

(భగవద్గీత - అధ్యా. 6-శ్లో. 17)

అట్టి సాధకునకు భయనివారణమైన యోగప్రాప్తి కలుగును. ఆ విధముగా అన్యమార్గములకు, కల్పనలకు లోబడక ఆశ్రయించిన, తాను చెప్పినట్లు నడుచుకొని సాధించు ఆత్మచింతనాపరులకు ఆనందానుభూతి సాధ్యమగును.

అందరికిని భగవద్గీత అందుబాటులోనే ఉన్నది. సులభగ్రాహ్యమగునది ఎట్టివారికి ? "విద్యా వినయ సంపన్నే" అట్టి వారికి. ఇక్కడ విద్య యనగా బ్రహ్మ విద్య అని, బ్రాహ్మణుడు అనగా బ్రహ్మత్వము తెలిసినవాడు. అనగా స్వానుభవమున తత్త్వజ్ఞుడు. వర్ణధర్మములను వర్ణించినది జాతుల దృష్టితో కాదు. ప్రతిమానవుని యందు నాలుగు వర్ణములున్నవి. స్త్రీత్వ, పురుషత్వము లున్నవి. అధోంద్రియ కర్మ, శూద్రత్వము. చంచలత, అధీరత్వము స్త్రీ లక్షణము. విమర్శాబుద్ధి, వైశ్యత్వము. ధీరత క్షాత్రత్వము. జ్ఞానము బ్రహ్మత్వము. ఈ జ్ఞానము మన అందరి ప్రయత్నమునకు లభ్యమై ఫలమగునది. మిగిలినవన్నీ అభ్యసించవలసినవి. భగవంతుడు సృష్టియందు కావలసిన సర్వ సౌలభ్యములను ఉంచి, క్రీడించి, సేవించి, అనుభవించుటకు సత్యమును గ్రహించుటకై మనలను పంపియుండగా ఆ యోగ్యతను సదుపయోగ మొనర్చుకొనక మరల, మరల అతనిని గూర్చి ప్రార్థించిన చెవి యొగ్గునా? అతనిని క్షుద్రమైన జిహ్వోచ్చారణ తాకునా ? ఆ తాకెడి చైతన్యము (ప్రాణుని) ద్వారా వెళ్లిననే తప్ప అతని కృప సాధ్యపడదు. ఆ యోగ్యత ఆనందానుభవము ఉన్న వారికి ప్రయత్నము నుండే సాధ్యమగును. ఆనందానుభవానంతరము ఆనందారాధ్యుడైన పరమాత్ముని సాధన ద్వారా సేవించవలసి యున్నది. అందువలన అందరు ఆ విధముగా నడచు కొనుటకు శ్రీ గురువుగారు ఆశీర్వదించుచున్నారు.

* * *

10. యోగి–యోగము :బ్రహ్మశ్రీ స్వామి జయతీర్థులవారు కొన్ని విషయములను వివరించుచూ ఈ విధముగా అన్నారు.

ప్రశ్న : యోగి లక్షణములు ఏవి ? అతని ముఖ్య గుణాలు ఏవి? అతడు సమాజములో ఏ విధముగా వర్తించును ? యోగి అను శబ్దమునకు నిజమైన అర్థమేమి?



ఉత్తరము : యోగమనగా "సంయోగ ఇతి ఉక్తో జీవాత్మ పరమాత్మనో ఇతి" అను యాజ్ఞవల్క్యుని మాటగా తనను దేవునికి అర్పించుకొన్నతడు అనే విధముగా అర్థము చెప్పవచ్చును. అనగా స్వార్థము, అహంకారము, మమకారములు వదలి మోహ ద్వేషాది ద్వంద్వములకు అంటక, తాను చేయు క్రియ దైవసేవగా, దైవము ప్రీతి కొరకు, ప్రతిఫలము పొందుటకు కాదు, అనే నిర్ణయముచే పరోపకారానికి జీవించు నిస్వార్థ భక్తుడు యోగి అని అర్థమగుచున్నది.

"తపస్విభ్యోऽధికో యోగీ, జ్ఞానిభ్యోऽపి మ తోऽధికః ।
కర్మిభ్యశ్చాధికో యోగీ, తస్మాద్యోగీ భవార్జున ॥
(భగవద్గీత – అధ్యా.6 – శ్లో.46)

గీతా బోధకుడు తపస్వుల కంటె యోగియే శ్రేష్ఠుడని సూచించినాడు. ఎందుకనగా కామ్యార్థముగా, జ్ఞానార్థముగా ఇంకను తపించుచున్నవాడు తపస్వి. తపించి జ్ఞానము పొందినవాడు జ్ఞాని. అలాంటివాడు మోక్షార్హుడే. కేవలము తన ముక్తి ఒక్కదానికే తృప్తి చెందక తనకు ఈ జగత్తులో జన్మనిచ్చిన దైవసృష్టియైన ఈ జగత్తు నందున్న వారి ఉద్ధారమునకు, తనకు దేవుని కృపవలన లభ్యమైన జ్ఞానమును కృతి రూపమునకు తెచ్చి, ఆ మూలకముగా తాను జన్మించి పెరిగి జీవించి జ్ఞానము పొందుటకు ఆశ్రయమిచ్చిన, ఈ జగత్తు సహకరించు అన్ని జీవుల సేవ చేయవలెనను కృతజ్ఞతతో, లోకసేవ చేయు భక్తుడే యోగి. జ్ఞానము పొందకనే చేయు క్రియ తన బంధనానికి, చెడ్డతనానికి, అదే విధముగా పరుల చెడ్డతనానికి కారణమగుచున్నది. జ్ఞాని యొక్క క్రియ తనకు బంధకారణము కాకుండా

పరుల ఉపకారానికి కారణమగుచున్నది. అందువలన అటువంటి యోగి కావలెను. అనగా జ్ఞానపూర్ణుడైన భక్తుడు కావలెనని గీతావాణి బోధించి యున్నది. గీతయందు తపస్వి, జ్ఞాని, కర్మలకంటె యోగియే శ్రేష్ఠుడని చెప్పబడినది. కాని భక్తుని కంటె యోగి శ్రేష్ఠుడని చెప్పబడలేదన్నారు శ్రీ స్వామిగారు. దీనిని గమనించినపుడు యోగి అనగా భక్తుడనే భగవంతుని నిర్ణయమన్నారు.

అయితే భక్తి అనగా తెలుసుకోవలసియున్నది. గీతలో ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞాని అని భక్తులు నాలుగు విధములని చెప్పబడినది. ఆర్తుడు అనగా దీనుడై కామ్యాదుల కోసం దేవుని కోరువాడు. ఏది ధర్మము, ఏది అధర్మము, ఇత్యాదులను తెలిసికొనుటకు ప్రయత్నించుచు సంశయ నివారణ కోసం దైవాన్ని కోరువాడు జిజ్ఞాసువు. ఇతను ఆర్తుని కంటె ఉత్తముడు. జిజ్ఞాసి కంటె అర్థార్థి అనగా తనకు ధర్మమని బోధపడిన దానికి క్రియారూపముగా తెచ్చుటకు దేవుని శక్తికోసమై కోరువాడు, ఉత్తముడు. ఇతని కంటె దేవుని తెలిసినవాడు, జ్ఞాని దేని అవసరము లేదని చెప్పువాడు ఉత్తముడని చెప్పి అటువంటి జ్ఞానులయందు భగవంతుని కృపవలన లభ్యమైన జ్ఞాన ప్రకాశములో శ్రమించి లోకహితానికి పనిచేయువాడు శ్రేష్ఠుడని గీతలో భగవంతుడన్నాడని శ్రీ స్వాములవారు తెలియజేసినారు.

తరువాత యోగి యొక్క లక్షణము ఏమిటి? అనునది ప్రశ్న. భగవద్గీతలోని మహావాక్యములను తెలుసుకుంటే ఈ ప్రశ్నకు ఉత్తరము లభించునని శ్రీ జయతీర్థ స్వాములవారు అన్నారు.

## 11. మహా వాక్యములు

1. "సమత్వం యోగ ఉచ్యతే" 2. "యోగః కర్మసు కౌశలం" 3. "బుద్ధియోగో విశిష్యతే"



1. సమత్వము యోగ లక్షణము. దీనినే స్థితప్రజ్ఞత అనుచున్నారు. మోహద్వేషము, లాభాలాభము, జయాపజయము, కీర్తి–అపకీర్తి, స్తుతి–నింద, పాపము–పుణ్యము, జననము– మరణము, ఇత్యాది ద్వంద్వముల భావనల నుండి అతీతమైన లిప్త, అలిప్తా స్థితి. అనగా కర్తవ్యము చేసియు బంధనమునకు లోనుగాని స్థితి. అటువంటి వాని వర్తనము, మాట, ఏ విధముగా ఉండుననగా, మాటే జ్యోతిర్లింగమువలె, అనగా చీకటిని పోగొట్టు వెలుతురువలె, అతని మాట అజ్ఞానమును, నివారించుట యందు సహకరించును. అతని కృతిపరులకు ఆదర్శమై, నిస్వార్థముతో కూడి యుండును. అతని వ్యవహారము సర్వులకు హితముగాను, నిష్పక్షపాతముగాను ఉండును. ఇదియే భగవద్గీత రెండవ అధ్యాయములో వివరించ బడినది.

సాత్వికాహారమే శ్రేష్ఠమని అందరికి తెలియును. అయితే సాత్వికాహారము ఏది ?స్నేహము (చమురు)తో కూడి మనసేంద్రియాలకు చపలత కలుగనీయక, దేహమునకు శక్తినిచ్చునది సాత్వికాహారము. బ్రహ్మ విద్య యందు వర్తించునపుడు యుక్తాహార విహారములు, ప్రమాణ పరిమితులు ఏమిటన్నది అనుభవములో తనకు తెలియును. అట్లే వర్తించి కాయము పరిపూర్ణతతో శుద్ధమై నిలచినపుడు

"నైనం ఛిందంతి శస్త్రాణి, నైనం దహతి పావకః" అనునట్లు "ఆ – ఊ ఆ, ఊ ఇతి కామరూప సంచరన్" అనునట్టి స్థితి కలదు. దానినే "అసతో మా సద్గమయ

తమసో మా జ్యోతిర్గమయ

మృత్యోర్మా అమృతం గమయ"

అనగా అసత్తు నుండి సత్యానికి, తమస్సు నుండి ప్రకాశమునకు, మృత్యువునుండి అమృతత్వానికి, ఇత్యాదిగా వర్ణించినారు. ఇవన్నియు కాయము భద్రముగా ఉన్ననే కదా అని కొందరు దేహమును దేవాలయ మని చెప్పిరి. దేహము లోపల ఉన్న పవిత్రాత్మ దేవాలయమన్నమాట. మొత్తం మీద మనిషిత్వమును తెలియుటకు ఈ దేహము మొదట మెట్టు.

సత్యమను లక్ష్యమును సాధించుటకు సాధకులకు క్షాత్రత్వము (ధీరత, స్థిరత, సాహసము) అవసరము. అట్లే క్షాత్రత్వము నందు నిలిచి సాగినచో శ్రేష్ఠమైన బ్రహ్మత్వము (జ్ఞానము) ప్రాప్తించును. పరిపూర్ణుడైనవాడు స్థూలము నందు అన్ని కర్మలు నేర్పుతూ, కుశలతతో ఆదర్శముగా చేసి చూపించగలడు. తాను అన్నింటిని చేసినను దేనికీ అంటక అతీతుడై ఉండును. వాని దృష్టియందు ఏదియు నీచము కాదు. అన్నియు వాటి స్థానములందు ముఖ్యమే. అదే కర్మరహస్యము. దీనినే అవతార పురుషులలో చూడవచ్చు. అదే యోగము యొక్క స్థితి. అనగా "సమత్వము".

"యోగః కర్మసు కౌశలం" శ్రీ కృష్ణపరమాత్మ సమత్వములో ఉన్న యోగి. నిష్పక్షపాతి. అందువలననే యుద్ధము వలదని ప్రయత్నించెను. కాని అదే అనివార్యమయ్యెను. తనను అగౌరవించినను లక్షించలేదు. తనను ద్వేషించినను జ్ఞానోదయ మగుటకు విశ్వరూపమును చూపించినాడు, దుర్యోధనాదులకు సహా. అయినా కీర్తికాముడు కాలేదు. బోధోపాయముతో రక్తపాతము తప్పించవలెనని కర్ణునకు అతడి జన్మరహస్యాన్ని తెలియజేసి యుద్ధము నివారించుటకు యత్నించినాడు. తుదకు ధర్మపక్ష రక్షణకోసము దండోపాయాన్ని ఆశ్రయించినాడు. శ్రీకృష్ణ భగవానుడు యుక్తకార్య నిర్వహణయందు మేలు కీడు అనే భావనము లేకుండా రథసారధి అయినాడు. భిక్షము, అబద్ధము, మోసము, కీడు అనకుండా అధర్మపక్షాన్ని



ఓడించి, ధర్మానికి జయము కలుగుటకు ఏమి అవసరమో అది అంతయు చేసినాడు. అచ్చట స్వార్థము లేదు. లోకహితమును ధ్యేయముగా చేసికొని తనకు పాపపుణ్యముల మోహము లేక, తాను క్రియ చేసియు నిర్లిప్తుడని కృతిలో నిరూపించినాడు. ఇది "యోగః కర్మసు కౌశలమ్" అనగా యోగి కుశలతతో క్రియ చేయు క్రమాన్ని భగవాన్ తెలిపినాడు. సమయా సమయములు, యుక్తాయుక్తతలు, పాత్రాపాత్రతల ననుసరించి ప్రవర్తించువాడు యోగి, అచ్చట లోకహితమే లక్ష్యము. ధర్మబద్ధుడైనవాడు రాజయినచో ప్రజాహిత మగును. అధర్మి రాజయినచో ప్రజాకంటకు డగును. అటువంటి అధమ పక్షమును అణచుటకు సామ, దాన, భేద, దండోపాయములు సరియైనవి. మరియు అబద్ధము, మోసము అన్నియు యుక్తమయినవే. ఈ విధముగా క్రియచేయు లిప్తాలిప్తుడే యోగి. ఆ విధముగానే క్రియ చేయించువాడు యోగీశ్వరుడు. అందువలననే శ్రీకృష్ణుని జ్ఞానులు యోగీశ్వరుడన్నారని స్వామి జయతీర్థులవారు వివరించినారు.

యోగియందు శ్రేష్ఠమయిన బుద్ధిని చూడవచ్చునన్నదే గీత యొక్క భావము. జ్ఞాన ప్రాప్తి కాకుండా కేవలము విచారశక్తివలన ధర్మాధర్మ, యుక్తాయుక్తములను నిర్ణయించుట సాధ్యముకాదు. పూర్ణ జ్ఞానము కాకుండా అనగా ఆత్యంతిక సత్యమైన దైవాన్ని దర్శించి తెలిసికోలేనిదే కేవలము విచారము వలన తెలుసుననే అహం కారముతో కార్యప్రవృత్తులైన వారు ధర్మాధర్మ యుక్తాయుక్తములు ఏవి అని నిర్ణయించుటకు సాధ్యముకాదు. ఆ నిర్ణయాత్మకశక్తి బుద్ధిప్రకరమైనపుడు, అనగా భగవంతుని కృపవలన లభ్యమైన జ్ఞానికి మాత్రము సాధ్యము. ఆ జ్ఞాన ప్రకాశములో క్రియ చేయువాడే యోగి. బుద్ధిప్రకరత ఉండుట వలన అతని నుండి అధర్మ అయుక్త క్రియలు నడువకుండా కేవలము ధర్మకర్మ అదే విధముగా యుక్తక్రియలు నడుచును. దీని పరిణామమే లోకకల్యాణము.

ఇంకనూ యోగియందున్న గుణములను వివరించుచూ స్వామి జయతీర్థులవారు భగవద్గీతలో "త్రైగుణ్య విషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున" (2-45) అని తెలియజేయుచున్నది అన్నారు. లోక కల్యాణమునకు, కావలసిన కర్తవ్యమునకు అవసరమైన క్రియ సౌమ్యములే కానీయండి, హింసాత్మకమే కానీయండి, సంహారకములే కానీయండి (సాత్త్విక - రాజసిక - తామసిక) తనకు ఇది కావలెను, ఇది అవసరము లేదు, అను మోహమునకు లోను కాకుండా యుక్తాయుక్తమైన దానిని చేయు నిర్లిప్తక్రియయే యోగము. అదే యోగీయ గుణము. అది తనయొక్క సహజత. ఇది కావలయునన్న కేవలము చదువుట వలన మాటల వలన సాధ్యముకాదు. సమాధి అను స్థితిలో ఉదయించు జ్ఞానమే కారణమని గీత బోధించియున్న దన్నారు. ఆ సమాధి స్థితి ప్రాప్తికి యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణమనే సప్త సోపానములు ఎక్కినప్పుడే సాధ్యమన్నారు. అందువలననే ఆ సాధనా క్రమాన్ని అష్టాంగ యోగము అన్నారు. దానిని సిద్ధించుకొనుటకు ధర్మ కర్మ బద్ధుడుగా సాగి దైవభక్తి వలన జ్ఞానాకాంక్షులుగా తపించుచూ సాధనా మార్గములో సాగితేనే సాధ్యమని గీతావాణి బోధించినదని శ్రీ స్వామివారు అన్నారు.

సర్వభూతములను తనవలె చూడవలెనను విషయము ఆచార్యుని నుండి నేర్చుకొన్న వ్యక్తికి అతిథి, అభ్యాగతుడు మరియు సర్వప్రాణులు పరమాత్మ స్వరూపులు, తాను భక్తుడనే భావన సహజమే. ఆ విధముగానే వారివలె తాను దైవసృష్టియే అన్నపుడు "అహం బ్రహ్మాస్మి" "అయ మాత్మా బ్రహ్మ" అనునది సరియైనదా ? అయినా తనను ఆవరించు అజ్ఞానము గర్హ్యమైనది. తనలో ప్రభవించు జ్ఞానము మరియు ఆనందము దైవత్వ లక్షణము. ఆత్మకు సహజ స్థితియైనది సత్యము. ఈ జ్ఞానప్రాప్తికి



ఏకైక సాధనమైన విద్యను అనుగ్రహించిన "గురువు" పరమపూజ్యులు. దేవుని తరువాత రెండవ స్థానము గురువుకు చెందుతుంది.

"ప్రాప్తేషు షోడశ వర్షే పుత్రం మిత్రవత్ సమాదరేత్" అనురీతి అనగా 16 సంవత్సరముల వయస్సు కలిగిన కుమారునకు తండ్రి ఆజ్ఞ చేయకుండా మిత్రునివలె వ్యవహరించుట మేలు. అట్లు కాకుండా ఆజ్ఞ చేయు తండ్రి అజ్ఞాని, అహంకారి. అటువంటి తండ్రియొక్క కుమారులు దురహంకారులు, మహామూర్ఖులగుట సహజము. అలాంటి ఎవరి ఆజ్ఞ నడుస్తుంది ?

గురువు కేవలము మార్గదర్శకుడు. ఆజ్ఞ చేసేదే లేదు. శిష్యుని సంశయములు నివారిస్తాడు. అనంతరం "యథేచ్ఛసి తథాకురు" అనగా నీ ఇచ్ఛ వచ్చినట్లు నీవు చేయవచ్చును అని అంటాడు శ్రీకృష్ణుడు. అర్జునుడు శ్రీకృష్ణుని "శిష్యస్తే-హం పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతః" ఇత్యాదిగా నేను నాకర్తవ్యమేమి అనేది నిర్ణయించు కోలేక, సంశయము అనే సుడిగాలియందు చిక్కి మూఢునిగా ఉన్నాను. నన్ను శిష్యునిగా స్వీకరించి మార్గదర్శనము చేయవలెనని ప్రార్థించినాడు. శ్రీకృష్ణుడు అతని సంశయములను నివారించి ఆఖరికి "యథేచ్ఛసి తథా కురు" అని చెప్పుటవలన గమనించవలసినది ఏమనగా గురువు అజ్ఞానులవలె ఆజ్ఞ చేయడని అర్థమగును గదా అని శ్రీస్వామి జయతీర్థులవారు అన్నారు.

అజ్ఞానులు మాత్రము ఆజ్ఞ చేయుదురు. కావున ఆజ్ఞా పాలనము అనవసరమనవచ్చును. తండ్రి, తల్లి, రాజు వీరు దైవ ప్రతినిధులు. అనగా ప్రాణదాత తండ్రి. దేహదాత తల్లి. మరి తక్కినవారు ఆశ్రయదాతలు. అందువలన వారి ఆజ్ఞ శిరసావహించ వలసినదే. తనలో మెలకువ చేయు దైవాజ్ఞ ఆత్మ ప్రేరణ అన్నింటికంటే శ్రేయస్కరము. దీనిని తెలిసిన జ్ఞానులు

"ఆత్మబుద్ధి సుఖంచైవ । గురు బుద్ధి విశేషతః ।
పరబుద్ధి వినాశాయ । స్త్రీ బుద్ధి ప్రళయాంతకః ॥"

ఆత్మ ప్రేరణ సర్వశ్రేష్ఠము. నిజమే. అయితే తనలో కలుగు ఇచ్ఛలనే ఆత్మ ప్రేరణ అనుకొంటే ఆ ప్రమాదము నుండి బయట పడుటకు గురువు యొక్క మార్గదర్శనము అవసరము. అది విశేషమని తనవలె అజ్ఞానములో ఉన్నవారు అనేక ఆలోచనలతో నిర్దిష్టత లేకనే దిక్కు తోచని విధముగా చేయును. తన స్వార్థమునకై, మోహములో దొర్లుట యందు స్త్రీల మాటలవలె ప్రవర్తించినచో సర్వనాశనమని చెప్పబడిన దన్నారు. అయితే జ్ఞానుల మాటల యొక్క మర్మమును తెలిసికొని ప్రవర్తించిన క్షేమమని శ్రీ గురు జయతీర్థుల వారు బోధించినారు. అవతారముల విషయమై ప్రభు అచ్యుతుల నిర్ణయాన్ని శ్రీ స్వామి జయతీర్థులవారు తెలియజేసినారు. ఆయా కాలములయందు జగత్తులో జరుగవలసిన వ్యవస్థకు తగినట్లు భగవదవతారములు జరుగును. పూర్ణావతారమనునది అజ్ఞానము. అఖండమైన చేతనములో ఒక అణువుకాని ఈ భూగ్రహము ఆ చేతనము యొక్క పూర్ణావతారమును భరించుట ఎట్లు ? అన్నారట అచ్యుతులవారు.

తపస్సులో సమాధిస్థితుడై బ్రహ్మాండకవాటమును ఛేదించుకొని సాగిపోయిన చేతనము ఆ పరశ్రేష్ఠుని నిజదర్శనము పొందుట సాధ్యము కాని ఈ స్థూలదృష్టితో ఈ గ్రహముపై ఆ అఖండ చైతన్యమును పూర్ణత్వముతో దర్శించుట సాధ్యముకాదని శ్రీ ప్రభు అచ్యుతుల నిర్ణయమని శ్రీస్వామివారు తెలియజేసిరి.

సమాధి స్థితిలోనే సృష్టి యొక్క సర్వవిజ్ఞానము, ఆనందము అనగా నిరింద్రియ ఆనందము, స్వరూప జ్ఞానము, know thy-self, knothi భగవద్దర్శనము అన్నియు లభించును. ఈ స్థితిని అనుభవించువాడే యోగి. దీనికి యోగ విద్యాభ్యాసమే మూల సాధనము అన్నారు శ్రీస్వామివారు.



అయితే సాధకుడు మధ్యలో సంభవించు "సిద్ధులకు" లోబడి అద్భుత ప్రదర్శనలను లెక్కపెట్ట కూడదు.

ఇచ్చట యోగ విద్యాభ్యాస క్రమమే తెలియని అనేకులు సమాధి స్థితి యందు లభించు ఆనందము అనుభవించిరి. దర్శనాదులు పొందిరి. ఇది ఎట్లు సాధ్యము అనునది ప్రశ్న. కొన్ని సమయములలో సాత్వికుడైన భక్తుడు దైవచింతనలో ఉన్నపుడు అతనికి తెలియకనే దేహమునందు మనో ప్రాణ మిలనము జరిగి సమాధిస్థితి కలుగును. అది అతని పుణ్య విశేషము. విద్యాక్రమము తెలియని కారణముచే ఆ స్థితిలో బహిర్ముఖ స్థితికి రావడము కాని మరల ప్రయత్నించి కావలసినపుడు ఆ స్థితికి పోవడము గాని సాధ్యముకాదు. దీనినే కొందరు "Bhaktas Tumble down on Yoga" అని చెప్పినారు.

జ్ఞానులు పూర్ణత్వము నెరిగిన యోగులు అద్భుతములను ఎప్పుడు చేయరు. కొన్ని దేశాలలో భగవదేచ్ఛకు అనుగుణముగా లోక కల్యాణము నకై, మహత్కార్యములను చేయవలసినదే. అప్పుడు వారి మహత్వ ప్రభావమును జనులు చూచుట సాధ్యము అన్నారట ప్రభువుల వారు. అవి అద్భుతములు కాదు యోగ విద్యాభ్యాసికి తనంతట తానే లభించు అణిమాది అష్టసిద్ధులను తగినంత ఉపయోగించి అద్భుతములను ప్రదర్శించి, జనులను భయము, ఆశ్చర్యము, ఆశ, అజ్ఞానము, అసూయలకు బలియగునట్లు చేయుదురు. అట్టివారు తాము సాధనయందు లక్ష్యము చేరక క్రింది స్థాయి– మనస్సు యొక్క మాయకు బలియై అధః పతనము చెందెదరు.

ఈ అద్భుతముల యందు అనేక విధములు కలవు. యోగ సిద్ధులు అద్భుతములు వేరు. మనోనిష్ఠ మరియు హఠము యొక్క ఏకాగ్రత వలన

లభించు మానసిక శక్తిచే కలుగు అద్భుతములు వేరు. క్షుద్ర దేవతల ఉపాసనల వలన కలుగు అద్భుతములు వేరు. స్థూలవస్తు సంయోజనముల వలన ఆశ్చర్యకరమైన దృశ్యములను కనిపింపజేసి అద్భుతములనిపించుట కలదు. ఏమైన గాని దీనికి అలవాటు పడ్డవాడు తన మనశ్శక్తిని కుంగించుకొని కుంఠితుడగును. అందువలన పరులకు శ్రేయస్సు కాదు. తనకు ఉపయోగము లేదు.

ద్వైతము, అద్వైతము లోకమంతటా ఈ వాదము నిండియున్నదని ప్రభువు గారు తెలియజేసినారట. ఆశ్రమములో ఒక రోజు శ్రీ జయతీర్థ స్వాముల వారు అన్నారు. తత్త్వజ్ఞుల వాక్కు వేదోపనిషత్తుల వాక్యమట. అచ్చటచ్చట ఈ విషయమై స్వయం విరుద్ధముగా (self contradictory) ఉన్నవని విమర్శకులు అనేకులు అభిప్రాయపడుచున్నారు. అయితే అచ్యుత ప్రభువుగారు వీటి విషయమై ద్వైతము, అద్వైతము, రెండూ సత్యములే అన్నారట. ఈ విషయమై శ్రీ ప్రభువులు ఈ విధముగా వివరించినారట.

ఈ స్థూలద్వైతమనగా ద్వంద్వములకు చిక్కి పలవరించు మనస్సు యొక్క అజ్ఞానము తొలగి ఇంద్రియ దాస్యము తప్పి మనో ప్రాణ మిలనమై సమాధియందు విశ్రమించి "ఆత్మరతః, ఆత్మ క్రీడః" అయినపుడు బాహ్య జగత్తు యొక్క సంబంధము లేని ఆ శాశ్వతానందానుభవము 'అద్వైతస్థితి" అక్కడే ఆగిన ముగియదు. మరియు ఆ శాశ్వత సత్యమైన ఆనందదాత, ఆనందారాధ్యుడైన పరశ్రేష్ఠుని అస్తిత్వము జ్ఞానము కాగా కృపాదర్శనమైతే అది ద్వైత జ్ఞానము. జీవుని పరిపూర్ణతకు ఈ రెండు స్థితులు అవసరము. అంతేకాదు. ఒకదాని కొకటి పూరకము. అద్వైతానుభవము లేని ద్వైతవాదము వ్యర్థము. ద్వైతజ్ఞానము లేనిదే అద్వైతానుభవము అపూర్ణము. ఈ రెండు లేనిదే ద్వైత వాదము నాస్తికత్వము. ఈ విషయము అనగా అనుభవము లేని విషయముపై చర్చ మదాంధతయే. కనుక



తత్త్వజ్ఞానానికి అనుభవమే మూలమనియు, అనుభవమునకు సాధనయే శరణ్యమని చెప్పుట. సాధన విహీనమైన గ్రంథ పాండిత్యము వలన ఇదే పరిణామమన్నారట శ్రీ ప్రభువులు.

అయితే శాస్త్ర గ్రంథములు అసత్యములా ? ప్రాచీన కాలపు జ్ఞానులు వ్రాసిన శాస్త్రములు అసత్యములు కావు. కాని ఈ మధ్య కాలములో చాలా విషయములు అందులో చేర్చబడినవి. అంతేకాక ఆ మాటలు ఆంతర్యమును సరిగా అర్థము చేసికోలేక, స్వకల్పిత ఊహల యొక్క భాషలు జనులను తప్పుదారి పట్టించినవి. పురాతనుల శాస్త్రపు మాటలకు సరియైన అర్థము సాధనాభ్యాసము లేని, ఆత్మానుభవ జ్ఞానము లేని వారికి తెలియదు. శాస్త్రమనగా నేమి ? ఆయా విషయములందు దర్శించి సత్యమును అనుభవము వలన వర్ణించి మార్గమును చూపిన రీతి, నీతి, నియమములను తెలిసినటువంటి మాటలే శాస్త్రములు. ఆ అనుభవజ్ఞులు తమ మాటల వెనుకనున్న సత్యములను తెలిసికొన్నపుడు అజ్ఞానమును ఛేదించి తెలిసికొనిరి. సాధనానుభవము లేనిదే శాస్త్రమును చెప్పుట చిలుక పలుకుల వంటిది. సదా లౌకిక వ్యవహార బంధులై ఆశ, దుర్వ్యసనాదులందు పడి వృథా కాలయాపన చేయు నాస్తికులకు దేవుని అస్తిత్వము కల్పింప చేయుటకు బహిర్ముఖతతో మనో నిష్ఠ సాధ్యముకాక, అంతర్ముఖత తపోవిద్య తెలియక అనగా అది లభించని వారికి అయినంత సమయము దైవచింతనతో గడుపుటకు స్థూల పూజ అనగా విగ్రహారాధన క్రమమును ఏర్పరచినారన్నారు స్వాముల వారు. అయితే విగ్రహారాధన చేయకూడదని కాదు. కాని అది ఆత్మానందమునకు జ్ఞానప్రాప్తికి సాధ్యము కాదని శ్రీ జయతీర్థస్వామి వారు తెలియజేసినారు.

శ్రీ అచ్యుత ప్రభువుల మాటలలో భాష అనగా స్థూలాక్షరములతో

కూడిన పద సమూహము కాదు. వాటి వెనుకనున్న భావము. అప్పుడప్పుడు వారు తెలిసికొనలేని శిష్యులను "భాష లేని జనులు" అనేవారట. అట్లే సంస్కృతభాష అనగా స్థూలముగా అందరూ చెప్పు అర్థములో వారి మాట అన్వయించదు. సంస్కృతులైన, సంస్కరించబడిన వారి భాష "సంస్కృతము" అసంస్కృతము అర్థము కాదన్నారు. సంస్కృతి అనునది జ్ఞానుల మాటలలో ఈ స్థూల నాగరికత కాదు. చేతనపు ఆవరణమై పెరిగిన చేతనపు పొరను ఛేదించి కల్మషములన్నింటిని తొలగించి శుద్ధుడై, స్వస్వరూపజ్ఞానము భగవద్దర్శనము, కృపకై అటువంటి సంస్కారపు సర్వాంగీణ పరిపూర్ణత సంస్కృతి, సాధనారహిత జీవులు స్థూలమైన చదువును నేర్చిన మాత్రముననే దాని అంతరార్థము గ్రహించ లేరు. మొత్తము మీద అచ్యుత ప్రభువుల తత్త్వబోధ నుండి తెలిసి కొనవలసినది ఏమనగా తత్త్వజ్ఞానమునకు ముక్తిసాధనకు సాధనయే మూలము. యోగవిద్యయే సాధనము. సాధన లేని మాట మాటే కాదు. అది పనికి మాలిన వ్యర్థ ప్రసంగము. మాట అనునది అంతరాళము నుండి జగత్కల్యాణానికై బయల్పడి ప్రజల మనస్సులను హెచ్చరించి సన్మార్గము నందు వర్తించునట్లు ప్రేరేపించి ధర్మకర్ములకు ప్రోత్సాహకముగా ఉన్నచో దైవము మెచ్చును. అంతేకాక కర్మభ్రష్టుల ప్రసంగము తమకూ, పరులకూ అనర్థకారకము. మాట మితము కావలెను. వినయ విధేయతలు అవసరము. అవి లేనిదే విద్య సిద్ధించదు. విద్య తెలిసిన వారిని ఆశ్రయించి విద్యను పొందండి. శ్రద్ధతో సాధించండి. ఆనందానుభవము, జ్ఞానప్రాప్తి, ముక్తి లభించును. సాధన చేయుట యందు ఆహార విహారములయందు నియమము అవసరము. జ్ఞానము ఆనందమునకు ఈ జీవవిద్య (యోగవిద్య) ముక్తిసాధనకు సర్వార్పణము. ఈ సమన్వయ పూర్ణత్వమే మానవ పూర్ణత. అదే దేవుని కృపను ప్రసాదించునటు వంటి ధన్యత అని



శ్రీ జయతీర్థ స్వాములవారు అన్నారు. శ్రీ అచ్యుత ప్రభువులవారి మాటలలో సర్వార్పణము అనగా సాధనా విహీనులై, ఆత్మజ్ఞానము లేక కేవలము మూఢభక్తితో దైవేచ్ఛ, నేను దాసుడను, అనుచూ పిచ్చి పిచ్చిగా గంతులు పెట్టుటకాదు. ఏమి జరుగునో అదే జరుగనీ అని సోమరితనము అంధకారమున పడి అజ్ఞానమున భ్రమించుచూ మలిన జీవనపు అవధూత స్థితి కాదు. ఆదియందు దేవదత్తమైన దేహము, మనస్సు, ప్రాణము, వీటన్నింటి శక్తి, పరిశుద్ధతలు ఎటువంటివో అటువంటి పరిశుద్ధతలను తపస్సు నుండి పొంది, ఆపరిశుద్ధమైన సర్వమును భగవంతుని ఆజ్ఞ అని తెలిసికొని లోకకల్యాణమునకై సేవ సమర్పించునదే సర్వార్పణమని శ్రీ గురువుగారు బోధించినారు.

కొన్ని విషయాల గురించి మానవుని ఆలోచనా సరళి వెళ్లుచున్నది. ఈ సమస్త ప్రపంచాన్ని నడిపించుచున్న దెవరు? మన విధి విధానాన్ని నియంత్రించుచున్నది ఎవరు ? అన్ని జీవులలో ఉండే కనిపించని ఆ పరమాత్మ ఎవరు? అంతటా ఆత్మే అన్నారు ఉపనిషత్ మహర్షులు.

తదేజతి తన్నైజతి తద్దూరే తద్వంతికే ।
తదంతరస్య సర్వస్య తదు సర్వస్యాస్య బాహ్యతః॥

(ఈశావాస్య ఉపనిషత్ – శ్లో. 5)

దీని భావము ఆత్మ చలించును, చలించదు. అది దగ్గరగా ఉన్నది. దూరములో ఉన్నది. సర్వవ్యాప్తమైన ఈ ప్రపంచమునకు వెలుపల, లోపల కూడా ఉన్నదని ఈశావాస్య ఉపనిషత్తు తెలియజేయు చున్నది. ఈ విషయము బోధపడవలెనన్న ఆధ్యాత్మ సాధనము ఒక్కటే శరణ్యము. శ్రీ అచ్యుత ప్రభువు సర్వజ్ఞుడు, సర్వశక్తుడు, పూర్ణుడు, అటువంటి పూర్ణతను

ప్రభువు అచ్యుతుల ప్రతిమాట కృతి, రీతి, నీతి, నడత, నిలకడ, భావ భంగిమలలో కాననగును. సహవాసమందుండి అనుభవమును పొందిన వారికి ఆ వ్యక్తి పూర్ణత మనస్సులో అచ్చొత్తినట్లు ఆదర్శముగా నిల్చునని శ్రీ జయతీర్థస్వామివారు వివరించినారు.

తాను జగత్కల్యాణమునకై అవతరించి వచ్చి స్వయంపూర్ణుడై, జగత్తునందలి జనులకు ఆదర్శమునకై, ప్రభు అచ్యుతులవారు తపస్సు ఆచరించిన కాలములో, కేవలము ఒక పిడికెడు గోధుమపిండి, ఒక అరటిపండు కొద్దిగా తేనె కలిపిన ఆహారాన్ని సేవించినారు. హంపి యందలి రత్నకూట గుహ (దత్తాత్రేయ గుహ) నివాసము. అప్పట్లో శ్రీ విజయీంద్రస్వాముల వారు తోడుగా ఉండి తాను అనుభవించిన విషయాలు కొన్నింటిని, వారు "నా దేవుడు" అనే కన్నడ పుస్తకములో వివరించినారు. ఈ పుస్తకము ఇటీవలనే ముద్రింపబడినది. దానిని తెలుగు భాషయందు ఆశ్రమ శిష్యవర్గము 21.2.2008లో అచ్చు వేయించినారు.

సుమారు 2 వేల సంవత్సరముల నుండి జనులకు లభించక తప్పిపోయిన తపోవిద్యను ప్రసాదించిన అతని కృపను వర్ణింప సాధ్యము కాదు. అతని కృపా ప్రసాదమయిన దివ్య విద్య, అమృత విద్యను పొంది సాధించే తత్త్వాకాంక్ష బంధువులందరూ ధన్యులు కావలెననేది శ్రీ అచ్యుతులవారి ఉద్దేశ్యము. అటువంటి దయాళుడైన ఆదిదేవుడు అచ్యుత ప్రభువులవారు, తన ఆదేశముచే సర్వము అచ్యుతము చేయవలెనని, ప్రార్థించుచూ అతని దివ్య పాదముల యందు మనము ఆత్మనివేదనము చేయుదమని శ్రీ జయతీర్థుల వారు ప్రార్థించినారు.

* * *

12. ఉపనిషత్సారము : శ్రీ అచ్యుత ప్రభువులు మరియు



స్వామి విజయీంద్రుల మిలనాన్ని బృహత్ మిలనమని శ్రీ జయతీర్థులవారు నుడివినారు. వారి గురువుల ఆనతితో "ఉపనిషత్ సమీక్ష" అనే పుస్తకాన్ని తెలుగు భాషలో ప్రచురించినారు. ఇందులో దశోపనిషత్తుల వివరణ ఉన్నది. ఆధ్యాత్మ సాధనకు చెప్పిన విషయాలు కొన్నింటిని వారు చక్కగా వివరించియున్నారు. చదువరులకు ఒక మాట చెప్పుచూ, ఈశ, కేన, కఠ, ప్రశ్న, మాండూక్య, ఈ ఐదు ఉపనిషత్తులలో ఉన్న విషయాలు వేర్వేరుగా శబ్దాలలో వచ్చినవి. వాతావరణ శుద్ధి కోసం చేయు యజ్ఞముల విషయమై సూక్ష్మముగా చెప్పబడిన వన్నారు. జిజ్ఞాసులకు ఈ అయిదు ఉపనిషత్తులు చాలు అని అనిపిస్తున్నది. కావున తక్కిన ఉపనిషత్తుల సారాంశం మాత్రం కొన్ని శ్లోకాలలో ఇవ్వబడినదన్నారు.

"అథ యదిద మస్మిన్ బ్రహ్మపురే
దహరం పుండరీకం వేశ్మదహరో–స్మిన్
అంతరాకాశ స్త స్మిన్ యదంత స్తదన్వేష్టవ్యమ్
తద్వావ విజిజ్ఞాసితవ్య మితి"

(ఛాందోగ్యోపనిషత్తు – అష్టమ ప్రపాఠకము)

మన దేహములో బ్రహ్మపురి – బ్రహ్మ రంధ్రమనే చిన్న కమలము ఒకటి ఉన్నది. అందులో సూక్ష్మమైన శూన్యస్థానమున్నది. దీనినే దహరాకాశమని కొంతమంది చెప్పియున్నారు. మన శిరస్సుపైన ఉన్న "మాడు" అనే స్థలము. అందులో ఏమి ఉన్నది అనే దాన్ని తెలిసికోవలెను. దీనిని తెలిసికొనుటకు సాధనమైన ప్రాణవిద్యను తెలిసికొనవలెను. కొంతమంది ఈ ప్రాణవిద్యనే దహరవిద్య అని చెప్పియున్నారు. ఇచ్చట కమల మనబడు స్థానాన్నే కొంతమంది సహస్రారమన్నారు. ఇచ్చట ఆత్మ

ఉన్నదని చెప్పబడినది. ఇది ఎప్పుడూ క్రిందికి దిగిరాదు.

"ఏష ఆత్మా–పహతపాప్మా విజరో విమృత్యు విశోకో విజిఘత్సో
పిపాసః సత్యకామః సత్యసంకల్పః"

(ఛాంధోగ్య – అష్టమ ప్రపాఠకం 1–5)

ఈ అంతరాకాశంలో ఉన్నవాడు ఆత్మ. ఇతడు పాపరహితుడు. వార్థక్యము, మృత్యువు లోకములో లేనివాడు. ఆకలి దప్పిక లేనివాడు. సత్యకాముడు, సత్యసంకల్పుడు. ఇచ్చట ఆత్మని సహజత్వం ఆనందానుభవం. ఇతనికి ఇచ్ఛ వచ్చినంతనే కార్యములు కాగలవు. ఆత్మని సహజత్వ శక్తి ఇటువంటిది అయిఉన్నా మాయావృతుడై అజ్ఞానములో ఉన్నాడు.

ఛాందోగ్యోపనిషత్ శాంతిమంత్రములో "మాహం బ్రహ్మ నిరాకుర్యాం" అని ఋషులు అన్నారు. అనగా బ్రహ్మత్వం నానుండి నిరాకరణ కాకుండా ఉండనీ అని. ఈ మాట విచిత్రంగా కనిపిస్తుంది. అయితే బ్రహ్మత్వానుభవం అనగా ఆత్మని సహజమైన ఆనందాను భవమును అపేక్షించి బ్రహ్మనిష్ఠుడై వారి కృపకు బ్రహ్మను ప్రార్థించి కృతార్థుడై ఆ బ్రహ్మత్వానుభవము కలిగిన తర్వాత కూడా మోహము వల్ల దుఃఖితుడై ఈ బ్రహ్మత్వానుభవము వద్దు అని, ప్రస్తుతానికి ఇది నానుండి దూరముండవలెనని చాలమందిలో ఇచ్ఛ కలుగును. ఇది సహజమే. ఇది అనుభవము అని శ్రీ జయతీర్థస్వామి వారు అన్నారు.

ప్రశ్నోపనిషత్ నందు ఆత్మవలన ప్రాణచేతనము వచ్చినదని, ఇదే ప్రాణం దేహములో వాయువులను సృష్టించుకొన్నదని, ఈ వాయువే ఐదుపేర్లతో మన దేహములో వేర్వేరు పేర్లతో ఆయా స్థానములందు సంచరించుచున్నదని మహర్షులు చెప్పియున్నారు. ఆత్యంతిక పురుషుని



(దేవుని) సూర్యునితో పోలిస్తే ఈ పురుషుని అనగా మానవ దేహము నందు ఉన్నవానిని ప్రత్యగాత్మ – జీవాత్మను చంద్రునితో పోల్చవచ్చు. అతను నాదబిందు, కళాతీతుడు. మానవ దేహములో ఉన్నవాడు జీవాత్మ – ప్రత్యగాత్మ నాదం మూలకముగా (ప్రణవ మూలకముగా) బిందువునందు అనగా బ్రహ్మరంధ్రమునందు చేరినపుడు తన యొక్క సహజస్థితి పొంది ఆనందానుభూతు డగుచున్నాడు. మన దేహమునందు ఉన్నవానికి వృద్ధి, క్షీణతలు ఉన్నాయి. ఇవి ఆ దేవునికి లేవు. అతనిని శరీరస్థ పరాత్పర పురుషుడు, నిత్యదేహి అయిన ఆత్యంతిక పురుషుడు స్వరాట్ అని స్పష్టముగా ఋషులవలన తెలియజేయబడినది. ఈ దృష్టినుంచి ఈ ఉపనిషత్తు ఆత్యంతిక మహత్వమున్నదని చెప్పబడినది.

సూర్యప్రకాశమున్నపుడు అనగా పగలు కర్మ చేయుటకు గాను, రాత్రి అంతర్ముఖ సాధన చేయుటకు గాను (తపస్సునకు) సృష్టి నియమమని ఈ నియమాన్ని ఋతమని ప్రభు శ్రీయోగి అచ్యుతుల బోధ అని శ్రీజయతీర్థులవారు నుడివి యున్నారు.

అన్ని శబ్దములు శంఖము మూలకముగా దేహములో ఒక స్థానము ద్వారా నడుస్తాయని ఛాందోగ్య ఉపనిషత్తులో అన్నారు. తర్వాత శూన్యస్థానము అనగా బ్రహ్మరంధ్రములో ప్రాణాన్ని ప్రతిష్ఠించుట వలన అనుభవమగు ఆనందమే సుఖము. అదే బ్రహ్మత్వానుభవము, ఆనందానుభూతి అని చెప్పబడినది. ఇలాంటి సుఖప్రాప్తికి సాధన చేసియే తీరవలెను.

బృహదారణ్యకోపనిషత్తు నందు ఎక్కువ మాటలు అనవసరమని చెప్పిన విషయమై శ్రీ జయతీర్థస్వామి వారు ఈ విధముగా అన్నారు. ప్రభు అచ్యుతులవారు కూడా మాటల వలన కాలము వ్యర్థమగును. ధర్మకర్మానుచరణముకావలెను అన్నారు. సత్యవిషయమై మార్గదర్శనానికి

అవసరమైన కొన్ని మాటలు చాలు నన్నారు. భక్తియుతముగా సాధన చేయవలయును. తత్త్వజ్ఞానము పొందవలెను. దైవాన్ని దర్శించవలెను. ధర్మబద్ధముగా జీవించవలెనని శ్రీ ప్రభువుల హితబోధని శ్రీ జయతీర్థస్వామివారు చెప్పినారు.

"యో భూమా తత్ సుఖం"

(ఛాందోగ్య - సప్తమ ప్రపాఠకం - 23-1)

ఏది స్వయంభువో విశాల వ్యాప్తియో అందులో ప్రతిష్ఠిత మగునో అదే సుఖము. అదే ప్రాణములో మనస్సు లీనమైనపుడు అంతర్ముఖత యందు కలుగు ఆనందము. In organic Enjoyment. ఇదిసాధనవలన సాధ్యమని శ్రీ జయతీర్థస్వామి అన్నారు. ఇచ్చట సాధన అనగా బ్రహ్మవిద్య, ప్రాణవిద్య. ఈ విద్యను ఆశ్రయించిన మానవులు అమృతులు. అభయులు కావచ్చునని ఉపనిషత్తులలో మహర్షుల బోధ. దీనిని వారు తమ అనుభవము వలన చెప్పియున్నారు.

ఈ విద్య చేయువారికి సర్వకామ్యాదులు సిద్ధించునని ఉపనిషత్తుల యందు చెప్పబడినది. విద్య అనగా ఆత్మను తెలిసికొను మార్గము.

"ఆగాతా హవై కామానాం భవతి య ఏతదేవం విద్వాన్

అక్షర ముద్గీథ ముపాస్త ఇత్యధ్యాత్మమ్"

(ఛాందోగ్య - ప్రథమ ప్రపాఠకం -2-14)

ఈ రహస్యాన్ని తెలిసికొని ఉద్గీత (ప్రణవము - బ్రహ్మవిద్య) ఉపాసన చేయువారి సర్వకామ్యాదులు సిద్ధించునని తెలిపినారు.

ఉపాసన అనగా ఆత్మను తెలిసికొను మార్గము.



"ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మన్తవ్యో నిది ధ్యాసితవ్యో"

(బృహదారణ్యక -2-4-5)

ఆత్మ చూడదగినది, వినదగినది. మనస్సుతో స్మరించదగినది. ఇచ్చట ఆత్మ నిరాకారి కాదనే సత్యాన్ని గూర్చి చెప్పబడినది. బృహదారణ్యకోపనిషత్తు నందు ఈ విద్యను పరమేష్ఠి హిరణ్యగర్భుని నుండి పొందినాడని చెప్పబడినది. హిరణ్యగర్భుడనగా స్వయంభువు (విరాట్ పురుషుడు) ఇచ్చట బ్రహ్మ అనగా త్రిమూర్తులలో ఒక్కడు కాదు. ఇతనిని విరించి అన్నారు. విరించి అనగా రచించినవాడు. ఈ రచించిన దానిని భ్రమించినవాడు బ్రహ్మ. త్రిమూర్తులలో ఒక్కడు.

జనకమహారాజు కొలువులో పండితులు యాజ్ఞవల్క్యునికి వేసిన కొన్ని ప్రశ్నలకు సమాధానము గమనించవలెను. బృహదారణ్యకోపనిషత్తు-

ఇరువురు దేవతలు ఎవ్వరు ?

ఉత్తరము : అన్నం, ప్రాణం. అన్నమనగా అశనము. సాధనలో తెలియనగును. "అశనగతః ప్రాణః" ఒకే దేవుడు ఎవ్వరు?

ఉత్తరము :ప్రాణము "ప్రాణోవై సమ్రాట్" పరబ్రహ్మ అని ఉన్నది. (బృహదారణ్యకోపనిషత్తు - 4వ అధ్యాయము) ఈ శరీరాన్ని ప్రాణాన్ని నియంత్రించుచూ ఆత్ముడు శరీరం నుండి బయట తన ఇచ్చ వచ్చిన స్థానాన్ని దర్శించగలడు.

"పురుష విభ్యోంగభ్య సంప్రముభ్య పునః

ప్రతి న్యాయం ప్రతియోన్యా ద్రవతి ప్రాణాయ్యేవ"

(బృహదారణ్యక ఉపనిషత్తు)

పురుషుడు (మానవుడు) దేహము నందు బంధవిముక్తుడై మరల ఏ విధముగా దేహమును పొందుచున్నాడు అను ప్రశ్నకూడా ఉన్నది.

చనిపోయినపుడు ఆత్మ కూడా ప్రాణంతో పాటు వెళ్లుచున్నది. మనదేహమునందున్న ఆత్మ పురుషుడు కాదు, స్త్రీ కాదు. ఇది స్త్రీ దేహము ధరించినపుడు ఆదేహధర్మాలు, పురుష రూపము ధరించినపుడు ఆ దేహధర్మాలు ఉండును. స్త్రీ పురుషులకు సుఖానుభూతి, దుఃఖానుభూతి సమానము. మనస్సు కూడా సమానము. అందలి అనుభూతులు కూడా సమానము. అయితే దేహ ధర్మాలు వేర్వేరుగా ఉండును.

ప్రాణాయామాన్ని గూర్చి శ్రీ అచ్యుత గురువుగారు తెల్పిన విషయాన్ని శ్రీస్వామి జయతీర్థులవారు వెలిబుచ్చినారు. సతీపతులు కలిసినపుడు ఒక నిష్ఠ కలుగును. దానిని సంసారులైన మీరూ వర్ణించలేరు. ఆ సమయమున దేహము నందు ప్రాణాపానగతులు అధికమగుచూ ఏకనిష్ఠయందు నిలిచి ఇంద్రస్థానమును కదిలించి వీర్యము అధోముఖమై తల్లి గర్భమునందు పడి అండముగా పెరుగుచూ తను ఆకారము పొంది వృద్ధియై తల్లి గర్భము నుండి భూమిపై పడుచున్నది. యోగమునందు నిలిచి చూచి చెప్పినపుడు తల్లి సంబంధం కూడా భూమి లాంటి సంబంధమే కాని ఎక్కువ కాదు. తండ్రి సంబంధమే అధికము. ప్రాణాయామము అపుడే తండ్రి నుండి వచ్చినది. ఆ తండ్రి నుండి ఈ తండ్రికి అలాగే ఆది యందు పూర్ణత్వము నుండే అది వచ్చినది. ఆ పూర్ణత్వమునకు ఎచ్చటి నుండి వచ్చినదన్న ప్రశ్న మనది కాదు. అందువల్లనే అది పూర్ణం అనిపించుకున్నది. దీనివలన పూర్ణత్వమునకు తరిగిపోవుట ఏమియు లేదు. కనుకనే ఉపనిషత్కారులు ఇట్లనిరి.

"పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే"

(ఈశావాస్యోపనిషత్తు)



అనగా ఒక దీపము నుండి వేర్వేరు చిన్న దీపములను వెలిగించినను మొదటి దీపపు కాంతి తగ్గదు. అలాగే మన మనస్సును బట్టి చూచినను ఈ విశాల జగత్తులో పూర్తిగా వ్యాపించి పూర్ణముగా కనపడు మనస్సు ఒక చేతనము నుండి బయటపడినను తిరిగి ఉత్తమగతికి అచ్చట చేరినపుడు మనస్సుగానే మిగిలి అపూర్ణమని తెలియును. అయినను చేతనము మాత్రము పూర్ణమే. ఈ మనస్సు నంటి సాగినచో అది తెలియగలదు. అలాగే ప్రాణుని యొక్క సృష్టికి మూలమైన విషయములో తొలుత సాధనను అనుసరించి నపుడు లక్ష్యము చేరుట సాధ్యమగును. ఆ లక్ష్య మెక్కడిది ? ఎక్కడి నుండి వచ్చినది ? ఇత్యాది ఏ ఒక్క ప్రశ్నయు కాదు. ఇది తత్త్వాకాంక్షి యొక్క ప్రశ్న కాదన్నారట శ్రీ అచ్యుతప్రభువులు.

ప్రాణాయామమే ముఖ్య సాధనము. కాని ఈ ఆయామము చేయుటకు, భయపడుటకు కారణము, సాధన తెలియని వారు, కేవలము గ్రంథవాసన గలవారు ఊహలతో దాని విషయమై ఏవో కృత్రిమ పద్ధతులను వ్రాయడం. ఆ పద్ధతిని అనుసరించబోయి అనేకులు కష్టములు పొందుట ముఖ్యముగా గ్రహించవలెను. ప్రాణుడు బయటగాక, మనదేహములోనే ఉండుటవలన ప్రాణునికి కావలసిన ఆయామము దేహములోనే ఉండితీరవలెను. ముక్కు మొదలగు వానిచేతను, బాహ్యమైన స్థూల పూజలవలనను సాధన సాధ్యముకాదని అచ్యుతులవారు తెలిపినారట. బ్రహ్మేంద్రియములను పీక స్థానమున నిష్ఠయందు నిలుపునదే నిజమైన బ్రహ్మచర్యము. ఈ బ్రహ్మచర్యము సంసారికి, సన్యాసికి అవసరము. ఇది లేనిచో ఎవ్వరికీ మోక్షసాధన సాధ్యము కాదన్నారట పూజ్య గురువులు. కంఠమునందే మృత్యువున్నది. ఆ స్థానం స్వచ్ఛత లేక కల్మషముతో నిండి యుండుట వలననే మరణ సమయమున ప్రాణుని గమనమునకు ఆటంకమై మరణము సంభవించుచున్నది.

అయితే యోగసాధన చేయువారు మరణించుట లేదా ? అను ప్రశ్న వచ్చును. దేనిని గానక రోగాదులచే కృశించి మరణించుట లేదో, భవిష్యత్తు తెలిసికొని, చెప్పి, విని ఏ రోగ బాధ లేక ఆరోగ్యవంతులై యుండి ఇక చాలు అన్న తర్వాత కన్నుమూయు వారు లేరే. అటువంటి వారి దేహమును భస్మము చేయక సమాధి చేయుచుండిరి. వారు మరణించిరని అనకూడదు. అలాగే యోగ సమాధియందున్నారు. తర్వాత కావలసిన దానిని కనుగొని వెళ్లిపోయినవారున్నారు.

మొత్తమ్మీద చెప్పవలెనన్న ప్రాణుని తెలిసికొన్న సర్వము తెలియును. లేనిచో సాధ్యము కాదు. సనాతన అంధ శ్రద్ధ సంప్రదాయము వారు ఇది విని కోపగించుకొనరాదు.నన్ను నాస్తికుడని అనరాదు. ఉన్న సత్యమునే చెప్పితినని పూజ్యశ్రీ అచ్యుత గురువుగారు అన్నారు. ప్రాణుని బట్టి తపస్సు చేయవలెను. కర్మబద్ధత కావలెనన్నారు. కర్మ త్యాగం చేసి వెళ్లుటకు సాధ్యము కాదన్నారు. నేను గుహయందుండి తిరిగి వచ్చితిని. కర్మభ్రష్టత వలన మోక్షము సాధ్యము కాదు. ధర్మ, కర్మలను అనుసరించి సాగిననే సుఖము. ఇది నా అనుభవములో గ్రహించినది అని శ్రీ అచ్యుతులవారు తెలియజేసినారు. ఉపనిషత్కారులు దానినే చెప్పిరి. దానిని నమ్ముటనే భక్తి అని చెప్పుకుంటూ స్థూల పూజలయందు అంధ శ్రద్ధలతో సాగువారున్నారు. అయితే సత్యం తెలియజేయవలెనన్న ప్రాణుని బట్టుటే ఉత్తమమైన మార్గమన్నారు.

బ్రహ్మవిద్య "ప్రాణాయామము" తన దేహము నందే జరుగ వలసినదని పూజ్యగురువులు పలుమార్లు వివరించినారు. ముక్కు మొదలైన ఇంద్రియముల ద్వారా కాదు. శంఖము ద్వారా లోపల నాభినుండి బ్రహ్మ రంధ్రము వరకు, ప్రాణుని గతాగతి యందుంచవలసిన సాధన అది. ఇంత వివరముగా దానిని ఎవ్వరూ వివరించలేదు. ఎదుట కూర్చుని చేసినను తెలియజాలదు. మాటలలో వర్ణించినను వారికి అనుభవము



కాదు. "ఉపదేశము" కావలెను. ఉపదేశమనగా బోధించుట అను కల్పన తప్పు. అది మాటయో, మంత్రమో అయినచో గ్రంథములనుండియే నేర్చుకొనవచ్చును. గురువు ఆవశ్యకత లేదు. ఆ విద్యను తెలిసినవారి నుండి తెల్సి కొనవలెనను ఇచ్ఛ ఉన్నవారు చెవి సమీపమున ప్రాణుని ఝుంకారము నందుంచిననే గ్రహించగలరు. అప్పుడు వారి ప్రాణమునకు కూడ మేల్గతికి మార్గమగును. ఇదే నిజమైన ఉపదేశమని పూజ్యగురువులు తెలియజేసినారని మన గురువులు బోధించినారు.

త్రివేణిని దర్శించి ముక్తుడవగుము అన్నారు. అనగా మన దేహమున, బయటా చలింపతగిన ప్రాణుని, అంతరము నందున్న బ్రహ్మరంధ్రపు ద్వారమునందు చేర్పుము. ముక్తి దొరకును, అని పూజ్యగురువులు అన్నారు. "మూర్ధ్నా యోగధారణమ్" అని భగవద్గీత.

ఒక సత్పురుషుడు "త్రివేణి సంగమము నందు స్నానము చేయుము" అది మోక్ష సాధన అన్నారు. స్థూలముగా ఆ ప్రదేశము నందు గంగా, యమున, సరస్వతి కావచ్చును. ఆ స్థలములో సరస్వతి కన్పించదు. కావున మోక్షం కానరాదు. మరొక మహాపురుషుడు "తట్టుము – తెరువబడును" అని చెప్పియున్నారు. మరొకరు "పై స్థానమున కూతవేయుడు" అన్నారు. వీరు దేవస్థానము బయట నుండి కూత వేశారు. మోక్షము దొరకలేదు. దొరకదు కూడా. ఆ వాక్కులు చెప్పినది త్రివేణిని, తట్టునటువంటి, కూతవేయునటువంటి స్థానము గూర్చి. అయితే ఆ మార్గమును ఇప్పటి వారి అనుయాయులు తెలిసికొనలేదు.

"ప్రణవో ధనుః శరోహ్యాత్మా బ్రహ్మ తల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయో భవేత్ ॥"

(ముండకోపనిషత్తు 2-2-4)

తా. ప్రణవమే ధనుస్సు – అనగా ప్రణవమే ఆ ఝుంకారమే

శబ్దము. దానిని నడుపు మనస్సే బాణము. ఆ బ్రహ్మావైపు లక్ష్యము కలిగి, బ్రహ్మమే గురి. బ్రహ్మ మనగా బ్రహ్మేంద్రియముల కూటస్థానమైన భ్రూమధ్యమునకు గురిపెట్టి నడుపుచూ విలుకాడు తాను వదలిన బాణము గురిని తాకువరకు ఏ విధముగా దానియందే తదేక దృష్టి కలిగియుండునో అదే రీతిగా తన్మయుడై యున్నచో దానివలన మనుష్యత్వము మేలుకొనును అని తెలియజెప్పినారు, మన గురువుగారు. కన్ను భ్రూమధ్యమునే చూడవలెను. భ్రూమధ్యమునకు ప్రాధాన్యత ఎందుకు ? అచ్చట ఏదో రహస్య మున్నది. అందువలననే అన్ని ధర్మముల వారు ఆ స్థానమునకు నమస్కరించుట కలదు. ఆ స్థానమునందు తిలకమును ధరించు ఆచారము కలదు.

ప్రాణుని గతియందు కలుగునటువంటి ఝంకారమే ప్రణవము. సర్వేంద్రియములు ఏకస్థానము నందు నిలిచినపుడు దాని అర్థము తెలియగలదు. అంధ పూజ అంధ శ్రద్ధలతో సాధ్యము కాదని మన గురువుగారు అన్నారు. పై విధముగా సాధనలో సాగినచో తనను తాను తెలిసికొనుట సాధ్యమన్నారు. Know Thy Self, Knothy స్వరూపజ్ఞాన మన్నారు. ప్రాణుడు మన దేహమందలి వాయువును గతాగతియందుంచి, శుద్ధపరచి ఆ శుద్ధాంశమును జీవునకు ఇచ్చును. వాయువే మొదటి బ్రహ్మ అన్నారు. ప్రత్యక్ష బ్రహ్మ అన్నారు ఉపనిషత్కారులు. ఆ వాయువును బట్టి సాగునపుడు ప్రాణుని స్థితిని, ఆ ప్రాణుని గతిని బట్టి సాగునపుడు జీవుని, ఆ పిదప ఆత్మను తెలిసికొన నగును. ఇచ్చట ఆత్మ అనగా విశ్వాత్మ అని తెలిసికొనవలెను. జీవుడు అనగా వారి దృష్టిలో మానవ దేహము నందు గల ప్రత్యగాత్మ అని తెలిసికొనవలెను. కావున ప్రత్యక్ష సాధన లేనిదే పై విషయములు అర్థము కావు. ముక్కు మొదలగు ఇంద్రియముల ద్వారా చేయు సాధన బ్రహ్మ విద్య కాదు. ప్రాణాయామం కాదు. శంఖము ద్వారా, కంఠము ద్వారా దేహము లోపల నాభి నుండి బ్రహ్మరంధ్రము



వరకు ప్రాణుని గతాగతి యందు ఉంచవలసిన సాధన ఇది. ఐనను ఏ విధముగా చేయవలెనో అర్థము కాదు. ఎదుట కూర్చుని చూపినను తెలిసికొనలేరు. శబ్దములచే వర్ణించినను తెలియజాలదు. అందువలననే "ఉపదేశము" కావలెను.

ఈ సాధనలో సాగువారు మద్య, మాంసాదులు స్వీకరించరాదు. వాటివలన షడ్రిపులు, అష్టకష్టాలు కలుగును. సాధనలో ప్రగతి పొందుట సాధ్యపడదు.

"అన్న గతః ప్రాణః" అన్నారు ఉపనిషత్కారులు. ఇది మనము తినే ఆహారాన్ని గూర్చి కాదు వారు చెప్పినది. తిండి వల్లనే ప్రాణుడు మనదేహములో ఉన్నాడనుకొంటే, అన్నం తినువారు మరణించరు. ప్రాణునికి అవసరమైన శుద్ధాంశమైన అశనమును అన్నము అన్నారు. ంచిళిదీలి అని చెప్పిరి. ఇది కూడా వాయు రూపమే. ఇంద్రియాదుల వ్యాపారము వలన ఈ అశనము కలుగును. దీనిని సాధనలో సంపాదించవలెను. ప్రాణునికి ఈ అశనము తగ్గినపుడు అలసట మరియు మత్తు కలుగును. ఇవి సర్వేంద్రియములు కదిలించినపుడు ఆవులింతలు వచ్చును. లాలాజలము స్రవించును. ఆవులింతల వలన కంటిలో నీరు వచ్చును. ఈ ఆవులింత ఎందుకు వచ్చును? తన మూలస్థానము చేరుటకు ప్రాణగతి యొక్క ప్రయత్నమే అది. రోగులకు ఆవులింతలు రానిచో వారికి చావు సమీపించినట్లే. మోక్షసాధన అని దేనినో చేసి, దేనినో తెలియక, తెలిసికొనక చచ్చుట కంటె ఈ రీతిగా ప్రాణి తెలిసికొని, చెప్పి చేసి ఇచ్ఛామరణుడగుట మేలు.

తత్త్వసాధనకు అర్హులు ఎవరు ? అందరూ. దానికి జాతి, మత, కుల, స్త్రీ, పురుష, వృద్ధ ఇత్యాది భేదములు పూర్వకాలములో లేవు. ఇప్పుడు లేవన్నారు శ్రీ అచ్యుత గురువుగారు. కావున అచ్యుతాశ్రమములో అందరూ సాధనయందు సాగుచున్నారు. అందరిని ఉద్దేశించుటకై యున్న

ఆ సర్వవ్యాప్తి అగోచర స్థితియందున్నదని శ్రీ గురువుగారు అన్నారు. ఆ సర్వవ్యాప్తిని తెలిసికొనకనే దేనిని తెలిసికొనుట సాధ్యము కాదని, కావున సాధన చేయవలెనని మన గురువుగారు అన్నారు.

శాస్త్ర విషయములు చర్చించుచూ, శాస్త్రమనగా నేమి ? ఆయా విషయములందు దర్శించి, సత్యమును దర్శించి, అనుభవములను వర్ణించి మార్గమును చూపిన రీతి, నీతి నియమములను తెలుపునటువంటి మాటలే, శాస్త్రములు. అనుభవజ్ఞులు తమ మాటల వెనుక వున్న సత్యమును తెలిసికొనిరి. సాధనానుభవము లేనిదే శాస్త్రములు చెప్పుట చిలుక పలుకుల వంటిది. నిజమైన పాండిత్యమును సంపాదించవలెను. అంటే శాస్త్ర 'భాష' సంస్కృతం అర్థమగును. భగవద్గీతలో "పండితాః సమ దర్శనః" అన్నారు. సాధన చేసినవారికి, అనుభవము ఉన్నవారికి సమత్వము అంటే తెలియనగును. "విగ్రహానాం అల్పబుద్ధీనాం" అను మాటలు కన్పించు చున్నవి. సదా వ్యవహారబద్ధులై ఆశ, స్వార్థము మొదలగు దుర్వ్యసనాదు లందుపడి వృథాకాలయాపన చేయు నాస్తికులకు, దేవుని అస్తిత్వము కల్పింపచేయుటకు, బహిర్ముఖముగా మనోనిష్ఠ సాధ్యముకాక, అంతర్ముఖ తపోవిద్య తెలియక, అది లభించని వారికి అయినంత సమయము దైవచింతనలో సహాయపడుటకు, స్థూలపూజ అనగా విగ్రహారాధన క్రమము ఏర్పరచిరి. అనగా విగ్రహారాధన చేయకూడదని కాదు. అయితే అది ఆత్మానందమునకు జ్ఞాన ప్రాప్తికి సాధనము కాదు. శాస్త్రములందు "జన్మనా జాయతే శూద్రః సంస్కారాత్ ద్విజః" అన్నారు. అనగా మానవ జన్మ పుట్టినప్పుడు శూద్రస్థితిలో ఉండును. సంస్కారం వలన బ్రాహ్మణుడగును అని తెలిపియున్నారు. సంస్కృతభాష స్థూలముగా అందరూ చెప్పు అర్థములో వారి మాట అన్వయించదని శ్రీ గురువుగారు అన్నారు. సంస్కృతులైన సంస్కరించ బడినవారి భాష సంస్కృతము. అసంస్కృతులకు అర్థంకాదన్నారట శ్రీ గురువుగారు. సంస్కృతి యనునది



జ్ఞానుల మాటలలో స్థూల నాగరికత కాదు. చేతనకు ఆవరణమై పెరిగిన అజ్ఞానపు పొరను ఛేదించి కల్మషములన్నింటిని తొలగించి శుద్ధుడై, స్వస్వరూపజ్ఞానము, భగవద్దర్శనము, కృపకై అటువంటి సంస్కారపు సమగ్ర పరిపూర్ణతయే సంస్కృతి. సాధన రహిత జీవులు స్థూలమైన చదువు నేర్చిన మాత్రముననే దాని అంతరార్థమును గ్రహించలేరని పూజ్య గురువులు వివరించినారని స్వామిజయతీర్థులు విశదీకరించినారు.

అచ్యుత ప్రభువుల తత్త్వబోధనమండి తెలిసికొనవలసినది ఏమనగా తత్త్వజ్ఞానమునకు, ముక్తిసాధనకు జపమే యోగవిద్యయే సాధనము. సాధన లేని మాటలు పనికి మాలిన కబుర్లు. మాట అనునది అంతరాళము నుండి జగత్తు కల్యాణమునకై బయల్పడి, జనుల మనస్సులను హెచ్చరించి, సన్మార్గమునందు వర్తించునట్లు చేసి, ధర్మకర్మలకు ప్రోత్సాహకరముగా నుండిన దైవము మెచ్చును. వినయవిధేయతలు అవసరము. అది లేనిదే విద్య సిద్ధించదు. సాధనకు ఆహార విహారములందు నియమము అవసరము. పూజ్య గురువుల మాటల్లో సర్వార్పణమనగా సాధన విహీనుడై ఆత్మజ్ఞానము లేక కేవలము మూఢభక్తితో, దైవేచ్ఛ, నేను దాసుడను అనుచూ పిచ్చి పిచ్చిగా గంతులు పెట్టుట కాదు. ఏమి జరుగునో అది జరుగనీ అను సోమరితనముతో అంధకారమునపడి అజ్ఞానమును భరించుమలిన జీవులకు అవధూత స్థితి రాదు. ఆదియందు దైవదత్తమైన దేహము, మనస్సు, ప్రాణము, వీటన్నింటిశక్తి పరిశుద్ధతలో ఎటువంటివో అటువంటి పరిశుద్ధతను తపస్సులో ఉండి, ఆపరిశుద్ధమైన సర్వమును, దైవేచ్ఛను తెలిసికొని లోక కల్యాణమునకై సేవ సమర్పించునదే సర్వార్పణ మన్నారట అచ్యుతులు. ప్రభు అచ్యుతుల ప్రతి మాట, కృతి, రీతి, నడవడిక, నిలకడ వారి హావభంగిమలలో పూర్ణముగా కాననగునని, వారి సహవాసమందుండి, అనుభవమును పొందినవారికి శ్రీ గురువుల వ్యక్తిత్వ పూర్ణత ఆదర్శముగా నిల్చునని శ్రీస్వామి విజయీంద్రులవారు, మరియు శ్రీ స్వామి జయతీర్థులవారు అన్నారు.

తాను జగత్కల్యాణమునకై అవతరించి వచ్చిన స్వయం పూర్ణుడయ్యూ, జగత్తునందలి జనులకు ఆదర్శమునకై ప్రభు అచ్యుతులు ఆచరించిన తపస్సు మరియు 10 సంగల కాలము కేవలము ఒక పిడికెడు గోధుమపిండి మరియు ఒక అరటిపండును తినునట్టి ఆహార నియమమును, పరిశుద్ధ బ్రహ్మచర్యము, రెండు సంవత్సరములు హంపిలోని రత్నకూట గుహయందు నివాసము, అనంతరము జనులకు చేసిన పరోపకారకృషి, కర్మదక్షుడై నిలిచి ఇచ్చిన ఆదర్శము, తత్త్వాకాంక్షులకై ఋష్యమూకాశ్రమమును స్థాపించి శిష్యులకు స్థూల సూక్ష్మముల పోషణమును ప్రసాదించి, ధర్మకర్మముల దక్షత మరియు తపోవిద్య యందు వారికి కృపతో ఇచ్చిన శిక్షణ, అంతయూ జగత్తుకై ఆ పూర్ణుని సేవ అని శ్రీ జయతీర్థ స్వాములవారు వివరించిరి. హంపి యందలి రత్నకూట గుహలో శ్రీ గురువులతో పాటు శ్రీ విజయాంధ్ర స్వాములు కూడా నివసించినారు. వారి అనుభవ వాణి "నన్నదేవరు" అను పేరుతో కన్నడభాషలో ప్రచురితమైనది. అదే పుస్తకము 'నా దైవము' అను పేరుతో ఆంధ్రానువాదము చేసి ప్రచురింపబడినది. కావలసిన వారు వీటిని శ్రీఅచ్యుతాశ్రమము – విరుపాపురగడ్డ – గంగావతి వారి నుండి పొందవచ్చును.

దేవుడు ఎటువంటి ప్రేమమయుడు అనుటకు ప్రభువుల మాటలలో చెప్పవలెనన్న "what is God after all ? He is an eternal child, playing an eternal game in an eternal garden with his eternal children". అనగా దేవుడు ఎవరు ? తన యొక్క నిత్యులైన బిడ్డలతో నిత్యమైన సృష్టి అనుతోటలో ఆడునటువంటి నిత్యమైన బిడ్డ అని అన్నారని శ్రీ స్వామి జయతీర్థులవారు విశదీకరించినారు. ప్రభు శ్రీ అచ్యుతులవారి దివ్యపాదములకు మనమందరమూ ఆత్మ నివేదన చేయుదము.

* * *



13. కాయకల్పము – ముక్తిసాధనము, మరియు గీతాసుధా సారము – ఉపనిషత్ సమీక్ష మొదలగు గ్రంథములను మరియు సాధన ఆధారముగా ఇందులో వివరించబడినది.

శ్రీ స్వామి జయతీర్థులవారు కొన్నింటిని శ్రీ విజయాంధ్ర స్వాముల వారు కొన్నింటిని వివరించిన విషయముల ఆధారముగా వ్రాయుచున్నాను. వీటిని సాధనా పూర్వకముగా తెలిసికొనవలెను. మొట్టమొదట "కాయకల్పము" శ్రీ అచ్యుతులవారు చెప్పగా జయతీర్థులవారు వ్రాసినారు. కన్నడ ప్రతి రెండు సార్లు అచ్చు వేయబడినది. తరువాత "తెలుగు కాయకల్పములో" కొన్ని ముఖ్య విషయములు మాత్రము అచ్చు వేయబడినది.

ప్రాణి వర్గములో శ్రేష్ఠమైన మానవ ప్రాణి ఉత్పత్తి విషయమై కాయకల్ప గ్రంథములో వివరించబడినది. జన్మదాత తండ్రి యొక్క దేహములో భూతధాతులు పెరిగి పక్వతకు వచ్చిన తరువాత సామాన్యముగా "16" సంవత్సరాల ప్రాయమునకు వచ్చిన ఈ భూతధాతువుల జతకు బ్రహ్మేంద్రియములు, మనేంద్రియములు పక్వతకు వచ్చిన తరువాత మానవజన్మోత్పత్తి నిమిత్తమైన బ్రహ్మేంద్రియముల మూలకముగా మనస్సు భ్రమించి ఒక విధమైన ఆనందముతో కూడి ఏకాగ్రత కలుగుచున్నది. ఈ సమయానికి హృదయాన్ని క్రియాస్థానమై ఉన్న ప్రాణవాయువు యొక్క గతాగతి తీవ్రమై పైకెక్కుచూ ప్రాణముతో సంయోగం పొంది ఇంద్రస్థానాన్ని కదిలించుచున్నది. అనగా ప్రాణాయామమువలె ఉన్న స్థితి మనకు తెలియుచున్నది. దీని కంటె ముందు పురుషదేహములో వచ్చి చేరిన "జీవము" (ప్రత్యగాత్మ) అధోముఖమై తన దేహాన్ని పోషించవలసిన మాతృగర్భకోశాన్ని చేరి పెరుగుచున్నది. తండ్రి గర్భవాసము 3 మాసములు. తల్లి గర్భవాసము 9 మాసములు అని చెప్పబడినది.

తల్లి గర్భములో ఉన్న పిండానికి బ్రహ్మేంద్రియాది అవయవాదులు పెరిగిన తరువాత అనగా 5 మాసములలో "దేహములో ఉన్న శిశువుకు 5 మాసములు ముగియుచున్నపుడు" ఈ ఆత్మ - (ప్రత్యగాత్మ) వచ్చి చేరునని కొంతమంది చెప్పుచున్నారు. ఇది కేవలము భ్రమే అని శ్రీ అచ్యుతగురువులు అన్నారు.

తండ్రి దేహమునుండి "జీవి" ప్రాణాంశమును తీసికొని తల్లి గర్భము చేరినపుడు తండ్రి దేహములోని ప్రాణశక్తి యొక్క ప్రమాణం తగ్గదా ? అనే ప్రశ్న కలుగును. అది తక్కువ కాదు అన్నారు గురువుగారు. ఈ సందర్భములో పూర్ణము అని చెప్పినదాన్ని, క్రియాశక్తి మరియు జ్ఞానము ఈ రెండు శక్తులచే పూర్ణుడైన పరశ్రేష్ఠుని అని భావించవద్దు. అయితే ఈ ప్రాణం పూర్ణమని చెప్పుట ఏ విధముగా అంటే ఒక దీపాన్నుండే మరియొక దీపాన్ని వెలిగిస్తే మొదటి దీపకాంతి తగ్గదు, అని అర్థం చేసికోవలెను. కావున ప్రాణాంశము (తండ్రి యొక్క) తగ్గదు అని చెప్పబడినది. ఈ ఆత్మ-జీవి ఎక్కడి నుండి వచ్చినదనే ఆలోచన సాధకునిది కాదు. అయితే ఈ విషయము సాధనలో తెలియనగునని శ్రీ అచ్యుతగురువులు అన్నారు.

మాతాపితల ఋణానుబంధ విషయమై తెలియచేయుచూ తండ్రి ఋణం కంటె తల్లి ఋణమే గొప్పదని పలువురి అభిప్రాయముగా తెలియుచున్నది. అయితే యోగములో తెలిసికొన్న విషయమేమిటంటే తల్లి ఋణం కంటె తండ్రి ఋణమే గొప్పది. తండ్రి ధృతి నుండి అనేక అంశములు జీవి పొందుచున్నాడు. అంతే కాకుండా తండ్రి నుండే ప్రాణశక్తి దొరకుట వలన తండ్రి ఋణమే ఎక్కువని చెప్పుట విధియే లేదన్నారు శ్రీ గురువుగారు. దీని విషయమై చింతించుట వృథా కాలయాపన.

దీపము వెలుగుటకు నూనె ఎంత ప్రామాణ్యమో మానవ దేహమున జరుగు గతాగతి యందు ఉత్పత్తి యగు "అశనమే" ప్రాణానికి అంత



ముఖ్యము. ఈ ప్రాణశక్తి నశిస్తే మన దేహములో ఉన్న ఆత్మ-జీవం (ప్రత్యగాత్మ)కు అధోగతియే అన్నారు. మనం శబ్దము ఉత్పత్తికి కారణమైన ప్రాణుని వైపు సదా లక్ష్యముంచి ప్రాణయజ్ఞాన్ని చేస్తూ పోతే ఇహపర సౌఖ్యములు కలిగి శాంతి కాననగునన్నారు. "యజ్ఞానాం జప యజ్ఞోస్మి - విద్యానాం బ్రహ్మ విద్యోస్మి" అన్నారు భగవద్గీతలో.

తల్లి గర్భం నుండి శిశువు పతనమైన తరువాత దేహమందలి వాయువుకు బయటి గాలితో సంబంధము ఏర్పడి ముక్కు ద్వారము ద్వారా శ్వాసోచ్ఛ్వాసములు కలుగుచున్నవి. దీనినే గీతలో "నాసాభ్యంతర చారిణౌ" అన్నారు. తల్లిగర్భము నుండి వచ్చిన వాయువు బయటి గాలి (అనిలం) రెండూ చేరును. ఊపిరితిత్తులు పనిచేయుట మొదలగును. "వాయు రనిల మమృత మథేదం" అన్నారు. శాంతి మంత్రములలో. ఇది తల్లి గర్భములో ఉన్నపుడు నాభి నుండి బ్రహ్మరంధ్రము వరకు నడుచుచుండెడిది. దానినే ఇప్పుడు ప్రయత్న పూర్వకముగా చేయవలసి ఉన్నది. ఈ విద్యను తెలిసిన వారి నుండి ఈ సాధన పొందవలసినది.

మానవుడు తన్ను తాను తెలియక ఇతరులను హెచ్చ రించుటకు అర్హుడు కాదని గురువుగారు అన్నారు. సూక్ష్మస్థితులను తెలిసికొనవలెనన్నచో ముఖ్యమైనది ప్రాణము. ఈ ప్రాణుడు వాయుగతుడు. ఈ దేహమునుండి ప్రాణుడు వెళ్ళిపోయినచో చనిపోయిన వాడగుచున్నాడు. ఈ ప్రాణానికి "సత్" అను శబ్దమున్నది. భగవంతుని కంటె ఇది అనాది కాకుండినను శాశ్వతముగా ఉన్నదనే విషయము నిజము.

"ద్వా విమౌ పురుషౌ లోకే క్షర శ్చాక్షర ఏవ చ।
క్షరః సర్వాణి భూతాని కూటస్థో-క్షర ఉచ్యతే ॥"

(భగవద్గీత - అధ్యా. 15 - శ్లోకం. 16)

అని గీతలో చెప్పబడినది. ఈ లోకములో "క్షర" (జీవాత్మ

ప్రత్యగాత్మ) మన దేహములో ఉండునది. అక్షర (ప్రాణము) అను ఇరువురు పురుషులు మన దేహములో ఉన్నారు. అక్షరుడు (నాశరహితుడు) అనగా దేహమందలి జీవుని పరమాత్మను చేర్పించు చేతనము ప్రాణము అని చెప్పబడినది. అనగా జీవాత్మ పరమాత్మ సంయోగానికి సూత్రమువలె నున్న (చేరునట్లు) చేయు ప్రాణుడు నాశరహితుడని చెప్పబడినది. "క్షరుడు" నాశనమగునది. అనగా మోక్షము కావలయునని కోరి పూర్ణునిలో చేరి తన అస్తిత్వాన్ని పోగొట్టు కొనుచున్నది.

స్థూల ప్రపంచ రచనకు దీని నుండి భూతధాతువులు కారణమగుట వలన దీనిని వాయువు అని (మహాభూతమని – శ్రీ విష్ణు మహద్భూత) మని నుడివి యున్నారు. అందువలన "బ్రహ్మ" పెద్దది అన్నారు. ఈ వాయువును బ్రహ్మ అన్నవారు, ప్రాణాన్ని – వాయు జనకుని పరబ్రహ్మ అన్నారు. ఈ ప్రాణఉత్పత్తికి పూర్ణచేతనాన్ని పరంబ్రహ్మ అత్యంతము పెద్దది అన్నారు. ఈ విషయములు సాధనలో తెలియనగును.

మనస్సునకు చాంచల్యము (వికల్పము) తప్పి "సంకల్ప" స్థితి రావలెనన్నచో ఇంద్రియముల మూలకముగా కలిగిన ఆకర్షణ తప్పవలెను. అనునది ముఖ్యము. దీనికి వాయుసేవయే ముఖ్యము. "ప్రాణాయామము – జపము" బంధానికి మోక్షానికి మనస్సే కారణమని చెప్పియున్నారు. ఈ మనస్సును క్రింది స్థాయిలో మనేంద్రియమని పై స్థాయిలో మనస్తత్వమని చెప్పియున్నారు. ఈ విధముగా చెప్పుటకు కారణమేమనగా ఇంద్రియ లిప్తత కలిగినపుడు బంధనానికి ఈ లిప్తత నుండి విడివడినపుడు సర్వాన్ని తెలిసికొని మోక్షానికి కారణమగుచున్నది. పై మెట్టుతో అది జ్ఞానశక్తిని ఇస్తుంది. అప్పుడు దీనినే ఆత్మ (ప్రత్యగాత్మ) అని వర్ణించినారు. భగవద్గీతలో మనిషి దేహమందున్న జీవాత్మను నా అంశము అన్నారు. (జీవభూతము)



"మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః ।
మనః షష్ఠానీన్ద్రియాణి ప్రకృతి స్థాని కర్షతి॥"

(భగవద్గీత – అధ్యా. 15 – శ్లోకం. 7)

ఇది కాకుండా దీని సహాయక శక్తి ప్రాణాన్ని కఠోపనిషత్తు నందు "వామన" అన్నారు. తక్కినవారు దీనిని ప్రాణమన్నారు.

"ఊర్ధ్వం ప్రాణ మున్నయ త్యపానం ప్రత్యగస్యతి ।
మధ్యే వామన మాసీనం విశ్వే దేవా ఉపాసతే ॥"

(కఠ –5వ వల్లి – శ్లోకం. 3)

ఈ ప్రాణుడు – వామనుడు – ప్రాణవాయువును పైకి నొక్కుచున్నాడు. అపానాన్ని క్రిందకు నొక్కుచున్నాడు. వాయువు యొక్క ప్రాణాపానమును మార్పుచేయు స్థానములో (మధ్యలో) స్థితుడై ఉన్నవానిని "వామన" అన్నారు. అణురూపమైన ప్రాణచేతనాన్ని విశ్వమునందు గల దేవతలందరూ ఉపాసించుచున్నారు. మధ్య అనగా భ్రూమధ్యముపై భాగమునుండి నడినెత్తి (మాడు) క్రింద భాగము వరకు ఈ మార్గాన్ని "రథనాభి" అని చెప్పుచున్నారు.

జ్ఞానుల భావాన్ని తెలియకనే "ఈశ్వర" శబ్దానికి పరశ్రేష్ఠుడని అర్థము చెప్పుట సరికాదని గురువుగారు అన్నారు. పరశ్రేష్ఠుడు ఉన్న స్థానము ఈ రక్తమాంసములు కలిగిన దేహము కాదు. భూత ధాతువులతో కూడిన ప్రపంచము కాదు. వీటన్నింటికంటె పైనున్న ఆకాశమే పరమపురుషుని ధామము. ఇదియే భగవద్గీత 15వ అధ్యాయములో చెప్పబడినది.

"న తద్భాసయతే సూర్యః న శశాంకో న పావకః
యద్గత్వా న నివర్తన్తే తద్ధామ పరమం మమ॥"

(గీత–15 అధ్యా. శ్లో. 6)

అనగా ఎచ్చుట గాలి లేదో, సూర్యచంద్రులు ప్రకాశింపరో ఆ పరధామము నాది అని చెప్పబడినది.

బయటి గాలి ఆధారముగా అన్ని ప్రాణులూ బ్రతుకుచున్నవి. అయితే ఇది మానవులకు కాదు. అనగా పరధనము. మానవులకు తమ దేహములో ప్రాణశక్తి స్పందనతో సదా ఉత్పత్తి యగుచున్న వాయువే స్వీకార్య యోగ్యము అనగా – ఇది స్వధనము – ఈ బయటి గాలి కాదు. ఈ విషయమై ఈశావాస్యోపనిషత్తులో

"ఈశా వాస్య మిదం సర్వం యత్ కించ జగత్యాం చగత్
తేన త్యక్తేన భుంజీథా మాగృధః కస్య స్విద్ధనమ్ ॥"

(ఈశావాస్య –శ్లో. 1)

ఆధ్యాత్మ అనుభవానికి సాధనమైన యోగవిద్యను తెలిసి కొని సాధించిన వారికి జ్ఞానుల ఆంతర్యము తెలియనగును. దేహక్రియ మానసిక క్రియ దేహేంద్రియాదులకు మనస్సుకు శక్తి తక్కువయై బలహీన స్థితి ఏర్పడుచున్నది. ప్రాణశక్తి కృంగుచున్నది. ఈ కృంగిన ప్రాణశక్తికి వాయు మథనములో ఉత్పత్తి యగు అశనము (అన్నము) శక్తినిస్తుంది. అనగా మనదేహమునందలి అశనాన్ని ప్రాణశక్తి స్వీకరించుచున్నది. పరిపుష్టుడైన ప్రాణుడు అలసిపోయిన ఇంద్రియములకు మనస్సునకు నవచేతనాన్ని మరియు ఉత్సాహాన్ని కలుగజేయును.

జగత్ ప్రకృతి, సూక్ష్మ ప్రకృతిని గూర్చి కొంత విచారము అవసరము. గీత విజ్ఞాన యోగము నందు

"భూమి రాపో–నలో వాయుః ఖం మనో బుద్ధి రేవ చ
అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతిరష్టధా ॥"

(గీత – అధ్యా. 7 – శ్లోకం. 4)

అనగా భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి, అహంకారం అను ఎనిమిది నాజడ ప్రకృతి (అపరాప్రకృతి)



"అపరేయ మితస్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్
జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్॥"

(గీత–అధ్యా. 7–శ్లోకం. 5)

జడ ప్రకృతి కంటె భిన్నమైన జీవభూతము నా యొక్క పరాప్రకృతి. దీనివల్లనే ఈ జగత్తు ధరించబడినది. ఈ స్థూల ప్రకృతి కంటె శ్రేష్ఠమైనది. జీవము (ఆత్మ) పరాప్రకృతి అని చెప్పబడినది. దేహము యొక్క సూర్యేంద్రియాలు (కర్మేంద్రియాలు) బ్రహ్మేం ద్రియాలు అన్నియు ఆత్మని యొక్క బహిఃకరణాలు. ఇవి ఆత్మ నుండి బయట కనబడునట్టివి. ఆత్మని యొక్క కార్యానికి సహకరించునవి.

మనస్సు, బుద్ధి, చిత్, అహంకారాలు ఆత్మని కార్యానికి సహకరించుచూ ఆత్మలో ఉండు శక్తులు (అంతః) ఇవి బయటకు కనిపించవు. అయితే మనస్సు, బుద్ధి, అహంకారములను స్థూల అపరా ప్రకృతిలో ఎందుకు చేర్చబడినదనే ప్రశ్న ? దీనికి కారణము ఏమి? ఈ విషయమై గ్రంథ పండితులు తెలిసికొనలేరని, సాధ్యముకాదని శ్రీయోగి అచ్యుతులవారు సెలవిచ్చినారు. ఇందుకు ఆత్మానుభవానికి మాత్రమే సాధ్యమన్నారు. ఆత్మకు ఇంద్రియ మూలకముగా స్థూల ప్రకృతి లిప్తత ఉన్నపుడు మాత్రము నేను అనే అహంకారం ఉండును. అనగా ఇది యుక్తమైనదో కాదో అను విచారము వలన దీనిని చేయవచ్చునా చేయకూడదా అను విషయాలోచన కలుగుచున్నది. ఈ లిప్తత నుండి విడివడిన తరువాత అంతర్ముఖుడై ఆత్మ యొక్క సహజావస్థ అనుభవమై నపుడు అచ్చట కేవలము చిత్‌శక్తి పొంది అన్నింటిని ఉన్నచోటనే క్షణమాత్రములోనే తెలిసికొను జ్ఞానశక్తి మాత్రము ఉండునని ప్రభువులు అన్నారు. తక్కిన మూడు (ఆశ) మనస్సు – విచారము – మరియు తాను పెద్దవాడననే గర్వము (అహంకారము) ఆత్మునకు ఇంద్రియ మూలకముగా

త్రిగుణాత్మకమైన స్థూలప్రకృతిలో చేరినపుడు మాత్రము అనుభవము వలన తెలియనగునని ప్రభువులు అన్నారు.

బుద్ధిని (వివేకము) సాత్వికమని, మనసు (ఆశ) రాజసమని, గర్వాన్ని (అహంకారం) తామసమని – ఈ విధంగా ప్రకృతి లిప్తత కలిగినపుడు – ఆత్మ (ప్రత్యగాత్మ) మానవదేహములోనే పైనున్నది. ప్రకృతివల్లే త్రిగుణములచే కూడియుండుననియు, బహిర్ముఖ స్థితిలో చదివి, విని, ఊహించి, తెలిసికొను విషయాలు (వేదములు) త్రిగుణాత్మకమైనవని, ఆత్యంతిక సత్యాన్ని తెలిసికొనుటకు తన అనుభవములో కలుగు సమాధిజ్ఞానము (ఈ స్థితిలో అనుభవమైన జ్ఞానాన్ని) బోధించుటకు గీతలో అర్జునునికి చెప్పబడినది.

"నహి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే
తత్స్వయం యోగ సంసిద్ధః కాలేనాత్మని విన్దతి ॥"

(గీత – అధ్యా.4 – శ్లోకం 38)

జ్ఞానానికి సమానమైన పవిత్ర వస్తువు ఈ లోకములోనే లేదు. జ్ఞాని కానివాడు వ్యర్థుడు. సదాకర్మలు చేయుచునే ఉండవలెను. పరిపూర్ణత పొందిన మానవుడు జ్ఞానాన్ని తన ఆత్మనుండే పొందుచున్నాడు.

ఆత్ముని సహజస్థితి "చిన్మయత" (జ్ఞానానందస్థితి). అందువలననే తన్నుతాను తెలియకనే పూర్ణుని తెలిసికొనుట అసాధ్యమనియు, బ్రహ్మవిదుడు బ్రహ్మవలె అగుచున్నాడని అనుభవజ్ఞులు తెలియచేయు చున్నారు. ఈ స్థితి అనుభవము కావలెనన్న గుణాతీతుడు కావలెనని గీత బోధించుచున్నది. ఇది అంతర్ముఖ స్థితియందు మాత్రమే పొందుటకు సాధ్యమగునని శ్రీ ప్రభువులు అన్నారు. దీనికి ప్రాణవిద్య – ప్రాణాయామ మొక్కటే సాధనమన్నారు శ్రీగురువులు.

గోచరానికి దొరకని ప్రాణశక్తిని మాత్రము మహర్షులు సూక్ష్మములో చేర్చినారు. ఒక విధముగా ఆలోచించినపుడు విద్యుత్ శక్తివలె ఈ ప్రాణశక్తి



కూడా స్థూలశక్తి అని అనవచ్చును. ఎందుకనగా ఈ ప్రాణశక్తికి కేవలము క్రియ స్పందన ఉన్నది కాని జ్ఞానము లేదన్నారు. అయితే ఉపనిషత్కారులు "జ్యేష్ఠ శ్రేష్ఠ ప్రజాపతి" అన్నారు. అనగా ఇది ఆదిలో ఉత్పత్తి అయినది. అయినా దీనికి జ్యేష్ఠత్వమున్నను శ్రేష్ఠమని నేను సమ్మతించనని అచ్యుతులవారు అన్నారు. ప్రాణశక్తి తరువాత పూర్ణచేతనము నుండి (absolute) ఉత్పత్తి అయిన ఆత్మయే జ్ఞానమున్న చేతనము కావడం వలన సృష్టి సర్వములో జ్ఞానమున్న ఆత్మనే శ్రేష్ఠుడని నా అభిమతము. అందువలననే "ఆత్మ సర్వోత్తమ" అని నా చేత చెప్పబడినది అని శ్రీగురువుగారు అన్నారు.

ప్రళయము అని చెప్పబడినది సృష్టి అవాంతరాలే గాని పూర్ణ ప్రళయము అనునది కానేరదు అని ప్రభువుగారు అన్నారు. షడ్రిపుల విషయమై (కామ, క్రోధ, మోహ, మొదలగునవి) కొంతమంది తప్పుగా అర్థము చేసికొన్నారని శ్రీ ప్రభువులు అన్నారు. "కామము" అను శబ్దానికి తప్పు అర్థాన్ని కల్పించుకొని, దాన్ని ఒక్కదాన్ని గెలిస్తే ఉత్తమమనే భ్రాంతికి లోనై బ్రహ్మచర్యము తప్పనిసరి అని, అవివాహితులుగా బ్రతకువలెననే భ్రాంతికి గురియైనవారున్నారు. ఆహార నియమమనే విషయాన్ని తెలియక ఉపవాసములు వ్రతములు మొదలగునవి చేయుచూ శరీరాన్ని బలహీన స్థితికి తెచ్చుకొని వ్యాకులత చెంది శుక్ల నష్టమును పొందుస్థితికి వచ్చి తనకు తాను ద్రోహము చేసికున్నట్లుగా వర్తించుచున్నారు. అట్టివారు తమ తప్పు తెలిసికొనలేరు. షడ్రిపులలో కామాన్ని గెలిచినంత మాత్రాన అన్నింటిని గెలిచినట్లగునా ? తక్కిన క్రోధ, మద, మాత్సర్యాలు లేచి విజృంభించవా? అందువలన వీటిన్నింటిని ఏకకాలంలో ఒకే రీతిలో సమత్వములో ఉంచునదే "బ్రహ్మచర్యము" అన్నారు. ఇది బ్రహ్మచారికి కావలెను, సంసారికి కావలెనని శ్రీ ప్రభువులు సెలవిచ్చినారు.

ఇచ్చట విద్యయనగా కఠోపనిషత్తులో చెప్పిన రీతిగా తన్ను తాను "ఆత్మను" తెలిసికొను సాధనమైన చేతనము యొక్క విజ్ఞానమే విద్యయని

తక్కినవన్నియు స్థూల విషయములు తెలుసుకొను బోధ. అనగా అవిద్యే అని జ్ఞానాకాంక్షులు అనుచున్నారని జ్ఞాపకములో ఉంచుకోవలయును. దీనినే కొంతమంది మహర్షులు పరావిద్య మరియు అపరావిద్య అని బోధించినారు.

కొంతమంది దేవుడు సర్వవ్యాపి, నాలో ఉన్నాడు. మా యొక్క క్రియలకు ఆయనే కారణము నేను నిమిత్తమాత్రుడను అని చెప్పుచూ అజ్ఞానము వలన తాను చేయు తప్పులన్నింటికి పరమాత్మ ప్రేరకుడని చెప్పుచూ విహరించువారి మాటలు జ్ఞానముకాదు. అతనియొక్క అధః పతనానికి మూఢత్వము కాక మరేమున్నదన్నారు ప్రభువులు.

యోగమనే శబ్దానికి కలయిక అనే అర్థాన్ని చెప్పుకోవచ్చును. జీవుడు (ఆత్మ) తనకు పరమాత్మునకు ప్రపంచానికి మధ్య సంబంధాన్ని కలుగచేయు ప్రాణచేతనము ద్వారా ముక్తి పొందవలసియున్నది. దీనినే యోగమన్నారు. ఈ యోగ విషయము కొద్దిగా చర్చించ బడినది. ఈ విషయమై యాజ్ఞవల్క్య మహర్షి ఈ విధముగా వర్ణించినారు. "సంయోగ, యోగ ఇతి ఉక్తోజీవాత్మ పరమాత్మనో ఇతి" అనగా జీవాత్మ పరమాత్మునితో చేరుట అన్నారు.

"ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశే-ర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా" ।
"తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత
తత్ప్రసాదాత్పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్॥"
(భగవద్గీత - అధ్యా. 18 - శ్లో61-62)

సర్వప్రాణుల హృదయమనే స్థానమందు ఆడుచూ, బ్రహ్మేంద్రియములు, కర్మేంద్రియములు మూలముగా ఆత్ముని క్రియ నడచుటకు సూత్రమైన వాయు మూలముగా, దాని మూలమైన ప్రాణాన్ని తెలిసికొని



ఈ చేతనముల మూలకముగా దాని, మరియు దాని మూలమును తెలిసికొనుటకు ఇంద్రియ వృత్తులు మనస్సు, బుద్ధి, అహంకారములన్నింటిని సమత్వముతో పరశ్రేష్ఠునికి అర్పించి ఆయన ప్రసాదము వలన (కృపవలన), శాంతియు, మోక్షము శాశ్వత స్థితి - లిప్తత నుండి విడువబడి) లభించును. దీనినే యోగము అన్నారు.

యోగమని చెప్పుట దేహములో ప్రాణుని మూలకముగా జీవించు జీవిని ఆత్మ అన్నారు. ప్రస్తుతము ఆత్మునికి కర్మ బంధనము అజ్ఞాన ఆవరణము ఉండుటవలన అతడు ముక్తి కొరకు పరితపించు చున్నాడు. అతని ఉద్ధరణకు సాధన చేయవలసి యున్నది. అటువంటి ఆత్ముని క్షేత్రమైన ఈ ఘటాన్ని శరీరం అన్నారు. ముక్తి పొందు మార్గాన్ని యోగమన్నారు. ప్రాణశక్తి పరిపుష్టుడుగా ఉండుటకు దీని ఉపవర్గమైన వాయువును ఆయామములో అనగా దీని సహజమైన గతాగతిని ప్రాణాయామమన్నారు. శిశువుకు తల్లి గర్భములో ఉన్నపుడే ఈ సాధన సాగుచున్న ఒక క్రియ. తల్లి గర్భములో ఉన్నపుడు శిశువుకు అచ్చట స్థూల వాయువు యొక్క సంపర్కము ఉండదు. పితృదేహములో ఉన్న ప్రాణశక్తి మూలకముగా ఉత్పత్తియైన ప్రాణవాయువు ఆ ప్రాణుని స్పందన వలన ప్రాణాపానగతి నడచుచున్నది. శిశువు తల్లి గర్భము నుండి బయటపడిన తరువాత శ్వాసకోశములు విచ్చుకొనడము వలన శ్వాసోచ్ఛ్వాసములు నడుచున్నవి. శిశుదేహములో ప్రాణశక్తి స్పందనల వలన వాయువు క్రిందకు నొక్కబడుచున్నది. దీనినే అపానగతి అన్నారు. తిరిగి ప్రాణశక్తి ఆకర్షణ నుండి శ్వాసపైకి లాగబడడం వలన ప్రాణగతి అని అనుభవజ్ఞులు చెప్పియున్నారు. ప్రాణాపాన గతుల గురించి భగవద్గీతలో వివరణ ఇవ్వబడినది.

"అపానే జుహ్వతి ప్రాణం ప్రాణేపానం తథాపరే
ప్రాణాపాన గతీ రుద్ధ్వా ప్రాణాయామ పరాయణాః॥"
(అ4-శ్లో. 29)

క్రింది ముఖముగా వచ్చు వాయువును ప్రయత్న పూర్వకముగా పై ముఖముగా పంపు ప్రయత్నమే వాయు మథనము అన్నారు. ఈ క్రియ నుండి ఉత్పత్తి కాబడిన శంఖము నుండి కఫము నీరుగా మారుటవలన వాయు సంచార మార్గము స్వచ్ఛమగుచున్నది. మరియు వాయువునుండి విద్యుత్‌శక్తి వ్యాప్తి చెంది దేహమందలి కల్మషము లన్నింటిని భస్మం చేయుచున్నది. పైవన్నీ సాధ్యమగు చున్నది. ఈ బయటి గాలిని లోపలికి తీసికొని బయటకు వదలుట వలన గాదని తెలిసికొనవలెను. అందువలననే పతంజలి మహర్షి ఉచ్ఛ్వాస నిశ్వాస గతులను విచ్ఛేదముచేయుటయే ప్రాణాయామ మన్నారు. "శ్వాస – ప్రశ్వా సయోర్గతి విచ్ఛేదః ప్రాణాయామ" అనగా బయటిగాలి సహవాసము వదలిపెట్టవలె నన్నారు. అయితే ముక్కుతో గాలి పీల్చి విడుచు క్రమాన్ని పతంజలి మహర్షి చెప్పినారని వ్యాఖ్యానించుట తప్పు అని ప్రభువులు వివరించినారు.

వాయువు అన్ని భూతములందు ముఖ్యముగా పృథివి, తేజస్సు మొదలగు వాని యందు ప్రకాశమై వ్యాపించి యున్నది. ఇది వాయువుకు మాత్రమే సాధ్యము. మరి ఏ ధాతువుకు సాధ్యం కాదు. అందువలననే "తేన వినా తృణమపి న చలతి" అని వాయువును గూర్చి చెప్పబడినది. అట్లుగాక ఒక ఎండిన ఆకు కదలికకు పరమాత్ముని సంకల్పమని చెప్పుట వెర్రితనమని శ్రీగురువుగారు అన్నారు. కదలదు, మెదలదు నీదు సంకల్పము లేనిదే అనే విషయాన్ని పరమాత్మకు ఆపాదించడం తప్పు అభిప్రాయమని మన గురువుగారు అన్నారు. వాయువు ఆధారము పైనే జీవులు బతుకుచున్నవని తెలిసి వాయు జీవోత్తమ అని చెప్పబడినది. కావుననే వాయువు జీవులకు అత్యంత శ్రేష్ఠమైనది. మిత్రుడు అని పిలిచియున్నారు. వాయువును మహాభూతము అని కూడా అన్నారు.

అజ్ఞానావరణములో ఉన్నపుడు జీవి అనుచున్నారనేది శ్రీ శంకరాచార్యులవారి బోధ. అదే జీవిని ఆనందానుభూతిలో "ఆత్మ" అనుచున్నారు. మధ్వాచార్యులవారు కూడా ఈ రెండింటిని సమ్మతించినారు.



సమాధి అనునది రెండు విధములు. జడము, జాగృతి (తురీయము మరియు తురీయాతీతస్థితి) వీటినే అసంప్రజ్ఞాత మరియు సంప్రజ్ఞాత సమాధులని వివరించబడినది. "అహం బ్రహ్మాస్మి" అనువారు, తాము పెద్దవారని, తమకంటె పెద్దవారు లేరని, భ్రమలో పడినవారు. అసంప్రజ్ఞాత సమాధియే పై స్థాయిదని చెప్పువారు తప్పు అభిప్రాయములో ఉన్నారని ప్రభువులు వివరించినారు. సంప్రజ్ఞాత సమాధిలో మెలకువ మరియు శాంతి ఆనందానుభూతి కలిగియుండును. తానింకను తెలిసికొనవలెనని ఇచ్ఛ ఉండును. ఈ పరిస్థితిలో అతని గ్రాహకశక్తి ప్రముఖముగా ఉండును. ఇది యోగి యొక్క పైస్థితి. ఈ సమాధిస్థితిలో తాను తన మనోనేత్రము నుండి ఎంత దూరమున్న దానినైనా చూస్తున్నాడు. ఈ స్థితిలో ఆత్మదేహమును వదలి లోకలోకాంతరములకు వెళ్లి తెలిసికొన గల్గుచున్నది. మరియు చూచుచున్నది. జడసమాధి (అసంప్రజ్ఞాత సమాధి) సాధకుని యొక్క క్రింది స్థాయిదని శ్రీగురువుగారు చెప్పినారు. ఈ స్థితిలో మెలకువ ఉండదు. అయితే ఈ అనుభూతిలో కూడా సాధకునకు ప్రయోజన మున్నది. విద్యుత్ శక్తి దేహములో ఉత్పత్తియై వ్యయము (ఖర్చు) తక్కువై దేహమునందు ప్రజ్వలించుచున్నది. అది వ్యాపించక విశ్రాంతి పొందిన మనస్సు (ఇచ్ఛాశక్తి) బలమై ఇష్టార్థులను ప్రార్థించి సిద్ధిపొందుటకు సహకరించుచున్నది. దీనినే తపోజ్వాల అన్నారు.

"యజ్ఞశిష్టామృతభుజో యాన్తి బ్రహ్మ సనాతనమ్
నాయం లోకోస్త్య యజ్ఞస్య కుతో–న్యః కురుసత్తమ॥"

(భగవద్గీత – అధ్యా. 4 – శ్లోకం. 31)

కల్మషములను నశింపజేయు ఈ యజ్ఞము యొక్క చివరలో (సమాధియందు) ప్రాణము ఆత్మలో చేరినపుడు "అమృతము" ఉత్పత్తియై దేహమంతయు వ్యాప్తి చెంది సాధకుని మృత్యువు నుండి దూరము

చేయుచున్నది. అనగా ఇచ్ఛామరణము పొందగలుగు వాడగుచున్నాడు. దేహ త్యాగానంతరము శాశ్వతమైన బ్రహ్మలోకము చేరుచున్నాడు. ఈ యజ్ఞము చేయని వానికి ఇహలోక సుఖము లేదు. ఇక పరలోక సుఖమును గూర్చి ఆలోచనలేదు.

మనదేహమందలి జీవము (ప్రత్యగాత్మ) దీని ఇచ్ఛ అయిన మనస్సు ఒక్కటై యోగవిద్యలో సాగునపుడు, దేహము యొక్క సంపర్కములో ఉన్న వాయువు దోషములు నశించి తరువాత లక్ష్యమును (గురిని) తాకు మధ్యకాలములో బ్రహ్మరంధ్రము నుండి తత్‌సంబంధమైన ద్రవములు నోటిలో ఊరుచున్నవి. ఇవి మన దేహమునందలి గ్రంథుల ద్వారా (glands) పనిచేయుచున్నవి.

వీటిలో ఒకదానిని సోమపానము అన్నారు. దీని నుండి దేహము పరిశుద్ధతకు వచ్చు సహకారమున్నది. చివరకు ప్రాణాత్ముల ఐక్యతలో అమృతపానమై దేహములో నవచేతనము కలుగుచున్నది. ఆత్మకు ఆనందమనే స్థితి అనుభవమగుచున్నది. (In- organic enjoyment నిరేంద్రియానందాను భూతి) ఈ దేహ పరిశుద్ధతలో ఒక పరిమళమైన వాసన వచ్చుచున్నది. ఇది ప్రక్కవారికి కూడా వ్యాపించును. దీనినే "పృథివ్యాం పుణ్యగంధోస్మి" అన్నారు. నాభి నుండి బ్రహ్మరంధ్రము వరకు సాగు సాధనలో ఇది తెలియనగును. నోటియందు అనేకములైన రసములు కలుగుచున్నవి. యోగసాధనలో ముఖ్యమైనవి మూడురసములు. ప్రారంభములో లాలారసము కలుగును. దీనివలన జీర్ణశక్తి మెరుగుపడును. తరువాత కొంచెము మందమైన తీపిరసము. దీనినే మధురరసము అన్నారు. దీనివలన మనస్సునకు ఒక విధమైన తృప్తి కలిగి సాధనలో ఉత్సాహము కలుగును. ఆఖరుకు అక్షయమైన "అమృతము" కలుగును. దీని నుండి శాంతి, ఆనందము కలుగుచున్నవి. దేహానికి నవచేతనాన్ని కలుగజేయుచున్నది.



ఈ అనుభవములు కలిగిన తరువాత మనస్సు యొక్క స్థితి ఏ విధముగా ఉంటుంది ? అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఈ స్థితిలో మనస్సు బహిర్ముఖమైన తరువాత మొదటి వలె సులభముగా చంచలత్వానికి లోనుకాదు. అనుభవమైన శాంతి సుఖములను జ్ఞాపకమునకు తెచ్చుకొనుచూ క్షణికమైన సుఖానుభూతుల విషయములో ఉదాసీనమై ఉండగలదు. ప్రాణము మరియు ఆత్మల మిలనము వలన పురుష ప్రకృతి మేల్కొనుచున్నది. ఆత్మ ఎప్పుడూ క్రిందికి దిగిరాదు. మనో ప్రాణాలు మాత్రము ఆత్మ వద్దకు చేరుచున్నవి. మనస్సు యొక్క ఉచ్ఛస్థానము అనగా తన నిత్య ప్రవర్తనము బుద్ధితో కూడి యుండును. అనగా వివేకముతో కూడి ఉండును. అప్పుడు బుద్ధి మెలకువై బుద్ధిమంతుడనే స్థితి కలుగుచున్నది. ఇటువంటి బుద్ధి స్థానాన్నే మనము పొందవలసి యున్నది. భగవద్గీతలో "బుద్ధియోగో విశిష్యతే" అనియు "బుద్ధిపరతస్తుసః " అని చెప్పబడినదని శ్రీ గురువుగారు అన్నారు. ఈ స్థితి పొందిన తరువాత తనలో జ్ఞానదృష్టి ప్రకాశించు చున్నది. ఈ స్థితిలో భూత, వర్తమాన, భవిష్యత్తులు అన్నియు కనబడుచున్నవి. జ్ఞానికి భవిష్యతు గోచరించినను భయానికి ఆశ్చర్యానికి లోనుకాదు.

ఇచ్చట "చిత్" అనే మాటకు మనస్సు అని భ్రమించకూడదు. ప్రాణాయామ సాధన నుండి కలుగు అగ్నిపుటత్వము నుండి కల్మషములు భస్మమగుచున్నవి. ప్రకృతి యొక్క స్థూల ద్వేషాదులు విడువబడిన తరువాత మనస్సుకు ఏకాగ్రత కలుగుచున్నది. ఈ ఏకాగ్రతతో పరమాత్ముని ధ్యానించినపుడు దైవ కృపా పాత్రుడగు చున్నాడు. ఈ స్థితిలో "చిత్‌శక్తి" (జ్ఞానశక్తి) చైతన్య వంతమగుచున్నది. అప్పుడు శుద్ధమైనస్థితి కలిగినదని జ్ఞానదృష్టి చైతన్యమున్నదని చెప్పుచున్నారు. ఈ చిత్‌శక్తి ప్రభవించుటకు పరమాత్ముని కృపలేనిదే సాధ్యము కాదని గురువుగారు అన్నారు. అనగా అజ్ఞానావరణము తొలగిపోవుటకు దైవానుగ్రహము లేనిదే సాధ్యముకాదని

శ్రీగురువుగారు అన్నారు. పరమాత్ముని ప్రసాదమైన జ్ఞానమనే నేత్రము వలన జీవాత్ముడు అన్నింటిని చూడగల్గుచున్నాడు.

ఈ స్థితిలో జీవుడు చతుర్ముఖుడగుచున్నాడు. మనస్సు – బుద్ధి –చిత్ మరియు అహంకారములు నాలుగు అతని చతుర్ముఖములు. ఐదవ ముఖము భక్తి. ఈ భక్తి ఉంటేనే జ్ఞాని కూడా లోక కల్యాణ కార్యము చేసి "యోగి" అని అనిపించుకుంటాడు. ఇతడు గతించిన వాటిని గురించిగాని, ముందు జరుగబోవు వాటిని గురించిగాని, ప్రస్తుతము జరుగుచున్న వాటిని గురించి గాని చింతించి భ్రమించడు. చలించడు. నిర్లక్ష్యముగా ఉండును. తన జీవిత కాలములో చేయవలసిన కర్తవ్యమును గురించి గమనములో ఉంటాడు. ఇదియే మనోదృష్టి అని చెప్పబడినది. ఈ మనోదృష్టినే మనోవేగమని చెప్పెదరు. అతడు తాను ఉన్న చోటునే ఉండి తన ఇచ్ఛతో ఎక్కడ ఏమి జరుగుచున్నదో తెలిసికొనగలుగుచున్నాడు. ఇతనికి జన్మాంతర కర్మ (లోకకల్యాణ కార్యము) తప్పునది కాదు.

ప్రస్తుత కాలములో చాలా ప్రచారములో ఉన్న ప్రాణాయామ పద్ధతి, అనగా ముక్కు పుటములను చేతి వ్రేళ్లతో అదిమిపట్టి, ఒక ముక్కురంధ్రము నుండి బయటి గాలిని లాగుచూ మరియొక ముక్కు పుటము నుండి గాలిని బయటికి వదులుచూ కొంత సమయము చేసి తరువాత రెండు ముక్కుపుటములను అదిమిపట్టి లోపలి గాలిని బంధించుచున్నారు. వారి దృష్టిలో ఈ గాలిపైకి వెళ్లి బ్రహ్మరంధ్ర మందున్న ఆత్మను చేరునని వారి విశ్వాసము. గురువుగారు ఇది ప్రాణాయామ సాధన కాదన్నారు. ఈ పద్ధతివలన ప్రాణము పరిపుష్టుడు కాడు. అంతేకాకుండా తన్ను తాను తెలిసికొనుట గాని, పరశ్రేష్ఠుని తెలిసికొనుటగాని సాధ్యముకాదని గురువుగారిచే చెప్పబడినది.

మరికొంతమంది నోటినుండి గాలిని పీల్చుకొని బయటకు వదలుచూ తమ నాలుకను కొద్దిగా చీల్చి చిరునాలుకనుండి ముక్కుద్వారా వచ్చు గాలిని ఆ రంధ్రములలో చీలిన నాలుకను చేర్చి గాలిని



బంధించుచున్నారు. ఈ పద్ధతిని "లంబికా" యోగమని చెప్పుచున్నారు. ఈ పద్ధతి వలన దేహము భూమి నుండి కొంతవరకు పైకి లేచుచున్నది. దీనిని చూపరులు సిద్ధి అని భ్రమించుచున్నారు. ఆశ్చర్య చకితులగుచున్నారు. మరి కొంతమంది మనదేహములో ఆరు చక్రములున్నవని, మూలాధార చక్రములో "కుండలిని" శక్తి సుషుప్త స్థితిలో ఉన్నదని దానిని మెలకువ పరిస్తే అది వెన్నెముక ద్వారా తక్కిన చక్రముల ద్వారా వాటిని దాటి బ్రహ్మరంధ్రములో ఉన్న ఆత్మను చేరి అతనికి సర్వజ్ఞస్థితి, సర్వశక్తిత్వము, సదానంద స్థితి ప్రాప్తి కాగలదని చెప్పుచూ, దీనిని "కుండలిని" యోగమని చెప్పుచున్నారు. ఇది తప్పుగా గ్రహించబడినదని శ్రీ గురువుగారు చెప్పియున్నారు.

అన్నిచోట్ల వాయువు ఉన్నది. వాయువులో విద్యుత్ శక్తి ఉండనే ఉన్నది. దీనిని విజ్ఞానులు మానవ విద్యుచ్ఛక్తి అన్నారు. ప్రాణాయామ సాధన చేయునపుడు వాయువు యొక్క తీవ్ర గతాగతి యందు "విద్యుచ్ఛక్తి" వాయువు నుండి వేరై దేహములో పై భాగమునకు, క్రింది భాగమునకు వ్యాపించును. క్రింది ముఖమై వ్యాపించు ఆశక్తి సాధకుడు కూర్చున్నపుడు ఆసనము నుండి "మూలాధారము" బయటకు వచ్చి అచ్చట నుండి మరలా పైకి వెళ్ళి జనాంగమున ప్రవేశించి దానినుండి వెన్నెముక మధ్యభాగమున ఉన్న సూక్ష్మమార్గము మూలముగా పైకెక్కి బ్రహ్మరంధ్రమును ప్రవేశించును. అచట నుండి బయటకు వచ్చి వ్యాప్తి చెంది లోక లోకాంతరము చేరుచున్నది. దీనినే "తపోజ్వాల" అన్నారు జ్ఞానులు. తన కిష్టమైన దేవతనుండి వరములు ఆశించిన ఒక వ్యక్తి తపించినచో ఆ దేవతా దర్శనమై తాను కోరిన వరమును పొందవచ్చును. అయితే జ్ఞానాన్ని గాని, ముక్తిని గానీ పొందుటకు సాధ్యముకాదు. అందువలననే తపస్వి కంటే యోగియే శ్రేష్ఠుడని "తపస్విభ్యో అధికో యోగీ" అని భగవద్గీతలో చెప్పబడినది. కావున యోగవిద్య తెలిసిన వారి నుండి ఆ విద్యను పొంది సాధించవలెనని మన గురువుల బోధ.

* * *